# నెం.616

నవల

– కొమ్మూరి సాంబశివరావు



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 243

కౌముది మాసపత్రికలో

జనవరి 2021 సంచిక నుంచి ఫిబ్రవరి 2022 సంచిక వరకూ వచ్చిన

సీరియల్ నవల

## (ప్రారంభం)

**ప్రధానిమీద హత్యా ప్రయత్నం**

బొంబాయి ప్రత్యేక విలేఖరి

ఈరోజు సాయంకాలం ప్రధానమంత్రి బొంబాయి శివాజీపార్కు ఆవరణలో బహిరంగ సభలో వుపన్యసిస్తుండగా ప్రధానిని హత్యచెయ్యడానికి ఎవరో ప్రయత్నించారు. అదృష్టవశాత్తూ గుండు తగలకముందే, ప్రధాని కూర్చోవడంవల్ల గురి తప్పి, గుండు ప్రధాని వెనుక నిలబడివున్న ప్రధాని ప్రత్యేక రక్షణశాకాధికారి మహదేవ్‌కి తగిలింది. గుండు ఛాతీలో దిగబడింది. వెంటనే ఆస్పత్రిలో చేర్చబడ్డారు మహదేవ్. వారి పరిస్థితి చాలా తీవ్రంగా ఉంది.

సభాసదులలో ఎవరూ ఈ తుపాకీ పేల్చలేదనీ దూరంగా ఎక్కణ్ణించో ఏ మేడమీదనించో టెలిస్కోప్ లాంగ్ రేంజ్ రైఫిల్ ఉపయోగించి యీ దురాగతం ఎవరో తలపెట్టారని అధికారులు భావిస్తున్నారు. గుండు ఏ దిశనించీ వచ్చిందీ ఎవరూ గమనించకపోవడంవల్ల, శివాజీ పార్కుకి చుట్టూ ఎన్నో పెద్ద పెద్ద భవనాలూ, ఎన్నో అంతస్థులు కలవీ వుండడం వల్ల, అధికారులు యింతవరకూ హత్యాకాండ తలపెట్టిన దుర్మార్గుణ్ణి గురించి ఏమీ తెలుసుకోలేకపోయారు. కడపటి వార్తలను బట్టి స్థానిక పోలీసులకి సహాయంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉన్నతాధికారులూ, సైనిక యింటిలిజెన్స్ ఉన్నతాధికారులూ దర్యాప్తుకి పూనుకున్నారని తెలుస్తోంది. డిటెక్టివ్ యుగంధర్ పత్రిక మడిచి, బల్లమీద పడేసి, "నానాటికీ దేశంలో అరాచకం, దౌర్జన్యం ఎక్కువ అవుతున్నాయి. ప్రధానమంత్రిని హత్య చేసినంతమాత్రాన ఏం సాధించగలుగుతాను అనుకున్నాడు ఆ దుర్మార్గుడు. దేశమూ, ప్రభుత్వమూ ఒక్క మనిషి ప్రాణం మీద ఆధారపడిలేదు అని తెలియని బుద్ధిహీనుడు" అన్నాడు రాజుతో.

వ్యక్తిగతమైన కక్షలే కావచ్చు లేదా ప్రధాని రాజకీయ ఆదర్శాలతో ఏకీభవించని, దౌర్జన్యమే లక్ష్యంగా పెట్టుకున్న మనిషి కావచ్చు" అన్నాడు రాజు.

యుగంధర్ సిగిరెట్ వెలిగించి, కాదన్నట్టూ తల విదిలించి, "ప్రెసిడెంట్ కెనడీని యిదేవిధంగా ఏదో మేడమీదనించి, కిటికీలోనించి, లాంగ్‌రేంజ్ టెలిస్కోప్ రైఫిల్‌తో హత్య చేశాడని మర్చిపోయావేమో? ఆనాటి అమెరికాలో ఆయన జనాభాకి వచ్చిన విధానాలని, నిజానికి మానవజాతికి, ప్రపంచ శాంతికి పురోభివృద్ధిని కల్పించే విధానాలని అమలు పరుస్తున్నాడు కెనడి. అమెరికన్ ప్రెసిడెంట్‌కి వున్న అధికారాలు రాజకీయంగా వున్న బలం, మన సభ్యులూ ఆమోదించనిదే అంటే ప్రజాప్రతినిధులు అంగీకరించనిదే ఏ శాసనాలూ అమలు జరపలేడు. ఇక వ్యక్తిగతమైన కక్ష అంటావూ అలా వ్యక్తిగతంగా కక్షో, ద్వేషమో వుంటే దగ్గరగా వచ్చి ప్రధానిని కాల్చేవాడు. దూరంగా ఎక్కడో వుండి కాల్చి చంపడానికి ప్రయత్నించాడంటే తనెవరో తెలియకూడదు. తను పట్టుబడడం ఆ దుర్మార్గుడికి యిష్టంలేదు. మహాత్మాగాంధీని చంపిన గాడ్సేలాటి వాడూ కాడు యితను" అన్నాడు యుగంధర్.

"అంటే?" అడిగాడు రాజు.

యుగంధర్ నవ్వి "సి.బి.ఐ, మిలటరీ యింటిలిజెన్స్ పరిశోధన ప్రారంభించారు అంటే?" అని ఎదురు ప్రశ్న వేశాడు యుగంధర్.

"అంటే బండార్కర్" అంటున్నాడు రాజు.

టెలిఫోన్ గణగణ మోగింది. యుగంధర్ నవ్వి "బండార్కర్ అయ్యుండాలి. బొంబాయికో, ఢిల్లీలో విమానం ఎప్పుడో తెలుసుకో" అంటూ రిసీవర్ తీశాడు.

''ఐ వాంట్ మిస్టర్ యుగంధర్ ప్లీజ్''

''యుగంధర్ హియర్.. స్పీకింగ్'' యుగంధర్ కనుబొమలు చిట్లించాడు. అది బండార్కర్ కంఠస్వరం కాదు.

''ప్రధానమంత్రిపై జరిగిన హత్యాకాండ గురించి దర్యాప్తుకి పూనుకోవద్దు. మంచిది కాదు.''

''మీరెవరు?''

''మీ హితవు కోరేవాణ్ణి. ఈ హితవు పాటించకపోతే మీ ప్రాణాలకే ముప్పు.

యుగంధర్ నవ్వి ''నా ప్రాణాలు ఎప్పుడూ ముప్పులోనే ఉంటాయి'' అన్నాడు.

''పరిస్థితులు వేరు. ప్రధానినే చంపదలచుకున్న మాకు మీరు ఒక లెక్కా? జాగ్రత్త. మరొక హెచ్చరిక యివ్వను'' క్లిక్ మన్నది టెలిఫోన్.

యుగంధర్ రిసీవర్ పెట్టేశాడు.

ఇలాంటి బెదిరింపులు యుగంధర్‌కి కొత్తకాదు. రాజు ఎయిర్ టైమిగ్స్ చూసి ఏదో చెప్పబోతున్నాడు. అంతలో మళ్ళీ టెలిఫోన్ మోగింది. యుగంధర్ బద్ధకంగా రిసీవర్ తీసి ''యస్'' అన్నాడు.

''బండార్కర్ హియర్. మిస్టర్ యుగంధర్ వెంటనే మీరు బొంబాయి రావాలి. రాజుని, కాత్యాని తీసుకురండి. బహుశా పత్రికల్లో చదివేవుంటారు విషయం. అవసరమైతే ప్లేన్ చార్టర్ చెయ్యండి. డబ్బుకి వెనకాడకండి. ఏర్‌పోర్ట్‌లో చెపితే మీరు ఎప్పుడు వచ్చేదీ నాకు తెలియజేస్తారు'' ఊపిరి ఆడకుండా ఖంగారుగా చెప్పాడు సి.బి.ఐ డైరెక్టర్ బండార్కర్. యుగంధర్ రిసీవర్ పెట్టేసి రాజువైపు చూశాడు.

''ఇంకో నలభయి నిముషాలలో బొంబాయికి''

''వెరీగుడ్ కాత్యాని రెడీ అవమను. అవసరమైనవి. తెలుసుగా పాక్ చెయ్యి'' అని రిసీవర్ తీసి ఓ నెంబర్ తిప్పి.

''ఈజ్ యిట్ ఇండియన్ ఏర్‌లైన్స్? ఐవాంట్ త్రీ సీట్స్ టు బాంబే, థ్యాంక్యు. తిన్నగా ఏర్‌పోర్ట్‌కు వచ్చి టికెట్స్ తీసుకుంటాను. పేర్లా మిస్టర్ త్రిలోక్ చంద్, మిస్టర్ రజనీకాంత్, మిస్ శుభ'' అని రిసీవర్ పెట్టేశాడు యుగంధర్.

''ఎందుకు మారుపేర్లు?'' అడిగాడు రాజు.

''వ్యవధిలేదు తరువాత చెప్తాను. పాక్ చేసేశారా? కాత్యాని.''

''రెడీ''

''అయితే టాక్సీ...''

''తెస్తాను'' అన్నాడు రాజు.

టాక్సీ గిండీ దాటింది. సెయింట్ థామస్ మౌంట్ రోడ్ మీద వెళుతోంది.

''డ్రైవర్ క్విక్.... పైన ఒక పదిరూపాయలు ఇస్తాను'' అన్నాడు యుగంధర్. డ్రైవర్ స్పీడ్ ఎక్కించాడు. ఎక్కించిన నిమిషానికల్లా ఇంజన్ రెండుసార్లు దగ్గినట్టు దగ్గి ఆగిపోయింది.

''ఏమైంది?'' అడిగాడు యుగంధర్.

''తెలియదు సార్. చూస్తాను'' అంటూ డ్రైవర్ దిగాడు.

''రాజూ ఈ టాక్సీ రిపేర్ అయ్యేవరకు మనం కాచుకోవడానికి టైమ్ లేదు. ఏర్‌పోర్ట్ వైపు వెళ్ళే కారు ఏదయినా ఆపు'' అన్నాడు యుగంధర్. రాజు కార్లోంచి దిగబోతున్నాడు. అప్పటికే కారు దిగిన డ్రైవర్ రాజు ఛాతీమీదకి పిస్తోలు ఆనించి పెట్టి ''కదలొద్దు, మీరుకూడా యుగంధర్. కదిలారా రాజు ప్రాణాలు ఎగిరిపోతాయి. మేము హెచ్చరికలు తమాషాకి ఇవ్వం'' అన్నాడు.

అప్పుడే, అంత తొందరలో శత్రువులు ఎవరో వాళ్ళు తనని ఆటంకపరడానికి పూనుకున్నారన్నమాట. రాజు ఎంతుకింత తప్పు చేశాడు. తెలిసిన టాక్సీ డ్రైవర్ని ఎందుకు పిలవలేదు? అది తన తప్పు. టెలిఫోన్‌లో బెదిరింపు రాజుకి ముందే తను చెప్పవలసింది. ఇప్పుడేం చేయాలి? తను కదిలినా కాత్యా కదిలినా రాజు వూపిరి గట్టిగా పీల్చినా ఆ దుర్మార్గుడు పేలుస్తాడు. ఛాతీమీదికి అదిమిపెట్టాడు పిస్తోలు. గురి తప్పడానికి అవకాశం లేదు. రాజు ప్రాణం బలి అవుతుంది. ఏం చేయాలి? క్లిష్ట పరిస్థితులలో ఆలోచనలు పథకాలు, కిటుకులు శరవేగంతో మనసులో దొర్లుతాయి యుగంధర్‌కి. కానీ, ఇప్పుడు ఏమీ తోచడంలేదు. ఏం చేయాలి?

రాజు తనకై తనేం చేసే స్థితిలో లేడు. అతను కదిలితే ప్రమాదం.

''మమ్మల్ని ఇక్కడ కాస్సేపు ఆపినంత మాత్రాన నీకు ప్రయోజనం ఏమిటి? తర్వాతి విమానంలో వెళతాం'' అన్నాడు యుగంధర్.

టాక్సీ డ్రైవర్ నవ్వాడు. ''ఆ అవకాశం లేదు. మా వాళ్ళు ఇంకో ఐదు నిమిషాలలో వస్తారు. మీ ముగ్గుర్ని సురక్షితంగా తీసుకెళ్ళి బంధిస్తారు.''

''థాంక్‌యూ ఫర్ ది ఇన్ఫర్మేషన్'' అన్నాడు యుగంధర్. ఇక గత్యంతరం లేదు. అది ఉపయోగించకుండా ఇక్కడనుంచి తప్పించుకోవచ్చు అనుకున్నాడు. అయిదు నిమిషాలుంటే ఆ అవకాశమూ పోతుంది. చేతి గడియారం చూసుకున్నాడు. ''డామిట్! ఆగిపోయింది. టైం ఎంత?'' అన్నాడు యుగంధర్

టాక్సీ డ్రైవర్ కొంచెం ముందుకు వంగి డాష్ బోర్డు మీద గడియారం చూసి ''అయిదుంపావు'' అన్నాడు.

రెండోచేయి తీశాడు యుగంధర్.

''జాగ్రత్త'' అరిచాడు డ్రైవర్.

''రాజు ఛాతీమీద పిస్తోల్ పెట్టి వుంచగా నేను ఏం చెయ్యగలను'' అని నవ్వి, చేతి గడియారానికి కీ ఇస్తున్నాడు. ఇస్తూ తను ఊపిరి పీల్చడం మానేశాడు. ఎంతసేపు తను ఊపిరి బిగపట్టగలడో దానిమీద ఆధారపడి వుంటుంది తను జయించేదీ లేనిదీ. వాచ్ అడుగున చాలా ఘాటయిన మత్తుమందు వుంది. కీ యిస్తున్నప్పుడు ఆ మీట పైకి లాగాడు. పైకి లాగుతూ, బోర్డు టైం చూస్తున్నట్లు ముందుకి, డ్రైవర్ మొహం దగ్గరికి వొంగాడు. లోపల వాచ్‌లోంచి వస్తున్న ఆ ఘాటైన మత్తుమందుకి ఆ డ్రైవర్, రాజు, లోపల కూర్చున్న కాత్యా ముగ్గురికి తల తిరుగుతోంది. డ్రైవర్ చేతిలో వున్న పిస్తోలు నిలవడంలేదు. అతను కాళ్ళమీద నిలబడలేకుండా వున్నాడు. అంతే వెంటనే యుగంధర్ డ్రైవర్‌ని ఒక్క తోపు తోశాడు. డ్రైవర్ పిస్తోలుతో వెనక్కిపడ్డాడు. అతన్ని పట్టుకోవడం కోసం యుగంధర్ కాలయాపన చేయదలచుకోలేదు. ముందు డ్రైవర్ సీటులోకి వెళ్ళాడు. స్టార్ట్ చేశాడు. కారు ఒక్క వురుకున కదిలింది. యుగంధర్ కరకరమని గేర్లు మార్చాడు. వేగం హెచ్చించాడు.

''ఢాం!ఢాం!''

వెనకనించి పిస్తోళ్ళు పేల్పులు. యుగంధర్ మొహం బిగుసుకుపోయింది. తెగించినవాళ్ళు. సాయంకాలం వేళ అందులో ఆర్మీ కంటోన్మెంట్ వున్న ప్రాంతాల కార్లు, బస్సులూ, లారీలు వెళుతున్న ట్రంక్ రోడ్ మీద ధైర్యంగా పిస్తోలు పేలుస్తున్నారు. ఎప్పుడు గుండు

తన కారు టైర్‌కి తగులుతుందో, తగిలితే కం(ట్రోలు తప్పి ఏ యాక్సిడెంట్ అవుతుందో నరాలు బిగుసుకున్నాయి. మరింత వేగం హెచ్చించాడు. ఏర్‌పోర్ట్‌లోకి కారు తిప్పాడు.

వెనక వస్తున్న కారు ఏర్‌పోర్ట్‌కి రాలేదు. ఒక్క నిట్టూర్పు వదిలాడు యుగంధర్. శత్రువుల బారినుంచి ప్రస్తుతం తప్పించుకున్నాడు. స్పృహలేని రాజునీ, కాత్యానీ విమానంలో ఎక్కించాలి. అదీ సమస్యే ఆలోచిస్తూ కారు ఆపాడు యుగంధర్.

యుగంధర్ తిన్నగా ఏర్‌పోర్ట్ ఆపరేషన్ మేనేజర్ దగ్గిరకి వెళ్ళాడు. తన కార్డు, ఐడెంటిఫికేషన్ కాగితాలు చూపించి, కారులోంచి స్పృహలేని రాజునీ కాత్యానీ స్ట్రెచర్స్ మీద లోపలికి తీసుకువచ్చే ఏర్పాటు చేశాడు. అంతేకాదు. వాతావరణ పరిస్థితులు బాగాలేనందువల్ల బొంబాయి వెళ్ళే విమానం ఒక అరగంట ఆలస్యంగా బయలుదేరుతుందని ప్రకటన చేయించాడు. ఏర్‌పోర్ట్ ఎమర్జెన్సీ మెడికల్ రూంలోకి రాజునీ, కాత్యానీ తీసుకెళ్ళిన తర్వాత యుగంధర్ వెళ్ళి, తను ఇచ్చిన మత్తుమందుకి విరుగుడుగా స్మెల్లింగ్ సాల్ట్సు, అవీ వాసన చూపించి పదినిమిషాలలో వాళ్ళకి స్పృహ తెప్పించాడు. క్లుప్తంగా రాజుకీ, కాత్యాకి జరిగిందంతా చెప్పి, "మనం వేషాలు మార్చుకోవాలి. బొంబాయి విమానా(శయంలో మనల్ని ఎవరూ ఆఖరికి బండార్కరు కూడా గుర్తుపట్టకూడదు" అన్నాడు.

అంతే. పెట్టె తెరిచాడు రాజు. యుగంధర్ అరవయి ఏళ్ళ ముసలివాడిగా వేషం మార్చుకున్నాడు. పంచ, లాల్చీ వేస్టుకోటు మడత టోపీ, కళ్ళద్దాలు. రాజు తలకి విగ్గు పెట్టుకున్నాడు. హిప్పీలా వదులుగా పాంటు, పువ్వుల షర్టు, ఆడదో, మగవాడో అన్నట్టు మారిపోయాడు. కాత్యా పాతికేళ్ళ యువకుడిలా తయారయింది. పాంటు, షర్టు కోటు, టై, ఫెల్టుహేటు, సన్నని మీసాలు. ఆ గదిలోంచే యుగంధర్ మేనేజరుకి ఫోన్ చేశాడు.

"దయచేసి టికెట్ల పేర్లు మార్పించండి. వెయిటింగ్ లిస్టులో మాకు ఇచ్చినట్టు చేయండి నా పేరు సేట్ గోవిందదాస్, రాజు పేరు సుధాకర్.. కాత్యా పేరు ఎడ్మండ్" అన్నాడు.

"ఆల్‌రైట్ సార్. మీరు కోరినట్టు మీ ఆదేశాలని పాటించాలని, మాకు పై అధికారులనుంచి సాయంకాలమే ఆదేశం వచ్చింది."

యుగంధర్‌కీ, రాజుకీ, కాత్యాకి ముగ్గురికీ దూరదూరంగా వేరు వేరు సీట్లు యిచ్చారు. అదీ యుగంధర్ ఆదేశం ప్రకారం. అంతేకాదు, సెక్యూరిటీ చెక్ చేస్తున్నప్పుడు యుగంధర్, రాజుల జేబులలో పిస్తోళ్ళు కానీ, కాత్యా దగ్గరున్న పిస్తోలు కానీ చూసీ చూడనట్టు వూరుకున్నారు అధికారులు.

విమానం బయలుదేరింది. నిముషంలో నేలని వదిలి గాలిలోకి ఎగిరింది. ఒక్క సీటుకూడా ఖాళీగా లేదు. ఏర్ హోస్టెస్, బెల్ట్సు తీసెయ్యవచ్చని, సిగిరెట్స్ తాగేవాళ్ళు తాగవచ్చని స్పీకర్‌లో చెప్పింది. మరో ఇద్దరు హోస్టెస్‌లు, ఫలహారాల పళ్ళాలు తెచ్చిపెడుతున్నారు ప్రయాణీకులు బాగా వెనక్కి జారిగిలపడ్డారు. ఎవరో ఒకతను టాయిలెట్ గదివైపు వెళ్ళాడు. ఇంకో అతను లేచి నిలబడ్డాడు అదే సమయానికి. ఏర్‌హోస్టెస్ కాఫీలు తయారు చేసే చినన్ అరలాటి దాని తెర తోసుకుని, పైలెట్ కాబిన్‌లోకి వెళ్ళాడు. అంతా తృటికాలంలో యుగంధర్, రాజు, కాత్యాలు తప్ప ఎవరూ గమనించకముందే జరిగింది.

వెనుకవైపు వెళ్ళిన అతను బిగ్గరగా అరుస్తున్నాడు. ముందున్న అతను పెద్ద పిస్తోలు తీసి చేతిలో పట్టుకున్నాడు.

"దయచేసి ఎవరూ భయపడకండి. ఎవరికీ ఎటువంటి హానీ జరగదు. కదలకుండా ఎవరి కుర్చీలలో వాళ్ళు కూర్చోండి"

"ఏమిటిది?" అరిచాడు ఒకాయన.

"దీన్ని హైజాకింగ్ అంటారు" అన్నాడు యుగంధర్.

"ఔను. ఈ విమానం స్వాధీనం చేసుకున్నాం. కమాండర్ అంటే పైలెట్ దగ్గర మా మనిషి అతని కణతకి పిస్తోలు ఆనించి పెట్టాడు. చెప్పినమాట వినకపోతే అతని ప్రాణాలు, మన అందరి ప్రాణాలు పోతాయి. పైలెట్ బుద్ధిమంతుడు. చెప్పిన మాట వింటున్నాడు. అతను మాట్లాడతాడు వినండి" అన్నడు అతను.

"కమాండర్ జనార్ధన్ స్పీకింగ్. దయచేసి ప్రయాణికులు ప్రశాంతంగా అలజడి చేయకుండా వుండమని కోరుతున్నాను. ఈ విమానం ఏ కారణం వలల్ హైజాక్ చేస్తున్నదీ వీళ్ళు నాకు చెప్పలేదు. బొంబాయికి వెళ్ళకుండా బెంగుళూరువైపు త్రిప్పమన్నాడు. బెంగుళూరులో విమానం దింపడంలేదు. మీలో ఎవరికీ ఏ ఆపదా కలగకుండా చూసుకునే బాధ్యత నాది. అందువల్ల దయచేసి, నాతో సహకరించి మీరు మీమీ స్థానాలలో కూర్చుని, యీ హైజాకర్స్ చెప్పినట్టు చెయ్యకోరతాను" అన్నాడు.

ప్రయాణికుల మొహాలు పాలిపోయాయి. సిగిరెట్ వెలిగించపోయిన ఒకతను సిగిరెట్ వెలిగించకుండానే వుండిపోయాడు. ఒక తల్లి తన రెండేళ్ళ పిల్లవాణ్ణి కావలించుకున్నది.

"మీ కెవ్వరికీ ఎటువంటి హానీ చెయ్యడం మా ఉద్దేశ్యం కాదు. ఈ విమానంలో ముగ్గురు ప్రయాణీకులు వున్నారు. ఆ ముగ్గురు ప్రయాణీకులూ బొంబాయి చేరుకోకుండా వుండడమే మా యీ దౌర్జన్యానికి కారణం. వాళ్ళు ఎవరయినదీ మేము గుర్తుపట్టలేము వాళ్ళు ముగ్గురూ ఎవరో తెలుసుకున్న తరువాత విమానంలోంచి మేము పారాచూట్‌లతో దూకి వెళ్ళిపోతాం. ఆ తర్వాత మీరు సుఖంగా బొంబాయికి చేరుకోవచ్చు" అన్నాడు వెనక నిల్చున్న హైజాకర్.

"కమాండర్ జనార్ధన్ స్పీకింగ్. విమానాన్ని ఏ విమానాశ్రయంలోనో దింపి, రోజులపాటు విమానం నిలబెట్టి, అధికారులనించి గొంతెమ్మ కోరికలు కోరి, తిండికి, నీళ్ళకీ మనందర్ని అష్టకష్టాలు పెట్టి, చివరికి ఏం జరుగుతుందో తెలియని భయంలో పెట్టడంలేదు ఈ హైజాకర్స్. ప్రయాణీకులలో ముగ్గుర్ని తమ ఆధీనం చేసుకోవాలిట. అంతే వాళ్ళకి కావలసింది. తర్వాత పారాచూట్‌లో దిగిపోతారుట, బాగుంది. ఈ విమానంలో ఎక్కిన ప్రతి ప్రయాణీకుడూ ఉన్నత ఉద్యోగి అయినా, సామాన్యుడైనా, ప్రతిప్రాణి జీవితం కాపాడటం నా బాధ్యత. వాళ్ళు కోరే ముగ్గురి ప్రయాణీకుల్ని అప్పచెపితే ఏం చేస్తారంటే స్పష్టంగా చెప్పడం లేదు. కనుక ఈ హైజాకర్స్ ఆ విషయం చెప్పేటంత వరకు" పైలెట్ మాటలు ఆగిపోయాయి.

"మిస్టర్ యుగంధర్. ఈ విమానంలో మొత్తం 122 మంది ప్రయాణీకులు వున్నారు. వారిలో పసిపాపలు, స్త్రీలు వున్నారు. మీ ప్రాణాన్ని, మీ అసిస్టెంట్‌ల ప్రాణాలనీ కాపాడుకునేందుకు ఇంతమంది ప్రాణాలని బలిస్తారా? ఆలోచించండి. పది లెక్కపెడుతున్నాను. ఆలోగా యుగంధర్ మీరు ఏ మారువేషంలో వున్నారో నాకు తెలియదు. లేచి నిలబడకపోతే ముందు ఈ పసిపాపని షూట్ చేసి చంపేస్తాను" అంటూ ఒక తల్లిచేతిలో వున్న ఏడాది పసిపాపని ఒకచేత్తో లాగి, పట్టుకుని ఆ పాపమీద పిస్తోలు గురిపెట్టి "పిస్తోలు పాపమీద గురిపెట్టానని ధైర్యం చెయ్యకండి. వెనక మావాళ్ళు వున్నారు. ఇంకో పిస్తోలు పైలెట్ కణతకి ఆనించి వున్నది."

"లెఖ్ఖ పెడుతున్నాను. "ఒకటి..రెండు..మూడు.."

యుగంధర్ కళ్ళు మూసుకున్నాడు. ఎంత విషమ పరీక్ష తన ప్రాణం, రాజు, కాత్యాల ప్రాణాలు కాపాడుకోవడం కోసం ఆ పసిపాపని బలి యివ్వలా? ఆ పసిపాపని బలి యిచ్చినంత మాత్రాన తమ ప్రాణాలు నిలుస్తాయా? ఇలాగే ఇంకొకళ్ళ ప్రాణం తీస్తారు. ఇలా ఎందరి ప్రాణాలో ఏం చేయాలి? కనికరానికీ, ప్రాధేయతకీ లొంగే మనుష్యులు కారు వీళ్ళు.

"నాలుగు..అయిదు..ఆరు..."

తను లేచి నిల్చుని, తనే యుగంధర్ అంటే తెలుసు తక్షణమే వెనకనుంచి షూట్ చేస్తారు.

తర్వాత రాజుని, ఆ తర్వాత కాత్యాని.

"ఏడు... ఎనిమిది...తొమ్మిది"

ఇక యుగంధర్ సహించలేకపోయాడు. తను బ్రతికినా, ఈ ఆపదలోంచి తప్పుకుని ప్రాణాలతో బయటపడినా, ఆ పసిపాప ఏడ్పు, ఆ పాప తల్లి రోదన తనని జీవితాంతము వెంటాడుతుంది. ఆ బతుకు బ్రతకడం అనవసరం. లేవడానికి సంసిద్ధుడవుతున్నాడు.

"ఆగు! నేనే యుగంధర్ని.

యుగంధర్ వెనక్కి తిరిగి చూశాడు. లోలోన ఎక్కడో తనకి అనుమానం వుంది. ఇలాంటిది ఏదో జరుగుతుందని.

"షటప్ నువ్వు యుగంధర్వా? నువ్వు కాదు. నువ్వు ఎవడో పిచ్చివాడివి అయ్యుండాలి చావుని కోరుకుంటున్నావంటే. యుగంధర్ పొడుగు, యుగంధర్ దర్పము నీకేవి. ఎవరో కుర్రకుంకవి. కూర్చో" అని

"యుగంధర్ అంత పిరికివాడివా? పసిపిల్లల ప్రాణాన్నేకాక, ఇంతమంది ప్రాణాల్ని నీ ప్రాణంకోసం బలి ఇస్తావా? లే లేచి నిల్చుని ధైర్యంగా నువ్వు ఎవరో చెప్పు" అరిచాడు పసిపాపని పట్టుకున్న అతను.

"నేనే యుగంధర్ని. ధైర్యముంటే చంపు" అన్నాడు ఆ యువకుడు మళ్ళీ.

"నిన్ను చంపితే మాకు ప్రయోజనం లేదు. యుగంధర్ ఇంకొకసారి మళ్ళీ లెక్కపెడుతున్నాను. ఇదే ఆఖరుసారిగా ఒకటి...రెండు...మూడు"

యుగంధర్ కళ్ళు మూసుకున్నాడు. తను యుగంధర్ే అని లేచి నిల్చుని తన ప్రాణాన్ని త్యజించడానికి సిద్ధపడిన యువకుడు ఎవరోకాదు. కాత్యా ఎంత ధైర్యం చేసింది.

"నాలుగు...అయిదు..ఆరు..ఏడు..ఎనిమిది."

"ఆగు. నేనే యుగంధర్ని."

ఆ హైజాకర్ ఉరిమి చూశాడు నిలబడ్డ ఇంకో వ్యక్తిని. "నీక్కూడా పిచ్చిపట్టిందా? నువ్వు యుగంధర్ అంటే ఎవరన్నా నమ్ముతారా? పులికీ, పిల్లికీ వున్నంత తేడా వుంది. స్టుపిడ్ కూర్చో" అని

"యుగంధర్ నీకింగా సిగ్గురాలేదా? నీ ప్రాణాలని రక్షించాలని ఎవరెవరో నీకోసం తమ ప్రాణాలని" అంటున్నాడు

అంతలో కమాండర్ జనార్ధన్ "నా కణతకి పిస్తోలు ఆనించి పెట్టి వున్నా, అక్కడ జరుగుతున్నదీ మాట్లాడుతుననదీ వింటున్నాను. యుగంధర్ అంటే ప్రఖ్యాత డిటెక్టివ్ యుగంధర్. మన దేశాన్ని విదేశ విద్రోహులనించి, ఎన్నోసార్లు రక్షించిన మహాప్రజ్ఞాశాలి. దేశభక్తుడు. ఎటువంటి పరిస్థితులలోనూ యుగంధర్ ప్రాణానికి హాని కలగకూడదని, బెంగుళూరు కంట్రోల్ టవరునించి నాకు వైర్‌లెస్ వార్త వచ్చింది. నేను నిస్సహాయుణ్ణి. ప్రయాణీకులు మీరే యుగంధర్ని కాపాడాలి."

**యుగంధర్** తల వంచుకున్నాడు. రక్షించవలసిన వాడు తను. తనవల్ల ఇందరు యింత ఆపదకి లోనైనారు. ఇప్పుడు తన ప్రాణాన్ని రక్షించే భారం ఈ అమాయిక, నిస్సహాయ ప్రయాణీకులదా? మే చేయాలి? ఏది న్యాయం? యుగంధర్ లేచి నిల్చోబోతున్నాడు.

"నేనే యుగంధర్ని."

వెనక్కి తిరిగి చూశాడు. ఏభై ఏళ్ళ అతను నిలబడ్డాడు.

"నేనే యుగంధర్ని" అరవయ్యేళ్ళ అతను ముందుసీట్లో నిల్చున్నాడు.

"ఆడవేషం వేసుకుని వచ్చాను. నేనే యుగంధర్ని."

లావుగా, భారీగావున్న ఒక నలభయియేళ్ళ యువతి నిల్చున్నది. అలా ఒక ముప్పయిమంది, యుగంధర్ని నేనే అంటూ లేచి నిల్చున్నారు.

యుగంధర్కి తెలియకుండానే గుండె గర్వంతో నిండిపోయింది.

తన ప్రాణాన్ని కాపాడడానికి ఇంతమంది సిద్ధపడ్డారా? అంతమాత్రాన అందరి ప్రాణాలు తను బలి యిస్తాడా. ఈ హైజాకర్స్ని ఎలా లొంగతీయడం. అక్కడున్న ఇద్దర్నీ ఎలాగో బలప్రయోగంతో, కిటుకులతో లొంగదీసుకున్నా కేబిన్లో వున్న కమాండర్ జనార్ధన్ ప్రాణం విషయం.

"ఆగండి. అందరూ అబద్ధాలు చెప్పకండి. నాకోసం మీ ప్రాణాలు త్యజించకండి. నేనే యుగంధర్ని" అంటూ లేచి నిలబడ్డాడు యుగంధర్.

పకపకా నవ్వాడు హైజాకర్. "ముసలివాడివి. నడుం వొంగి తల మెడమీద నిలవడంలేదు. నువ్వు యుగంధర్వా? ప్రయాణీకులారా! ఆ యుగంధర్ ప్రాణాలని కాపాడడానికి మీరు మీ మీ ప్రాణాలని ఆపదలోకి తెస్తున్నారు. అందరూ కూర్చోండి. అసలు యుగంధర్ నిలుచోవాలి. లేదా ఈ పాప" అంటూ పిస్తోలు పాప తలమీద గురిపెట్టి మీటమీద వేలుపెట్టాడు హైజాకర్.

ఏం జరిగిందో ఎవరికీ తెలియలేదు. విమానం యిటూ, అటూ మబ్బుల్లో యిరుక్కున్నప్పుడు పైకీ కిందకీ, ఎగిరిపడినట్టుగా పక్కలకి యిటూ అటూ వొంగిపోతోంది. పైన రాక్స్లో వున్న కోట్సు, బ్లాంకట్సూ, కిందపడుతున్నాయి. నిల్చున్నవాళ్ళు నిలుచోలేక, అటూ యిటూ పడుతున్నారు. కుర్చీలో కూర్చున్నవాళ్ళు ఉయ్యాలలో ఊగుతున్నట్లు ఊగుతున్నారు.

"ఢాం"

"ఢాం"

రెండుసార్లు పిస్తోళ్ళు పేలాయి. ఎవరు ఎవర్ని కాల్చారో ఎవరికీ తెలియదు. ఎవరూ తెలుసుకునే, పట్టించుకునే స్థితిలో లేరు. పిల్లల ఏడుపులు, ఆడవాళ్ళ అరుపులు, మొగవాళ్ళ కేకలు, విమానం పడిపోతుందనే భయంతో, స్థయిర్యమూ, ధైర్యమూ పోగొట్టుకున్న ప్రయాణీకుల రోదనలతో, విమానం హోరుతో ఎగిరి ఎగిరిపడుతూ, పక్కలకి వొంగి లేస్తూ దారీ తెన్నూలేకుండా రెక్కలు విరిగిన పక్షిలా పడిపోతున్నట్లున్నది.

"ఫ్లయిట్ నెంబర్ 707 - కమాండర్ జనార్ధన్... రిపోర్టింగ్ కంట్రోల్ రూం."

"కంట్రోల్ రూం. కాన్టాక్ట్. ఎస్టాబ్లిష్డ్ రిపోర్ట్!"

"మూడు శవాలు, లాండింగ్ క్లియరెన్స్ ప్లీజ్."

"క్లియరెన్స్ - రన్ వే ఫోర్. మూడు శవాలు ఎవరివి?"

"తెలియదు."

"కంట్రోల్ రూం... అర్జంట్ ఇన్ఫర్మేషన్... డిటెక్టివ్ యుగంధర్ సేఫ్? రిపోర్ట్"

"సారీ! ఇన్ఫర్మేషన్, యుగంధర్ డెడ్"

"ఫ్లయిట్ 707, కమాండర్ జనార్ధన్!"

"యస్ రిపోర్టింగ్ కమాండర్ జనార్థన్ లాండింగ్. రన్ వే ఫోర్"

"యుగంధర్ చనిపోయారా? రాజు? కాత్యా?"

"ముగ్గురూ చనిపోయారు. సారీ నేనేం చేయలేకపోయాను."

"హైజాకర్స్?"

"పారాచూట్సుతో దిగేశారు."

"ఆల్ రైట్ క్లియరెన్స్ ఫర్ లాండింగ్. ఆంబులెన్స్ కమింగ్."

## 2

చేతికర్ర సహాయంతో సేట్ గోవిందదాస్ మెట్లు దిగాడు. చేతిలో పెద్ద బ్రీఫ్‌కేస్ తీసుకుని సుధాకర్, భుజానికి పెద్ద హేండ్‌బేగ్ వేళ్ళాడేసుకుని ఎడ్మండ్ విమానం దిగారు. సేట్ గోవిందదాస్ నెమ్మదిగా నడుస్తున్నాడు. తతిమ్మా వాళ్ళందరూ త్వరత్వరగా వెళ్ళిపోతున్నారు.

స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ బండార్కర్ తలవంచుకుని, విచారంతో నెమ్మదిగా విమానంవైపు వెళుతున్నాడు. బండార్కర్‌కి ఎదురుగా వచ్చి సెల్యూట్ చేశాడు కమాండర్ జనార్థన్. తలవూపి, బండార్కర్ ముందుకి సాగిపోతున్నాడూ. అతని పక్కనే నడుస్తూ, ఏదో చెపుతున్నాడు కమాండర్.

సేట్ గోవిందదాస్ పెట్టెలు రెండూ వచ్చేందుకు దాదాపు అరగంట పట్టింది.

టాక్సీ ఎక్కి "హోటల్ రంజిత్" అని చెప్పాడు డ్రయివర్‌కి. దాదాపు ముప్పావుగంట పట్టింది రంజిత్ హోటల్ చేరుకునేందుకు.

"గది రిజర్వ్ చేసుకున్నారా?" అడిగాడు హోటల్ రెసెప్షనిస్టు.

"లేదు. ఖాళీలేదా?"

"చూస్తానుండండి. డబుల్ రూం వుంది. సింగిల్ రూం లేదు."

"అదే యివ్వండి" అన్నాడు ఆయాసంతో సేట్ గోవిందదాస్.

హోటల్ కుర్రాడు సామానులు లిఫ్ట్‌లో పెట్టాడు. మూడో అంతస్తులో వున్న గదికి చేరుకున్నాడు గోవిందదాస్. గది తలుపు తెరిచి, సామానులు పెట్టి ఏమైనా కావాలా సార్?" అడిగాడు బాయ్.

"ఒక కప్పు కాఫీ" అన్నాడు గోవిందదాస్. హోటల్ బాయ్ గది తలుపు దగ్గరకేసి వెళ్ళిపోయాడు. గోవిందదాస్ టెలిఫోన్ రిసీవర్ తీసి "ప్లీజ్ గివ్ మీ ద కనెక్షన్ టు హోటల్ రాజధాన్"

"యస్ సార్. స్పీక్ ఆన్"

"హల్లో, మీ హోటల్‌కి సుధాకర్ అనే అతను వచ్చి వుండాలి. అతని రూంకి ఫోన్ కనెక్ట్ చేస్తారా?"

"యస్.. సర్"

అంతలో తలుపు తెరుచుకుంది. రూంబాయ్ ట్రేలో కాఫీ పాట్, కప్పు తీసుకుని వస్తున్నాడు.

"హల్లో" అన్నాడు గోవింద దాస్. రూంబాయ్ ట్రే బల్లమీద పెట్టి గోవిందదాస్ చేతిలో ఫోన్ తీసుకుని హుక్ మీద పెట్టి, "మీ అసిస్టెంట్‌తో తర్వాత మాట్లాడవచ్చు... అవకాశం వుంటే" అన్నాడు. రివాల్వర్ గోవిందదాస్ ఛాతీమీదకి గురిపెట్టి.

"ఏమిటిది?" అన్నాడు గోవిందదాస్.

"బొత్తిగా మేము అంత చవటలమని ఎందుకు అనుకున్నారో అర్థంకాలేదు మిస్టర్ యుగంధర్. కదలవద్దు. అలాగే కూర్చోండి. సైలెన్సర్ వున్న రివాల్వర్ ఇది" అన్నాడు రూంబాయ్ వేషంలో వున్న అతను.

"ఎవరు నువ్వు?" అడిగాడు మారువేషంలో వున్న యుగంధర్.

"మర్చిపోయారా? ఇదివరలో మనం ఒకసారి తటస్థపడ్డాం. అప్పుడు నా కోడ్ నెంబర్ వేరు."

"ఇప్పుడు?" అడిగాడు యుగంధర్.

"నెం 616" అంటూ రూంబాయ్, యుగంధర్‌కి దూరంగా కుర్చీలో కూర్చుని రివాల్వర్ యుగంధర్ వైపు సూటిగా గురిపెట్టి వుంచి "తలుపు లోపల తాళం వేశాను. బయట 'డునాట్ డిస్టర్బ్' బోర్డు వుంది. ఎవరూ రారు. సావధానంగా మాట్లాడుకోవచ్చు" అన్నాడు 616. టెలిఫోన్ మోగింది. అయినా యుగంధర్ తియ్యలేదు. యుగంధర్ ఆశ్చర్యానికి అంతులేదు. లక్షా, తొంభయి ప్రశ్నలు మెదడులో తిరుగుతున్నాయి. యుగంధరూ, రాజూ, కాత్యా చనిపోయారని కమాండర్ వార్త పంపాడే తను బతికే వున్నాడని యీ 616కి ఎలా తెలుసు? తనని చంపడానికి ప్రయత్నించిన యీ శత్రుకూటం తనని షూట్ చెయ్యకుండా 616 కబుర్లు చెప్పడానికి కుర్చీ లాక్కుని కూర్చున్నాడెందుకు? రాజు.. కాత్యాలు..

"మిస్టర్ యుగంధర్ మీ మొహంలోనే కనిపిస్తోంది మీ ఆశ్చర్యం. మిమ్మల్ని చంపమని నేను మా వాళ్ళకి చెప్పలేదు. అంటే హైజాకర్స్‌కి. మిమ్మల్ని కూడా పారాచూట్‌లో విమానంలోంచి దింపమని చెప్పాము. అందుకే మీ అంత బలవంతుణ్ణే పంపాము. మా హైజాకర్స్ పారాచూట్‌లో దిగగానే మాకు వైర్‌లెస్ ద్వారా వార్త పంపమనీ చెప్పాము. ఆ వార్త రాలేదు. దాన్నిబట్టి, మావాళ్ళని ముగ్గుర్నీ మీరు చంపేశారని గ్రహించాము. యింకా చెప్పాలా?"

"అవసరంలేదు. నేను ఎవర్నో తెలుసుకున్నారు. తర్వాత?" అడిగాడు యుగంధర్.

మళ్ళీ టెలిఫోన్ మోగింది. యుగంధర్ టెలిఫోన్ వైపు ఒకసారి చూసి వూరుకున్నాడు.

"మా ముఠావాళ్ళని ముగ్గుర్నీ చంపినందుకు, మిమ్మల్ని యిప్పుడు యీ క్షణం కాల్చి చంపాలి. నాకు చంపాలనే వుంది. కానీ మిమ్మల్ని చంపవద్దని నాకు ఆజ్ఞ" అన్నాడు 616.

"ఎవరిచ్చారు ఆ ఆజ్ఞ?" అడిగాడు యుగంధర్.

"మీకు అనవసరం. మీరు తప్పించుకోడానికో, నన్ను చంపేందుకో ప్రయత్నిస్తే మిమ్మల్ని చంపేందుకు క్షణం కూడా సందేహించనని చెప్పేందుకే మీకు యీ విషయం చెప్పాను. అంతేకాదు. మీ అసిస్టెంట్ రాజు కానీ, కాత్యా కానీ మీకు సహాయానికి వస్తారని ఆశించవద్దు. ఈపాటికి వాళ్ళూ బంధితులయి వుంటారు. రాజధాని హోటల్‌లో వున్న రాజూ, లోడీ హోటల్‌లో వున్న కాత్యా."

యుగంధర్ చిరునవ్వు నవ్వాడు.

"అవును. బండార్కర్‌కి కూడా తెలియకుండా మారువేషాలలో వస్తే, మా కళ్ళకి గంతలు కట్టి తప్పించుకోవచ్చు అనుకున్నారు. అదే మీరు చేసిన పెద్ద పొరపాటు."

"అలాగా!" అన్నాడు యుగంధర్.

"ఇంకో పదినిముషాలలో మా మనుష్యులు వస్తారు. మిమ్మల్ని సురక్షితంగా యీ హోటల్‌లోంచి తీసుకుని వెళతాము."

"ఎలా?" అడిగాడు యుగంధర్.

"చెప్పదంటు ప్రశ్నలు వెయ్యకండి. సేట్ గోవిందదాస్‌గా కాక తప్పతాగిన స్నేహితుడిగా తీసుకుని వెళతాము యీ గదిలోంచి. ప్లీజ్ మళ్ళీ ఆ రిస్టువాచీ కిటుకు ప్రయత్నించవద్దు. రివాల్వర్ మీద వేలునొక్కిపెట్టి వుంచాను" అన్నాడు 616 నవ్వుతూ.

యుగంధర్ మనస్సు ఆలోచనలతో పరుగులు తీస్తోంది. పదినిముషాల్లో వస్తారు 616 మనుషులు. ఆలోగా తను యీ దుర్మార్గుల బారినుండి తప్పించుకోవాలి. ఏం చెయ్యాలి? ఎలా? రివాల్వర్ ఛాతీమీద గురిపెట్టి వుంచాడు. గురి తప్పదు. బలప్రయోగం ప్రయోజనం లేదు. తను కదిలితే పేలుస్తాడు. గదిలో చడీచప్పుడూ లేదు. ఆ యిద్దరి ఉఛ్వాస నిశ్వాసాలు తప్ప ఆ యిద్దరి చేతి గడియారాల టకటక తప్ప.

యుగంధర్ పకపకా నవ్వాడు. విరగబడి నవ్వాడు.

616 ఆశ్చర్యంతో "ఎందుకా నవ్వు?" అడిగాడు.

"ఎవరు ముందు వస్తారో చూడాలి" అన్నాడు.

"చెప్పాగా మీ రాజు.."

"నో..నో..రాజు, కాత్యాలు కారు. కమాండర్ జనార్ధన్‌కి నిజం తెలుసు. బండార్కర్‌కి చెప్పమన్నాను. అంతేకాదు, స్థానిక పోలీసులకి వెంటనే ఫోన్ చేసి కాపలా వుంచమన్నాను."

"బండార్కర్ ముందు వస్తే మీ ప్రాణం, బండార్కర్ ప్రాణం పోతుంది" అన్నాడు 61ఆ6.

"ఫూలిష్‌గా మాట్లాడక. నీ వెనక ఆ తెరవెనక ఇద్దరు సాయుధ డిటెక్టివ్‌లున్నారు."

"నేను నమ్మను. అయినా వాళ్ళు నన్ను కాల్చేలోపున.."

"స్టుపిడ్ నువ్వు రివాల్వర్ నా ఛాతీమీదకి గురిపెట్టావు. బల్లమీద వున్న ఫ్లవర్ వాజ్ అడ్డం వుంది. నువ్వు రివాల్వర్ పైకెత్తేలోపున" అంటున్నాడు యుగంధర్.

తలుపు చప్పుడయింది. 616 రివాల్వర్ కొంచెం పైకి ఎత్తుతున్నాడు. అదే అదను. అదే అవకాశం కోసం కాచుకున్నాడు యుగంధర్. ముందున్న బల్లని ఒక్క తన్ను తన్నాడు. ఆ బల్ల 616మీద పడింది. ఆ బల్ల బరువుకి 616 కుర్చీతో సహా వెనక్కి పడ్డాడు. మెరుపులా లేచాడు యుగంధర్. బూటు కాలితో 616ని కణతమీద ఒకతన్ను తన్నాడు. అరగంటవరకు 616కి స్పృహరాదని యుగంధర్‌కి తెలుసు. తలుపు తెరుచుకుంటోంది. వ్యవధిలేదు. యుగంధర్ ఒక అంగన తలుపు చేరుకున్నాడు. పక్కగా నిలబడ్డాడు తలుపుకి. తలుపు తెరుచుకుంది. ఇద్దరు చేతుల్లో రివాల్వర్స్ పట్టుకుని గదిలోకి వచ్చారు. ఒకడు వెంటనే తలుపు మూశాడు కాలితో.

"టైముకు వచ్చాం సార్" అంటున్నాడు ఒకడు.

యుగంధర్ పిడికిళ్ళు బిగించాడు. ప్రస్తుతానికి అవే తన ఆయుధాలు. ఆ యిద్దర్నీ వెనకనించి మెడమీద ఒకేసారిగా కొట్టాడు. ఇనపగుళ్ళతో కొట్టినట్లయింది వాళ్ళకి. స్పృహ తప్పి ముందుకు పడ్డారు వాళ్ళు.

యుగంధర్ ఆయాసంతో ఒక్క నిట్టూర్పు వొదిలి తలుపు లోపల గడియపెట్టాడు.

**3**

కమాండర్ జనార్ధన్ చెప్పిన విషయాలు వినగానే బండార్కర్ మొహం వికసించింది. "థాంక్ యు కమాండర్" అని స్ట్రెచర్ మీదవున్న శవాలని చూసి కళ్ళు తుడుచుకుని, ఏర్‌పోర్ట్ బిల్డింగ్‌వైపు తిరిగాడు. తిన్నగా ఏర్‌పోర్ట్ సెక్యూరిటీ చీఫ్‌ని కలుసుకుని, ఆ మూడు శవాలని మార్చురీకి చేర్చమనీ, తను చెప్పేటంతవరకూ శవపరీక్ష చేయవద్దనీ ఆదేశించాడు.

యుగంధర్ ఎక్కడికి వెళ్ళాడు? ఎక్కడో బసచేసి వుంటాడు. బహుశా తిన్నగా తన ఆఫీసుకి వెళ్ళివుంటాడేమో అనుకుంటూ కారు పార్కింగ్ స్పేస్‌వైపు నడుస్తున్నాడు.

"సర్! సర్!" బండార్కర్ ఆగి "యస్?" అన్నాడు. ఎవరో పన్నెండేళ్ళ కుర్రాడు, షూ పాలిష్ కుర్రాడిలా వున్నాడు. బండార్కర్‌కి ఒక చిన్న చీటీ యిచ్చాడు.

"హోటల్ గ్రీన్‌లాండ్స్, రూం నెంబర్ 20"

"ఎవరిచ్చారు?" అడిగాడు బండార్కర్.

"ఎవరో ఒక ముసలాయన మీ కారు చూపించి, మీ కారు దగ్గరకి వెళ్ళి, మీ ఆనవాలు చెప్పి, అలాటి ఆయనకి యివ్వమన్నారు."

"వెరీగుడ్ థాంక్యూ మై బాయ్" అని బండార్కర్ ఒక రెండు రూపాయలు ఆ కుర్రాడికి యిచ్చి, కారు ఎక్కాడు.

అరగంట తర్వాత హోటల్ గ్రీన్‌లాండ్ ముందు ఆగింది. బండార్కర్ లిఫ్టులో తిన్నగా రూం నెంబర్ 20కి చేరుకున్నాడు. యుగంధర్ చాలా జాగ్రత్త తీసుకుంటున్నాడు. అనవసరం. బాహాటంగా వచ్చినా, ఆ దుర్మార్గులు ఏం చెయ్యగలరు? తను తగిన రక్షణ సిబ్బందిని ఏర్పాటు చేశాడు. విడిగా విమానాలు ఛార్టర్ చేసుకునుంటే అసలు యీ హైజాకింగ్ జరిగేదికాదు. అయినా మద్రాసు విమానాశ్రయంలో అంత జాగ్రత్త, రక్షణ వుండగా ఆ హైజాకర్స్ ముగ్గురూ ఎలా ఆయుధాలతో విమానం ఎక్కారు? డిపార్టుమెంటల్ ఎంక్వయిరీ చేయించాలి. మంత్రులు, యింకా ఉన్నతాధికారులు, సామాన్యమైన ప్రయాణీకులతో విమానాలల్లో ప్రయాణం చేస్తున్న యీ రోజుల్లో, హైజాకింగ్‌కి అవకాశం వుండకూడదు. చనిపోయిన ఆ ముగ్గురు హైజాకర్స్ ఎవరో తెలుసుకోవాలి. ఆలోచిస్తూ బండార్కర్ రూం నెంబర్ 20కి చేరుకున్నాడు. బజర్ నొక్కాడు.

"కమ్ యిన్" అన్న మాటలు వినిపించాయి.

తలుపు పిడితిప్పి అడుగుపెట్టాడు లోపలికి. స్ప్రింగ్ తలుపు మూసుకుంది. "మిస్టర్ యుగంధర్" అంటున్నాడు. తలమీద గట్టిదెబ్బ. ఏ పిస్తోలు పిడితోనో కొట్టినట్టయింది. ముందుకు నేలమీద కూలిపోయాడు కుప్పగా.

## 4

రూంబాయ్ వెళ్ళగానే రాజు తలుపు లోపల గడియపెట్టి తన విగ్గు, మారువేషం తీసెయ్యాలా? యుగంధర్‌కి తనే ముందు ఫోన్ చెయ్యాలా అని ఆలోచిస్తూండగా టెలిఫోన్ మోగింది. ఆపరేటర్ "యస్ సర్" అనడం వినిపించింది. తర్వాత "హల్లో" అన్న యుగంధర్ కంఠస్వరం.

"హల్లో సర్"

జవాబు లేదు. క్లిక్ మన్నది టెలిఫోన్ డిస్కనెక్ట్ చేసినట్టు. రాజు రిసీవర్ టాప్ చేశాడు. హోటల్ ఆపరేటర్‌ని అడిగాడు లైన్ ఎందుకు కట్ అయిందని. లైన్ కట్ కాలేదనీ, అవతల టెలిఫోన్ పెట్టేశారనీ చెప్పింది. "హల్లో" అన్న యుగంధర్, తర్వాత ఏమీ

మాట్లాడకుండా ఎందుకు రిసీవర్ పెట్టేశారు. రిసీవర్ తీసి హోటల్ రంజిత్‌కు రూం నెంబర్ 321కి కనెక్ట్ చెయ్యమని అడిగాడు రాజు. టెలిఫోన్ అవతల మోగుతున్న చప్పుడు వినపడింది. ఎవరూ తియ్యలేదు. "నో రెస్పాన్స్ సర్" అన్నది ఆపరేటర్.

"ట్రై ఎగైన్ ఆఫ్టర్ ఫైవ్ మినిట్స్" అన్నాడు రాజు.

కుర్చీలోంచి లేచి పచార్లు ప్రారంభించాడు. ఏమిటిది? ఎందుకు యుగంధర్ గదిలో లేడు.

'హల్లో' అన్న మనిషి ఏమయ్యాడు?

టెలిఫోన్ గణగణ మోగింది. సంతోషంతో రిసీవర్ తీశాడు. "మళ్ళీ ప్రయత్నించాను సర్. హోటల్ రంజిత్ రూం నెం.321 నించి రెస్పాన్స్ లేదు" అన్నది ఆపరేటర్. రాజు రిసీవర్ విసుగ్గా పెట్టేశాడు. యుగంధర్‌కి ఏదయినా ఆపద కలిగిందా? ఎలా కలుగుతుంది? మారువేషంలో మారుపేరుతో యుగంధర్ చనిపోయినట్టూ భ్రమ కల్పించారే. శత్రువులకి ఎలా తెలుస్తుంది? హోటల్ గదిలో తలుపు గడియపెట్టుకున్న యుగంధర్ని ఏం చెయ్యగలరు? చటుక్కున మళ్ళీ టెలిఫోన్ తీసి, హోటల్ లోడీకి కనెక్ట్ చెయ్యమన్నాడు.

"హోటల్ లోడీ రిసెప్షన్ హియర్"

"ఒక అరగంట క్రితం మీ హోటల్‌కి ఎడ్మండ్ అనే యువకుడు వచ్చి దిగాడు. దయచేసి, ఆయన రూంకి కనెక్షన్ యివ్వండి."

"జస్ట్ ఒన్ మినిట్. వి ఆర్ సారీ సర్. ఎడ్మండ్ అనే ఆయన యీ హోటల్‌కి రాలేదు. బస చెయ్యలేదు."

రాజు రిసీవర్ పెట్టేశాడు. కాత్యా లోడీ హోటల్‌కి వెళ్ళకుండా ఎక్కడికి వెళ్ళింది. యుగంధరూ, తనూ స్పష్టంగా చెప్పారే, ఎక్కడికీ వెళ్ళవద్దనీ తిన్నగా హోటల్ లోడీకి వెళ్ళమనీ. ఎందుకు అక్కడికి వెళ్ళకుండా మరెక్కడికో వెళ్ళింది. తనకై తనే వెళ్ళిందా?

రాజు మెదడు వేడెక్కుతోంది. అటు యుగంధర్. ఇటు కాత్యా. ఏమిటి తన కర్తవ్యం? తను ఏం చెయ్యాలి? గోళ్ళు గిల్లుకుంటూ గదిలో కూర్చోవాలా? యుగంధర్ కోసం తను హోటల్ రంజిత్‌కి వెళ్ళాలా? తను వెళితే యీలోగా ఎక్కణ్ణించో యుగంధర్ తనకి ఫోన్ చేస్తే కాత్యా వస్తే?

**బజర్** చప్పుడయింది. రాజు తలుపువేపే చూస్తున్నాడు. తలుపు మీద టకటక చప్పుడయింది. రాజు తలుపు తియ్యకుండా తలుపువైపే చూస్తున్నాడు. తలుపు బయటనించి తాళం తెరిచేందుకు యెవరో ప్రయత్నిస్తున్నారు. రాజు పిస్తోలు తీసుకుని తూటాలు సరిచూసుకున్నాడు. ఆ వచ్చిన మనిషి హోటలు కుర్రాడు కాడని తెలుసు. ఆ శత్రువుల నించి తనకి ఆపద కలుగుతుందని రాజుకి భయంలేదు. రిసెప్షన్‌కి ఫోన్ చేస్తే చటుక్కున ఫోన్ తీశాడు చడీ చప్పుడూ లేదు. టెలిఫోన్ డెడ్ అంటే గదిలో వున్న టెలిఫోన్ లైనుని తెంపేశారన్నమాట. బయట యెంతమంది వున్నారు? ఒకరా యిద్దరా? ముగ్గురా? వాళ్ళవద్ద తప్పకుండా పిస్తోళ్ళుంటాయి. తను తలుపు గడియపెట్టుకున్నంతసేపు తనకి ప్రమాదం లేదు. కానీ రాజు తత్వం అదికాదు. ప్రమాదంలోకి తెలిసి అడుగుపెట్టడం, శత్రువ్యూహంలో ప్రవేశించి ఛేదించడం అతని నైజం.

"ఎవరు?" అడిగాడు రాజు మెత్తగా.

"సి.బి.ఐ. బండార్కర్ పంపారు. అర్జంట్ మెసేజ్."

"అలాగా! జస్ ఒన్ మిమిట్ తలుపు తెరుస్తున్నాను" తలుపు దగ్గరకి వెళుతూ అన్నాడు.

ఎడ్మండ్ వేషంలో వున్న కాత్యా, టాక్సీ యెక్కి హోటల్ లోడీకి వెళ్ళమని డ్రైవర్‌కి చెప్పింది. టాక్సీ స్పీడుగా వెళుతూంది. కాత్యా వెనక్కి జారిగిలబడి అలసటతో కళ్ళు మూసుకుంది. కాసేపటి తర్వాత, సడన్‌బ్రేక్ చెయ్యడం వల్లో హారన్ మోగడంవల్లో ఆ చిరునిద్రలోంచి వులిక్కిపడి లేచి కళ్ళు తెరచింది.

''డ్రైవర్ ఎటు వెళుతున్నావు? హోటల్ లోడీకి యిది దారికాదే''

''ఇది షార్ట్‌కట్ మేడమ్'' అన్నాడు డ్రైవర్.

''నాకు బొంబాయి వీధులు తెలియదనుకున్నావా? ఇది షార్ట్‌కట్ కాదు. అసలు ఆ వైపే వెళ్ళడంలేదు.''

డ్రైవర్ నవ్వి ''హోటల్ లోడీకి షార్ట్ కట్ అనలేదు. యమలోకానికి షార్ట్‌కట్ అన్నాను. మావాళ్ళని ముగ్గుర్ని చంపితే, మీరు ప్రాణాలతో బతికివుంటామనుకున్నారా?'' అన్నాడు డ్రైవర్.

కాత్యా హ్యాండ్ బాగ్ తెరుస్తోంది.

''ప్లీజ్ తొందరపడవద్దు'' అన్నమాటలు వినిపించాయి. ఎక్కణ్ణించి? వెనకనించి. వెనక యేమీలేదే సీటు తప్ప. వెన్నులో యేదో గుచ్చుకుంది. కారు వెనక డిక్కీలో యెవరో వుండివుండాలి. సీటుకి కంతలుండాలి. కారు వెనక డిక్కీలోంచి చూస్తున్నారు. అంతేకాదు ఆ సందులోంచి పిస్తోలు తన వీపుకి ఆనించి పెట్టాడు. తను ఆ టాక్సీ యెక్కుతానని వాళ్ళకి యెలా తెలుసు. అన్ని టాక్సీలూ శత్రువులు స్వాధీనం చేసుకున్నారా? అదెలా సాధ్యం. ఏర్‌పోర్టులో యెన్నో టాక్సీలుంటాయే, తను అదే టాక్సీ యెక్కుతుందని వాళ్ళకి ఎలా తెలుసు? వాటికి సమాధానాలు తర్వాత ఆలోచించవచ్చు. ముందు యీ గండం నించి యెలా తప్పించుకోడం. ఆ డ్రైవర్ మాటలనుబట్టి వెనకనించి పిస్తోలుతో బెదిరించిన మనిషి కంఠస్వరాన్నిబట్టి, వాళ్ళవి వుత్త బెదిరింపులు కావని తెలుస్తోంది. ఊరికి దూరంగా నిర్మానుష్యమైన ఏ మారుమూల స్థలానికో తీసికెళ్ళి తనని.

డిటెక్టివ్ యుగంధర్ వద్ద అన్నేళ్ళు తర్ఫీదు పొందిన కాత్యా అంత సులభంగా అపజయం అంగీకరించదు. అంగీకరించలేదు. మెళ్ళో గుండెలమీదకి వేలాడుతున్న లాకెట్‌ని, రూపాయిబిళ్ళ అంతవున్న లాకెట్‌ని, నెమ్మదిగా పైకి లాగింది. మెడవరకూ వచ్చిన తర్వాత ఒక్క అర అంగుళం ముందుకు జరిగింది. ఆ లాకెట్ వెనక్కి జారింది. వీపుమీద సరిగ్గా పిస్తోలుకీ, తన వీపుకీ మధ్య వెళ్ళి ఆగింది. అది బులెట్ ప్రూఫ్ స్టీల్ లాకెట్. వెనకనించి, అతనెవడో పిస్తోలు పేల్చినా తనకి గుండు తగలదు. ఒక్క నిట్టూర్పు వొదిలింది. ఆ ప్రమాదాన్నించి ప్రస్తుతానికి తప్పించుకుంది. నెమ్మదిగా హ్యాండ్ బ్యాగ్ వొళ్ళోపెట్టుకుని, చప్పుడు కాకుండా తెరిచి, తన చిన్నపిస్తోలు తీసుకున్నది కాత్యా. పిస్తోలు అరచేతిలో కనిపించకుండా పట్టుకుని పక్కన సీటుమీద చెయ్యిపెట్టింది.

''ఏయ్! చేతులు కదపవద్దనీ, కదలకుండా కూర్చోమనీ చెప్పలేదు?'' అన్నాడు వెనకనించి బెదిరింపుగా.

''పిస్తోలు వీపులో గురిపెట్టి వుంచావు. కాస్త చెయ్యి సీటుమీదకి జాపితే నీకెందుకు అంత భయం'' అంటూ చెయ్యి సీటు వెనక్కి చివరికి నెమ్మదిగా తోసింది. అరచేతిలో అరచేతిలో వున్న పిస్తోలు కదిపి వెనక్కి గురిపెట్టింది. ఇదీ ప్రమాదకరమైన పరిస్థితే. యిదే తన చాకచక్యానికీ, తన స్థయిర్యానికీ పరీక్ష. వెనకనించి అతనెవరో మొదటిసారి పేల్చినా తనకి గుండు తగలదు. కానీ ఆలోచించి ప్రయోజనం ఏమిటి? పిస్తోలు మీటమీద వేలుపెట్టింది. కాస్త పక్కకి అంటే తన వెనక డిక్కీలో కూర్చున్న అతనివైపుకి ఊహించి గురిపెట్టి పేల్చింది. టప్

''ఏమిటిది?'' అరిచాడు డ్రైవర్.

"నాకేం తెలుసు?" అన్నది కాత్యా. తన వీపుకి ఆనించిన పిస్తోలు లేదు. వెనక డిక్కీలో వున్న అతని మూలుగు కూడా వినిపించలేదు. గుండు తగిలిన మరుక్షణం ప్రాణంపోయిందా? ఏమో? అతని ప్రాణాన్ని గురించి ఆలోచించే స్థితిలో లేదు కాత్యా. టాక్సీ స్పీడుగా వెళుతోంది. రోడ్‌కి ఒక పక్క పెద్ద చెరువులాటిది చీకట్లో అదేమిటో తెలియడంలేదు. చాలా యిరుకుగా వున్న రోడ్ రెండు కార్లు ఒకదాని పక్కగా ఒకటి వెళ్ళడం కష్టం. వెంట్రుక వాసి దూరం వుంటుంది.

"ఇంకా ఎంతదూరం?" అది కాత్యా.

డ్రైవర్ నవ్వాడు. "ఎందుకంత తొందర. ఈ భూమిమీద యింకా కొన్ని నిముషాలయినా వుండాలని లేదా? వచ్చేశాం" అంటూ బ్రేక్ వేశాడు. టాక్సీ ఆగింది. డ్రైవర్ హెడ్‌లైట్స్ ఆర్పేసి, టాక్సీ దిగిపోతున్నాడు. ఈ అవకాశం ఒదులుకుంటే ఈ బలాఢ్యుడయిన మనిషితో కలియబడి, తను నెగ్గడం అసాధ్యం. అంతకుముందే బ్యాగ్‌లోంచి తీసి చేతిలో తయారుగా పట్టుకున్న యినపకడ్డీ, ఇవన్నీ ఎప్పుడూ హ్యాండ్‌బాగ్‌లో వుంచుకుంటుంది కాత్యా. ఆ కడ్డీతో డ్రైవర్ని మెడమీద గట్టిగా ఒక దెబ్బ వేసింది. "అబ్బ!" అంటూ స్టీరింగ్ వీల్ మీదకి ముందుకి వాలిపోయాడు డ్రైవర్. అయినా కాత్యా ఆగలేదు, ఆపలేదు. ఇంకో నాలుగు గట్టిదెబ్బలు వేసింది. డ్రైవర్ మెడమీదనించి రక్తం కారుతోంది. అతను చావలేదు. కానీ, కొంతకాలంపాటు స్పృహ రాదు. వచ్చిన తర్వాత కూడా ఆస్పత్రిలో వుండవలసి వస్తుందని తెలుసు. డిక్కీ తెరిచి, వెనక వున్న అతను ఏమయ్యాడో చూడాలనిపించింది. ఆ చీకట్లో మానవమాత్రుడు లేని ఆ చోట పరిశోధనలు చేస్తూ వుండదలచుకోలేదు కాత్యా. ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా అక్కణ్ణించి వెళ్ళిపోవాలి. అది టాక్సీ. యూనిఫాం లేనిదే డ్రైవ్ చేస్తే సిటీలో పోలీసులు ఆపుతారు. కాత్యా ముందు సీటులోకి వెళ్ళి డ్రైవర్ టోపీని, అతని కోటుని అతి కష్టం మీద తీసి తను ఆ కోటు వేసుకుని టోపీ పెట్టుకుని ఆ డ్రైవర్ని ముందు సీటు కిందకి అంటే కాళ్ళు పెట్టుకునే చోటుకి తోసేసింది. టాక్సీ స్టార్ట్ చేసి, లైట్స్ వెలిగించింది. చాలా యిరుకు. వెనక్కి కారు తిప్పడం చాలా కష్టం. అయినా తప్పదు. ముందుకీ, వెనక్కీ, వెనక్కి ముందుకీ, అలా ఆరుసార్లు వెళ్ళి కారు వెనక్కి తిప్పింది. ఇక సాగిపోవడానికి ఆక్సిలేటర్ మీద కాలునొక్కుతోంది. అంతలో ఎదురుగా వచ్చి తన కారుకి అర అంగుళం ముందు యింకోకారు ఆగింది. అందులోంచి లైట్ మెషిన్‌గన్స్ పట్టుకున్న మనుష్యులు యిద్దరు దిగారు.

"పిచ్చి వేషాలు వెయ్యకు. ఇవి మెషిన్ గన్స్. నువ్వూ, నీ కారూ ఏమవుతాయో తెలుసుకో" అంటూ ముందుకి వస్తూ "కాత్యా ఏది?" అడిగారు.

కాత్యాకి ఏం చెయ్యాలో తోచటంలేదు. వాళ్ళ చేతిలో మెషిన్ గన్స్ ఒక్కటే కాదు ఆటంకం. వాళ్ళ కారు, తన కారుకి అడ్డంగా వుంది. అసలే యిరుకు రోడ్డు. ఒక పక్క అగాధం. రివర్స్ చేసి కానీ ముందుకు వెళ్ళలేదు. అంత వ్యవధి ఏది? ఇంతవరకు నెగ్గుకొని వచ్చిన, ఇంత సాహసం చేసి ప్రాణం కాపాడుకున్న తను ఇప్పుడు, ఈ మెషిన్‌గన్స్‌కి యీ దుర్మార్గులకి బలి కావాలా! ఏమిటి దోవ? ఏది దారి?

## 6

స్పృహ పోయి క్రిందపడిన ఇద్దర్ని, నెం 616ని ఒక్కసారి పరీక్షగా చూసి యుగంధర్ తనపెట్టె తెరిచాడు. అందులోంచి సంకెళ్ళు, నైలాన్ తాడు తీసి, ఆ ముగ్గురి చేతులకి సంకెళ్ళు వేసి, కాళ్ళకి నైలాన్ తాళ్ళు కట్టి, ఎత్తి కుర్చీలలో కూర్చోపెట్టి, మూడు కుర్చీలూ లాగి, తర్వాత తన మెడికల్ కిట్ తీసి 616 కణతకి మందుపూసి, ముగ్గురికీ ఇంకో మందు వాసన చూపించాడు.

అయిదు నిముషాల తరువాత ముగ్గురూ కళ్ళు తెరిచారు. చేతులకి సంకెళ్ళు, కాళ్ళకి బిగింపుగా తాళ్ళు చూసుకుని భయపడిపోతూ యుగంధర్‌ని చూశారు.

"బాగా దెబ్బ తిన్నారు. ప్రస్తుతానికి ఆలోచించే స్థితిలో లేరు మీరు. ముందు వేడి కాఫీ తాగండి. తరువాత మాట్లాడుదాం" అన్నాడు యుగంధర్. రిసీవర్ తీసి తన గదికి నాలుగు కప్పులు కాఫీ పంపమని చెప్పి, రిసీవర్ పెట్టేసి హోటల్ లోడీకి ఫోన్ చేశాడు. కాత్యా ఆ హోటల్‌కి రాలేదని తెలిసింది. తర్వాత మళ్ళీ హోటల్ రాజధానికి ఫోన్ చేశాడు. రాజుగదిలో టెలిఫోన్ మోగుతోంది కాని, ఎవరూ తీయడంలేదని చెప్పాడు ఆపరేటర్. అంతలో బజర్ చప్పుడయింది. యుగంధర్ తలుపు గడియతీసి, బూట్సుకాలు తలుపుకి అడ్డంగా పెట్టి తలుపు కొద్దిగా తెరిచి చూశాడు. ట్రేతో రూంబాయ్ నిలుచునున్నాడు. "ట్రే ఇచ్చి వెళ్ళు" అని సగం మాత్రమే తలుపు తెరిచి ట్రే తీసుకుని తలుపు లోపల గడియపెట్టి, ట్రే తెచ్చి పెట్టాడు బల్లమీద.

"థాంక్ యూ యుగంధర్. చేతికి సంకెళ్ళు వుండగా కాఫీ ఎలా తాగుతాము?" అన్నాడు 616.

"నోటికి మూత వెయ్యలేదుగా. నేను నోటికి కప్పు అందిస్తాను. కాఫీ తాగిన తర్వాత సావధానంగా మాట్లాడుకుందాం" అన్నాడు యుగంధర్.

అందరూ కాఫీ తాగారు. యుగంధర్ సిగరెట్ వెలిగించాడు. "కావాలా?" అడిగాడు 616ని. 616 వద్దని తల విదిలించాడు.

"రాజుని, కాత్యాని బందీలు చేశామన్నారు. వివరంగా చెపుతారా?" అడిగాడు యుగంధర్ చాలా సౌమ్యంగా.

616నవ్వాడు. "మేము పసిపాపలమని అనుకున్నారా? చెప్పిన మరుక్షణం మా ప్రాణాలు చిత్తుకాగితాల ఖరీదుండవు. వాళ్ళు మా బందీలుగా వున్నంత కాలం వాళ్ళ ప్రాణాలు మా చేతిలో వున్నంతసేపూ మీతో బేరం పెట్టవచ్చు" అన్నాడు 616.

"నేను దేశద్రోహులతో బేరాలు కుదుర్చుకోనని నీకు తెలియదా?" అడిగాడు యుగంధర్.

"మీ అసిస్టెంట్ రాజూ, కాత్యాల ప్రాణాలు కాపాడుకునేందుకు, అంతేకాదు స్పెషల్ బ్రాంచ్ డైరెక్టర్ బండార్కర్ ప్రాణాన్ని రక్షించుకునేందుకు మాతో బేరానికి రాక ఏం చేస్తారు?"

యుగంధర్ గట్టిగా పొగ పీల్చాడు. దబాయిస్తున్నారా? నిజంగానే బండార్కర్ని కూడా వీళ్ళు బందీగా చేసుకున్నారా? "నేను నమ్మను బండార్కర్ మీకు ఎలా చిక్కుతారు?" అన్నాడు యుగంధర్.

"ఇంకాసేపట్లో ఫోన్‌కాల్ వస్తుంది. మీకే తెలుస్తుంది" అన్నాడు 616. అంటూండగానే టెలిఫోన్ మోగింది.

"మీరు మాట్లాడకండి. మా మనిషి. రిసీవర్ నాకు ఇవ్వండి" అన్నాడు 616.

యుగంధర్ రిసీవర్ 616 చెవికి ఆనించాడు.

"616 హియర్.. రిపోర్ట్" కాసేపటికి.

కాసేపటికి "అలాగా సరే బండార్కర్ అక్కడే వున్నారా? టెలిఫోన్‌లో మాట్లాడమను యుగంధర్‌తో" అన్నాడు 616 రిసీవర్ యుగంధర్‌కి యిస్తూ.

"యుగంధర్ హియర్. ఎవరూ? మిస్టర్ బండార్కరా?"

"యస్ యుగంధర్ ఈ దుర్మార్గులు నన్ను పట్టుకున్నారు. అయ్యో! అయ్యో! భరించలేకుండా వున్నాను. చిత్రహింసలు పెడుతున్నారు."

"క్షమించండి. మీరు బండార్కర్ అయినదీ లేనిదీ నాకు నిర్ధారణగా ఎలా తెలుస్తుంది? మీ కంఠస్వరంలో."

"నో! నో మన రహస్యకోడ్ చెబుతున్నాను. వినండి. నేను బండార్కర్నే. నైట్‌క్వీన్ పగలు పూస్తుంది" క్లిక్‌మన్నది టెలిఫోన్.

సందేహంలేదు. బండార్కరే. బడార్కర్ని పట్టుకోవడమేకాక, దుర్మార్గులు చిత్రహింసలు పెడుతున్నారు. యుగంధర్ కళ్ళల్లో చింతనిప్పులు చెలరేగుతున్నాయి. అంత బాధతో బండార్కర్ అరుస్తున్నాడంటే ఎంతో హింసని, ఎంతో చిత్రవధని వోర్చుకోగల బండార్కర్ అరుస్తున్నాడంటేణ యుగంధర్ ఆలోచించడం మానేశాడు. పెట్టెలోంచి కొన్ని పనిముట్లు తీశాడు. సూదులు, కత్తెరలు, ఫోర్ సెప్స్, స్పిరిట్ లాంప్, మేకులు యింకా యెన్నెన్నో.

"616 మనుషుల్ని హింసించడంలో మీరే నేర్పరులు అని అనుకోకండి. ఇవన్నీ చూడండి. దయా, దాక్షిణ్యమూ లేకుండా గోళ్ళు మొదలంటా పీకుతాను. కళ్ళల్లో యీ కారం చల్లుతాను. ఈ ఫోర్‌సెప్స్‌తో ఇంకా చెప్పాలా?"

616 మాట్లాడలేదు. "వెంటనే బండార్కర్‌ని హింసించడం మానమని ఆజ్ఞ యివ్వండి. లేదా"

"ఎలా ఇవ్వను? ఇది హోటల్ గది. నేను టెలిఫోన్ చేస్తే ఆ నెంబర్ మీకు తెలిసిపోతుంది."

"అంతేనా. మీ ఖర్మ. అయితే సరే, అంతకన్నా బాధ అనుభవిస్తారు" పళ్ళ పటపట కొరుకుతూ అన్నాడు యుగంధర్.

అంటూ స్పిరిట్ లాంప్ వెలిగించాడు. దబ్బనంలాంటి కడ్డీ బాగా వేడిచేస్తూ ఆరు సన్నని సూదులు 616 చెంపలమీద గుచ్చాడు. ఒక్కొక్క సూది గుచ్చుతున్నప్పుడు 616 ఒక్కొక్కసారి బాధతో మూలుగుతున్నాడు. దబ్బనం బాగా వేడెక్కి ఎర్రనయింది.

"నువ్వు యెక్కడున్నా, ఎలా వున్నా గుర్తుపట్టేట్టు, నీ నుదుటిమీద 616 అని కాలుస్తున్నాను" అంటూ ఫోర్‌సెప్స్‌తో ఎర్రగా కాలిన దబ్బనం పట్టుకుని ఒక్క అడుగు ముందుకు వేశాడు యుగంధర్.

"ఆపండి చెపుతాను" అన్నాడు 616.

"గుడ్ త్వరగా...నెంబర్"

"618976"

యుగంధర్ ఆ నెంబర్‌కి కనెక్షన్ అడిగాడు.

ఆ నెంబర్ రాగనే రిసీవర్ 616కి యిచ్చాడు.

"616 హియర్"

"యస్ సర్."

"బండార్కర్ని ఇక ఏమీ చేయకండి, ఆయన్ని అక్కడే వదిలి మీరంతా తక్షణం అక్కడ్నించి వెళ్ళిపొండి" అన్నాడు.

యుగంధర్ రిసీవర్ తీసుకుని ఆపరేటర్‌కి పోలీస్ కంట్రోల్ రూంకి కనెక్ట్ చెయ్యమని చెప్పి "డిటెక్టివ్ యుగంధర్ స్పీకింగ్. స్పెషల్ బ్రాంచ్ డైరెక్టర్ బండార్కర్ ప్రమాదంలో వున్నారు ఒకచోట. అదెక్కడో నాకు తెలియదు. టెలిఫోన్‌నెం 61896. అదెక్కడో తెలుసుకుని వెంటనే ఆయన సహాయానికి వెళ్ళండి. యస్.. క్విక్" అని రిసీవర్ పెట్టేసి "థాంక్ యూ 616. ఇప్పుడు చెప్పండి. అసలు ప్రధానిని మీరు ఎందుకు హత్య చెయ్యడానికి పూనుకొన్నారు? నేను దర్యాప్తుకు వస్తున్నానంటే నన్ను, నా అసిస్టెంట్స్‌నీ ఆపేందుకు ఎందుకు ఇంత ప్రయాసపడ్డారు. మీది ఏ దేశం? మీ కుట్రకి కారణం, ధ్యేయం ఏమిటి?" అడిగాడు యుగంధర్.

7

కారిడార్‌లో యెవరూ వుండివుండరు. వున్నా తన గదిముందున్న వాళ్ళ విషయం పట్టించుకున్నట్టు లేరు లోపల గడియపెట్టినా, బలంగా బలమైన మనిషి తోస్తే గడియ వూడిపడుతుందనీ, తలుపు తెరుచుకుంటుందనీ రాజుకి తెలుసు. ఇంకో రెండు నిముషాల వ్యవధి వుంది. ఆలోగా తను ఏదో ఉపాయం ఆలోచించాలి. తలుపు పక్కన నిలబడి, వాళ్ళు లోపలికి రాగానే వాళ్ళని పిస్తోల్‌తో బెదిరించో,

తలమీద కొట్టో, తప్పించుకోవడం సాధ్యంకాదనీ తెలుసు. అటువంటి కిటుకు వాళ్ళమీద పారదని తెలుసు. వాళ్ళు సి.బి.ఐ. వాళ్ళు కారనీ తెలుసు. వాళ్ళే అయితే ముందు రిసెప్షన్‌లోంచి ఫోన్ చేసేవారు. అంతేకాదు తన టెలిఫోన్ డిస్కనెక్ట్ చెయ్యరు. నెమ్మదిగా చప్పుడు చెయ్యకుండా రాజు గడియ తీసేశాడు. అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి సోఫా వెనక మోకాళ్ళమీద వొంగి కూర్చున్నాడు. అవసరమయితే వచ్చేవాళ్ళని ఎందరినయినా సరే పిస్తోలుతో పేల్చి చంపడానికి తయారుగా వున్నాడు. తలుపు తెరుచుకుంటోంది. తెరుచుకుంటూ వుండగానే గదిలో దీపాలన్నీ ఆరిపోయాయి.

అంటే గది బయట వుండే మాస్టర్ స్విచ్ ఆర్పేశారన్నమాట. అంతా క్షణం.. అరక్షణం. ఆ అరక్షణంలో తలుపు తెరుచుకోవడం, మూసుకోవడం, లోపలికి ఎవరో ఎందరో తెలియదు, రావడం జరిగిపోయింది. అంతేకాదు తలుపు దగ్గర నిలబడక, పక్కలకి చీకట్లోకి తప్పుకున్నారు. వాళ్ళవైపు కాల్చడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. రాజు తన పొరపాటుకి తనని తిట్టుకుంటున్నాడు. వాళ్ళు ఊపిరి వినిపిస్తోంది. దానిని బట్టి ఎంతమంది గదిలోకి వచ్చారో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు రాజు. వాళ్ళు టార్చి వెలిగిస్తారేమో, మాట్లాడతారేమో వాటిని బట్టి అయినా వాళ్ళు యెటు వున్నదీ తెలుస్తుందేమో? తెలిస్తే పిస్తోలు పేల్చి, తను ఆ సోఫా వెనకనించి కదిలిపోవచ్చు. వాళ్ళు మాట్లాడరు. కదలరు. చడీచప్పుడు లేదు. రాజుకూడా తాపీగా వూపిరి పీలుస్తూ, విడుస్తున్నాడు.

దభీమని చప్పుడయింది. అంతే రాజు వెంటనే అటువైపు గురిపెట్టి పిస్తోలు పేల్చాడు. పేల్చిన మరోక్షణం ఆ సోఫా వెనకనించి కదిలి అక్కడున్న బీరువా పక్కకి వెళ్ళాడు. వెళుతుండగానే సోఫావైపు పిస్తోలు గుళ్ళు వర్షం కురిసింది. మూలుగు వినిపిస్తోంది రాజుకి . అంటే తను పేల్చిన పిస్తోలు గుండు ఎవరికో తగిలింది ఎక్కడో. ఎంకా ఎందరున్నారో, కనీసం ఒకడైనా వుండాలి పిస్తోలు పేల్చినవాడు. చీకట్లో చూసుకోక డ్రెస్సింగ్ టేబుల్ స్టూలుకి తగిలి ఒకడు పడ్డాడు. అదే దభీమన్న ఆచప్పుడు.

దగ్గరలో అడుగుల చప్పుడు. ఊపిరి పీలుస్తున్న శబ్దం వినబడుతోంది. ఎవరో తనవైపు అటు వస్తున్నారు. తను అక్కడున్నాడని తెలియదు. వస్తేనేం? ఒక్కటే ఒక్క దెబ్బ. ఆ దెబ్బకి చెట్టు విరిగినట్టు విరిగిపడతాడు. రాజు కాచుకున్నాడు.

ఖంగుమన్నది. దానితోపాటు గలగలా చప్పుడు. నీళ్ళ కూజా, గాజుది క్రిందపడి పగిలింది. రాజు మళ్ళీ పిస్తోలు అటు పేల్చాడు. రాజు పిస్తోలు పేల్చేందుకు అతని వునికి కనిపెట్టేందుకే కూజా క్రిందపడేశారు. రాజు చేతిలోని పిస్తోలు పేలిన మరుక్షణం అతని చేతిమీద పెద్దదెబ్బ పడింది. అతనిమీదికి భీండిలా ఒక మనిషి విరుచుకుపడ్డాడు. ఆ మనిషి బరువుకి రాజు పడ్డాడు వెనక్కి. డ్రెస్సింగ్ టేబుల్ అద్దం ఫెళఫెళమని పగలడం. ఆ చప్పుడికి ఆ రెండో మనిషి కూడా రావడం, యిద్దరూ చీకట్లో రాజుని బంధించడానికి ప్రయత్నించడం ప్రారంభం అయింది. పగిలిన అద్దం ముక్కలు వీపులో, మెడలో ఎక్కడెక్కడో గుచ్చుకుంటున్నాయి. మెడమీద, తలలోంచి రక్తం కారుతోంది రాజికి. రెండుకాళ్ళూ జాచి ఒకతన్ను తన్నాడు ముందున్న ఆకారాన్ని. ఆ మనిషి ఎంతదూరం వెళ్ళిపడ్డాడో కానీ ఒక్క కేక పెట్టాడు. ఎవరో తన గొంతు పట్టుకున్నారు. బలమైన చేతులు, ఉక్కు సంకెళ్ళులా వున్నాయి. బిగుసుకుంటున్నాయి.

"గింజుకోక లొంగిపో లేదా గొంతు నులిపి చంపేస్తాను" రొప్పుతూ బెదిరించాడు.

"**ఒకడు గుండుదె**బ్బతో పడిపోయాడు. తను తన్నిన తన్నుకి ఇంకొకడు ఎక్కడో పడి కదలలేకుండా వున్నాడు. ఇక మిగిలింది వీడొక్కడే వీడికా లొంగడం.

ఊపిరి ఆడడంలేదు. కళ్ళు వెళ్ళుకి వస్తున్నాయి. నాలుక బయటికి వస్తోంది. ఎవడో యుగంధరంత బలమైనవాడు అయ్యుండాలి. వీడి బరువే చాలు రాజుకి వూపిరి అందకుండా వుండడానికి. తల విదిలిస్తున్నాడు, విదిలిస్తున్న కొద్దీ వెనక అద్దం పెంకులు గుచ్చుకుంటున్నాయి. వాడు గొంతు పట్టుకుని నులుముతూ బాదుతున్నాడు. రాజు రెండు చేతులూ వాడి పొట్టక్రింద తన పొట్టమీద ఇరుక్కుపోయాయి.

ఇన్నేళ్ళ తర్వాత, ఎన్నెన్నో ఆపదలెదుర్కొన్నాక ఎంతమందో ఘటికులని జయించిన తరువాత, శత్రువు మొహంకూడా చూడకుండా ఎవడో అజ్ఞాతుడి చేతిలోనా ఈ ఘోరమైన చావు. తల తిరుగుతోంది. రక్తస్రావం వల్లనేమో ఊపిరాడక పోవడం వల్ల కావచ్చు. పక్కకి దొర్లాలంటే వీలులేనంతగా డ్రెస్సింగ్ టేబుల్‌కి రెండు ప్రక్కలా షెల్ఫులు. అవీ గోడకి బిగించినవి. తన్నాలంటే కాళ్ళు క్రిందికి వ్రేళ్ళాడుతున్నాయి. ఏమిటి గత్యంతరం. యుగంధర్ అయితే యీ తరుణంలో, యీ ఆపదలో ఏం చేసేవారు? యుగంధర్ పేరు తల్చుకోగానే రాజుకి ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

యుగంధర్ చెప్పిన కిటుకు జ్ఞాపకం వచ్చింది. అంతే గిలగిలలాడడం మానేశాడు. ఊపిరి బిగపట్టాడు. ఒంటినంతటినీ కొయ్యబారినట్టు చలనం లేకుండా చేశాడు.

'వెధవ. మొండి వెధవ. చావనైనా చచ్చాడు గాని' అనుకుంటూ రాజు మెడమీదనించి చేతులు తీసేసి, లేచాడు శత్రువు.

రాజు తొందరపడలేదు. ఆ చీకట్లోనే బాగా పొడుగూ లావూ వున్న ఆ ఆకారం తనని చూస్తూ జేబులో చెయ్యిపెట్టడం లీలగా కనిపించింది. అంటే టార్చ్‌లైట్ వేస్తున్నాడు. దీపం వెలిగిస్తే తన నాటకం బయటపడుతుంది. తనచేతిలో పిస్తోలు లేదు. అలా పడుకున్న రాజు, వంచిన తీగ నిటారుగా లేచినట్టు ఒక వురుకున లేచాడు. లేచీ లేవడంతో, ఎదురుగా వున్న ఆ మనిషిని రెండు గుప్పిళ్ళతో కొట్టాడు. ఎక్కడో కాదు జూగులార్ వైన్ దగ్గిర. అంతే. అంతటి ఆకారం నిలువునా నేలకూలింది. రాజు వీపు వెనక మెడ, తల తడిమి చూసుకున్నాడు. రక్తం కారుతోంది. గాజుముక్కలు వేళ్ళకి తగిలాయి. ముందు దీపం కావాలి. ఆ తర్వాత దెబ్బలు తిన్న ఆ ముగ్గురి విషయం ఆలోచించవచ్చు. నిముషంపాటు ఆయాసం తీర్చుకుని, ఒక్క నిట్టూర్పు వొదిలి, ఒక్క అడుగు వేశాడు. అంతే. వెంటనే క్రిందపడ్డాడు రాజు. తన కాలిని ఎవరో పట్టుకుని లాగారు. డ్రెస్సింగ్ టేబుల్ స్టూల్‌కి తగిలి కిందపడిన అతన్ని తన పిస్తోలుతో కాల్చాడు. అతను చావలేదన్నమాట. రాజు పడీపడటంతో రాజు కణతకి పిస్తోలు ఆనించి పెట్టి "ఇది బొమ్మ పిస్తోలు కాదు. జాగ్రత్త" అన్నాడు వాడు.

ఇంతసేపూ ఇంత హోరాహోరీ పోట్లాడి ముగ్గుర్నీ జయించానన్న తృప్తి క్షణంలో పోయింది. తను కదిలితే కణతమీదున్న పిస్తోలు పేలుతుందని తెలుసు. అంతలో గదిలో దీపాలు వెలిగాయి. అరక్షణం ఆ వెలుగుకి రాజు కళ్ళలో చీకట్లు కమ్మి, తర్వాత సర్దుకున్నాయి. ఆ తృటికాలంలో తలుపు తెరచుకుని ఎవరో లోపలికి వచ్చారు. అతని చేతిలో పిస్తోలు వున్నది.

"చాలాసేపు కాచుకున్నాను బయుట. ఎంతసేపటికీ మీరు రాకపోయే సరికి" అంటూ గదంతా కలయజూసి "ఈ ఒక్కడు ముగ్గురితో ఇంతసేపు హోరాహోరీగా పోట్లాడాడన్నమాట. ధైర్యశాలి. మెచ్చుకోవాలి. మిస్టర్ రాజూ రెండు చేతులూ పైకెత్తి పెట్టు. లేచి నిలబడు. ఊ రక్తం కారుతోందా. ఫూల్ ఫూల్ ఎందుకు తిరగబడ్డావు?" అని ఛాతీలో ఎక్కడో గుండు గుచ్చుకుని కొనవూపిరితో వున్నా, తనని కాలుపట్టి లాగిన అతన్ని చూసి, "వెరీబాడ్ నిన్ను ఆస్పత్రిలో చేర్చినా ప్రయోజనం లేదు" అని అందరిలోకీ బలవంతుడైన అతన్ని చూసి, "అయ్యో! అతనికీ స్పృహ పోయిందా! కంగ్రాచ్యులేషన్స్ రాజూ. అతన్ని గెలవగలిగినవాడు ఎవరూ లేడని విర్రవీగేవాడు. ఆల్‌రైట్ ఇదిగో ఈ సీసా తీసుకో. బ్రాంది తాగు. కాస్త శక్తి వస్తుంది. పిచ్చివేషాలు వెయ్యక. నా గురి తప్పదు" అంటూ ఒక ప్లాస్టిక్ సీసా రాజువైపు గిరాటు వేశాడు. రాజుకి ఆ క్షణంలో అదే అమృతం. అందులో విషం వుందేమో అనికూడా ఆలోచించలేదు. నోరు ఎండిపోతోంది. సీసా మూత తెరిచి గడగడా తాగేశాడు రాజు.

"గుడ్ కాస్త నయంగా వుందా? మూలుగుతున్నావా? బ్రాందీ అంత తొందరగా, అంత ఎక్కువగా తాగకూడదని తెలియదూ. పూర్‌ఫెలో. తడబడక, పడిపోక పట్టుకుంటాను. ఆ!ఆ! అలా ఒక చెయ్యి నాకియ్యి. రా పోదాం" అని రాజుని నడుం చుట్టూ ఒక చెయ్యివేసి పట్టుకుని నడిపిస్తూ, తలుపు తెరిచి, మళ్ళీ తాళం వేసి "బాయ్! బాయ్" అని కేకేశాడు. రూం బాయ్ పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"నా ఫ్రెండ్ బాత్‌రూంలో పడ్డాడు. బాగా దెబ్బలు తగిలాయి. అద్దం పగిలి గుచ్చుకుంది. సాయంపట్టు. లిఫ్టులోకి" అన్నాడు.

"టాక్సీ పిలవనా?" అడిగాడు బాయ్.

"అవసరంలేదు. నా కారున్నది. ముందున్న లాంజ్‌లోంచికాక ప్రక్కనుంచి వెళదాం. పార్కింగ్ స్పేస్ దగ్గర."

"సరే, సర్."

కలలో ఎవరివో మాటలు నిద్రలో నడుస్తున్నట్టు. తన శరీరం కాని, అవయవాలు కానీ, ఏవీ తన అధీనంలో లేనట్లున్నది రాజుకి. అతనితో కారెక్కాడు రాజు.

కారు స్టార్టయింది. "డోంట్ వర్రీ రాజూ. నిన్ను ఆస్పత్రికి తీసుకెళుతున్నాను. చనిపోయిన రాజు శవానికన్నా, బతికున్న రాజు శరీరం మాకు చాలా విలువైనది" అని నవ్వాడు అతను. ఆ నవ్వు రాజు చెవుల్లో ఖంగుమంటుండగా కారు యింజన్ హోరు ఆ నవ్వులో కలిసిపోయింది. వాటితోపాటు రాజుకి స్పృహ పోయింది.

8

గొంతు బొంగురు చేసింది. "కాత్యాని తీసుకుని అటు, వెనక్కి చీకట్లోకి వెళ్ళారు వాళ్ళిద్దరూ" అన్నది. పాచిక పారుతుందా?

"ఎటు?" అడిగాడు ఒకతను.

"అటు" కాత్యా అనగానే ఆ యిద్దరూ, పెద్ద టార్చిలైట్ వెలిగించి, కారు వెనక్కి పరుగెత్తారు. వాళ్ళు పదిగజాల దూరం వెళ్ళాక, కాత్యా రివర్స్‌గేర్ వేసి, కారు రయ్‌మని వెనక్కి తీసుకుని వెళ్ళి, ఫార్వర్డ్ గేర్ వేసి ముందుకి పోనిచ్చింది.

"ఆగు" అరుస్తున్నారు వెనక. కాత్యా ఆగలేదు. ఆగదలుచుకోలేదు. ముందున్న కారుకి తన కారు రాసుకుని పోవచ్చు. చాలా స్పీడుగా వెళ్ళాలి. లేకపోతే, పక్కన అగాధంలో పడే ప్రమాదం వుంది. ఒక చక్రం నేలమీద అనీ అనకుండా వున్నంత వేగంగా తోలేసింది కారు.

వెనక మెషిన్ గన్స్ పట్టుకున్న వాళ్ళిద్దరూ, మెషిన్‌గన్స్ పేల్చే అవకాశం లేదు. తన కారుకీ, మెషిన్ గన్స్‌కీ వాళ్ళ కారు అడ్డువుంది.

అరఫర్లాంగు కూడా వెళ్ళలేదు. వెనక కారు స్టార్టు అయింది. నిర్మానుష్యమయిన ట్రంక్ రోడ్, ట్రాఫిక్ లేదు. తన పక్కకి వచ్చినా తనని దాటినా మెషిన్‌గన్ బులెట్స్‌కి తను గురి అవుతుంది. ఆక్సిలేటర్ పూర్తిగా నొక్కింది. నలభయి, యాభయి, అరవై, డెబ్బయి, ఎనభయి.. స్పీడో మీటరు ముల్లు ముందుకి. అంత వేగంగా కారు సాగిపోతోంది.

అంత వేగంగానూ మరి కాస్త ఎక్కువ వేగంగా వెనక కారు వస్తోంది. కాత్యాకి ముచ్చెమటలు పోస్తున్నాయి. జనసంచారం, వీధిదీపాలు, ట్రక్కులు, బళ్ళు, సైకిళ్ళు, బస్సులు, కార్లు కానవస్తున్నాయి. స్పీడు తగ్గించాలా? తగ్గిస్తే వెనక వస్తున్న కారు తనని చేరుకుంటుంది. అదే స్పీడున వెళితే ఏ ఆక్సిడెంటో అయితే ఆ ఆలోచన రానివ్వకూడదు. రియర్ వ్యూ మిర్రర్‌లో చూసుకుంటూ వెంబడిస్తున్న కారు ఎంత వెనక.. ఎంత దగ్గిర అవుతుందో గమనిస్తూ, కాత్యా సాగిపోతోంది.

ట్రాఫిక్ కానిస్టేబుల్ స్టాప్ సిగ్నల్ పెట్టాడు. అడ్డంగా లారీ వెళుతోంది. కాత్యా ఆ సిగ్నల్‌ని లెక్కచెయ్యకుండా, ఆ లారీకి వెనక వస్తున్న బస్సుకీ మధ్యనుంచి వెళ్ళిపోయింది. ఆ కానిస్టేబుల్ విజిల్ వెయ్యడం అంత హోరులోనూ కాత్యాకి వినిపించింది.

ఇంకొక మైలు వెళ్ళేసరికి రెడ్ సిగ్నల్. చీమలబారుల్లా కార్లు, బస్సులూ అడ్డంగా వెళుతున్నాయి. ముందు ఎన్నో కార్లు ఆగివున్నాయి. కుడివైపున వెళ్ళే ట్రాఫిక్ లేన్ ఖాళీగా వుంది. కాత్యా అందులోకి వెళ్ళింది. వెళ్ళి రెడ్ సిగ్నల్ వుందికదా అని ఆగలేదు. ఆ చీమలబారులా వున్న వాహనాలమధ్య సందుచేసుకుని అంత వేగంగానూ వెళ్ళిపోతోంది.

రియర్ వ్యూ మిర్రర్‌లో చూస్తోంది. తనలా తన వెనక వెంబడిస్తున్న కారుకూడా ట్రాఫిక్ సిగ్నల్స్‌ని లెక్కచెయ్యడంలేదు. తనని వదలదలుచుకోలేదు వాళ్ళు. వస్తున్నారు. దగ్గిరవుతున్నారు. కాత్యా ఆక్సిలేటర్ ఇంకా నొక్కింది. ఎనభయి, తొంభయి, స్పీడు లిమిట్ ఎప్పుడో దాటిపోయింది. ఇద్దరు మోటార్ సైకిల్ ట్రాఫిక్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్స్, సైరెన్స్ వేసుకుంటూ కాత్యాని వెంబడిస్తున్నారు. కారు ఆపుదామా? ఆపితే ఆ పోలీసు ఉద్యోగులు తనకి రక్షణ యిస్తారా? ఒక విమానాన్ని విమానంలో అంతమంది ప్రయాణీకుల ప్రాణాలనే తియ్యడానికి సిద్ధపడ్డ ఆ దుర్మార్గులు తననేకాక, ఆ పోలీస్ ఆఫీసర్లని కూడా షూట్ చేస్తారు. ప్రయోజనం లేదు.

ఎక్కడికి వెళ్ళాలి? ఎక్కడికి వెళ్ళి ఆగాలి ఎక్కడికి వెళ్ళి రక్షణ కోరాలి? ఎక్కడికి వెళితే శత్రువుల ప్రమాదం తప్పుతుంది. కారు అంత వేగంగా, అంత ట్రాఫిక్‌లో తోలుతున్నా మనస్సులో ఆ ఆలోచన వేధిస్తూనే వుంది. యుగంధర్ దగ్గిరికి రంజిత్ హోటలుకి ప్రయోజనం లేదు. తను పార్కు చేసి దిగేలోపున పేల్చేస్తారు. పోనీ బండార్కర్ స్థానిక ఆఫీసుకి గేటు మూసేసి వుంటుంది గేటుదగ్గిర ఆపగానే వెనక వాళ్ళు వచ్చి, కాలుస్తారు. పోనీ దగ్గిరున్న పోలీస్ స్టేషన్‌లోకి వెళ్ళి ఆ పోలీసులకి సమాధానం చెబుతుండగానే దూరాన్నించి షూట్ చేస్తారు. ఎలా? ఎక్కడికి ఎలాగో వెంటాడుతున్న కారునించి తప్పించుకోవాలి. ఏ సందుగొందుల్లోనో తిరిగి మళ్ళీ మెయిన్ రోడ్ మీదకి వచ్చింది. తప్పించుకున్నాను అనుకుంది.

కానీ తప్పు ఆ కారు వెనకే వస్తోంది. దగ్గరవుతోంది. వచ్చేస్తోంది. కాత్యా తల తిరుగుతోంది. ముచ్చెమటలు పోస్తున్నాయి. కాలు తిమ్మిరెక్కుతోంది. ఇంక ఎంతసేపని ఇలా డ్రైవ్ చెయ్యగలదు. నరాలు బిగుసుకుని, సడలిపోయి వణికిపోతోంది.

అమ్మయ్య అదృష్టం. ఇంత అదృష్టం యిలా అనుకోకుండా తనకి తారసిల్లుతుందని అనుకోలేదు.

"ఆఫీస్ ఆఫ్ ది చీఫ్ కమిషనర్ ఆఫ్ పోలీస్" బోర్డ్. బయట గేటు దగ్గిర యిద్దరు సాయుధ పోలీసులు నిలబడి వున్నారు. అది కుడివైపున వున్నది. న్యాయానికి, యింకా చాలాదూరం వెళితేకాని, కుడివైపున టర్నింగ్ లేదు. అటువంటి ట్రాఫిక్ రూల్స్‌ని అప్పటికే ఎన్నోసార్లు అధిగమించిన కాత్యా యీ నియమం పాటిస్తుందా? ఒక్కసారి వెనక్కి చూసి, చెయ్యిచాపి, కుడివైపు ఇండికేటర్ వేసి, చటుక్కున కారు ఒక తిప్పు తిప్పింది. కుయ్యిమని ఏడ్చాయి టైర్లు. అనుకోకుండా తమముందు నుంచి రాకె ట్‌లా లోపలికి వెళ్ళిపోతున్న కారుని చూసి అచేతనులయి అలాగే నిలచిపోయారు కానిస్టేబుల్స్.

కాత్యా కారు బిల్డింగ్ ముందు ఆపలేదు, అంత స్పీడులోను ఆ భవనం ప్రక్కకి త్రిప్పింది. భవనం చుట్టూ తిరిగింది. వెనక వెంబడించి వస్తున్న కారులో వారికి, లోపలికి రావడానికి ధైర్యం చాలదు. కమిషనర్ ఆఫీసులో తను చేసిన ఈ అలజడికి అందరూ బయటికి వస్తారు. అప్పుడిక తనకు ప్రమాదం లేదు. ఆ భవనం చుట్టూ తిరిగివచ్చి, కారు ఆపుదామనుకుంటోంది. అడ్డంగా తనని వెంబడించి వచ్చిన కారు ఆగివుంది. అందులోంచి ఇద్దరు దిగి మిషన్‌గన్స్ తన కారువేపు గురిపెట్టి వుంచారు.

ఏమిటి ఈ శత్రువుల ధైర్యం? పోలీసు కమిషనర్ ఆఫీస్‌లోకే వచ్చి తనని చంపుతారా? ఇక తనేం చెయ్యలేదు. ప్రాణం అనేది వుండగా లొంగకూడదు. రివర్స్ చెయ్యాలి. పారిపోవాలి. "ఢాం...ఢాం..ఢాం..ఢాం" మిషన్‌గన్స్ పేలాయి.

కారు ముందు టైర్లు, రేడియేటరు తూట్లుపడ్డాయి.

"రెండు చేతులూ పైకెత్తి పెట్టి కార్లోంచి దిగు" లౌడ్ స్పీకర్‌లోంచి వినిపించింది ఆ కార్లోంచి.

తెగించినవాళ్ళు. కాత్యా కారులోంచి దిగింది రెండు చేతులూ పైకెత్తిపెట్టి, కారులో వాళ్ళు కనిపించడంలేదు.

కానీ వసారా మెట్లమీద నిలుచున్న అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ క్రైమ్స్‌ని చూసింది. ఆయన కళ్ళముందేనా ఇంత దారుణం, దౌర్జన్యం. తనని వెంబడించిన కారులోంచి ఇద్దరు, తనతో మాట్లాడిన ఇద్దరూ మెషిన్ గన్స్ పట్టుకుని దిగారు.

"చేతులు దింపక.. అలాగే నిలబడు" అంటూ దగ్గరికి వస్తున్నారు.

అసిస్టెంట్ కమీషనర్ మెట్లు దిగి తనవేపు వస్తున్నాడు.

ఏమిటిది? శత్రువులు బొంబాయిలో వున్న పోలీసు అధికారులను కూడా తమ వశం చేసుకున్నారా కాత్యా మతి భ్రమించినట్లయింది.

తనను వెంబడించిన వాళ్ళిద్దరూ దగ్గరగా వచ్చారు.

"చెప్పు కాత్యా ఏమయింది?" అడిగారు.

"చెప్పానుగా" అంటోంది.

"ఔను. అబద్ధం చెప్పావు. పారిపోవడానికి ప్రయత్నించావు. నిజం చెప్పు. కాత్యా ఏది?"

"నిజమే చెప్పాను. నేను మీకు తెలియని టాక్సీ డ్రైవర్ని."

"షటప్" అంటూ యీడ్చి లెంపకాయ కొట్టాడు. ఆ దెబ్బకి కాత్యా తల వెనక్కి వెళ్ళింది. తలమీది టోపీ కిందపడింది. ఆ వెలుగులో వొణుకుతూ నిలబడింది కాత్యా. అసిస్టెంట్ కమిషనర్ దగ్గరికి వస్తున్నాడు.

"ఎవరు నువ్వు? నీ పేరేమిటి? కాత్యాని ఏం చేశారు? ఎక్కడున్నది?" అడిగాడు.

"సర్! వీళ్ళు ఎవరు?" అడిగింది కాత్యా తనని వెంబడించిన వాళ్ళని చూపించి.

"సి.బి.ఐ. కాత్యా ప్రమాదంలో వున్నదని సి.బి.ఐ రక్షించడానికి వచ్చారు. ఇక నువ్వు తప్పించుకోలేవు. నిజం చెప్పు. నువ్వెవరు? కాత్యా ఏమైపోయింది?"

కాత్యాకి నవ్వాలో ఏడవాలో తెలియలేదు.

తన్ను రక్షించడానికి వచ్చిన సి.బి.ఐ కారుని చూశా దడుచుకుని యిలా పారిపోయి వచ్చింది. కాత్యా విరగబడి నవ్వుతోంది.

9

"మీ బందీలుగా వుండగా మీ ప్రశ్నలకి జవాబు చెప్పమనడం న్యాయం కాదు. నేను చెప్పను. మీ ప్రధానిని హత్య చెయ్యడంలో మా ఉద్దేశం ఏమిటో. మేము సాధించదలచుకున్నది ఏమిటో మీకు చెపితే మా పథకాలు ఆదిలోనే అంతమవుతాయి. ఇదివరలో ఒకసారి మీతో సంఘర్షణపడి, నేను అపజయం పొంది, దేశాన్నించి పారిపోవలసి వచ్చింది. అందువల్లే మీ జోక్యం లేకుండా వుంటే మా పథకాలు జయప్రదంగా సాగుతాయనే నమ్మకంతో మిమ్మల్ని ఆటంకపరచడానికీ, బంధించడానికీ ప్రయత్నించాను. మిమ్మల్ని చంపాలనే ఉద్దేశం నాకెప్పుడూ లేదు. మొదటికారణం మీరు ఎంతో ఔదార్యంతో పోయినసారి నా ప్రాణాన్ని రక్షించారు, నేను తప్పించుకుపోతానని తెలిసీ అంతేకాదు మీలాంటి ప్రజ్ఞావంతులనీ, మేధావులనీ చంపడం నాకిష్టంలేదు. అది నా అభిమతం కాదు" అన్నాడు 616.

"థాం యూ ఫర్ ది కాంప్లిమెంట్. మీరు నాకు బందీ అయ్యారు. బండార్కర్ విడుదలయ్యాడు. మిమ్మల్ని అధికారులకి అప్పచెప్పడమే మిగిలిన పని" అన్నాడు యుగంధర్.

" ఆ విషయం మీరు నిర్ణయించుకోవాలి" జవాబు చెప్పాడు 616.

"అంటే?" అడిగాడు యుగంధర్.

"మిస్టర్ రాజునీ, కాత్యాని బందీలుగా చేశారు మా వాళ్ళు. వాళ్ళని ఎక్కడ దాచిందీ నాకు తెలియదు. నేను మాట్లాడుదామన్నా వాళ్ళు ఎక్కడ వున్నదీ నాకు తెలియదు. నేను వెళ్ళకపోతే 24 గంటల్లో వాళ్ళని కలుసుకోకపోతే వాళ్ళని చంపేస్తారు" అన్నాడు 616.

"24 గంటలలోపునా అప్పుడు మాత్రం వాళ్ళ వునికి మీకు ఎలా తెలుస్తుంది?" అడిగాడు యుగంధర్.

"వాళ్ళే నన్ను నా స్థానిక కార్యాలయంలో కలుసుకుమ్మారు. ఈలోగా నన్ను మీరు ఎన్ని హింసలు పెట్టినా ఎంత బెదిరించినా ప్రయోజనం ఉండదు" అన్నాడు 616.

"మరికొంత వివరించండి" అడిగాడు యుగంధర్ చాలా సహనంతో.

"24 గంటలలోపున నేను మా వాళ్ళకి రాజుని, కాత్యాని ఏం చేయాలో చెప్పకపోతే వాళ్ళని చంపేయమని స్టాండింగ్ ఆర్డర్స్" చెప్పాడు 616. యుగంధర్ నవ్వాడు.

"మిమ్మల్ని వొదిలిపెడితే రాజునీ, కాత్యానీ సురక్షితంగా వదిలేస్తారని ఏమిటి నమ్మకం?" అడిగాడు యుగంధర్.

"ఇద్దరం కలిసి దానికేదైనా మార్గం ఆలోచించాలి. నన్ను మావాళ్ళకి, వాళ్ళని మీకు ఒకేసారి ఎవరికీ ప్రమాదం లేకుండా అప్పచెప్పే ఎక్స్ఛేంజ్ చేసుకునే పద్ధతి ఆలోచించాలి" అన్నాడు 616.

"చెప్పానుగా. మీలాంటి వారితో బేరాలకి వచ్చే తత్వం కాదు నాది." అంటున్నాడు యుగంధర్.

616 నవ్వి "అది మీ యిష్టం. నన్నూ, మా యిద్దర్ని పట్టుకుని బంధించినంత మాత్రాన మా పథకం ఆగదు. మా ముఠాకి నేను ముఖ్యుణ్ణి కానని నేను ముందే చెప్పానుగా" అన్నాడు 616.

యుగంధర్ ఆలోచనలో పడ్డాడు. 616 ఎంతవరకు బుకాయిస్తున్నాడు? ఎంత నిజం చెపుతున్నాడు? కాత్యా హోటల్కే చేరుకోలేదని తెలుస్తూనే వుంది. రాజు హోటల్లో టెలిఫోన్ రిసీవర్ ఎవరూ తీయడంలేదు. రాజుకానీ, కాత్యాకానీ తమకై తాము యేదైనా పనిమీద వెళ్ళివుంటే ఈపాటికి వాళ్ళే తనకి ఫోన్ చేసేవారు. ఈ 616ని బంధించినంత మాత్రాన తనపని నెరవేరుతుందా? అంతలో బజర్ చప్పుడయ్యింది.

"బహుశా బండార్కర్ తమ బలగంతో వచ్చి వుంటారు. రానివ్వండి. కలిసి చర్చించవచ్చు" అన్నాడు 616.

యుగంధర్ లేచి వెళ్ళి తలుపు గడియతీశాడు. అంతే, తలుపు ఒక్క తోపుతోశారు అవతలినుంచి. ఆ తోపుకి వెనక్కిపడ్డాడు యుగంధర్. మరుక్షణం ఇద్దరు ఓవర్ కోట్స్ వేసుకున్నవాళ్ళు లోపలికి వచ్చి, ఓవర్ కోట్స్లోంచి లైట్ మెషిన్ గన్స్ తీసుకుని నేలమీద పడిపోయిన యుగంధర్ వైపు గురిపెట్టి, తలుపు మూసి గడియ పెట్టేశారు.

616 నవ్వాడు "యుగంధర్ మీరు యింత సులభంగా మోసపోతారని అనుకోలేదు."

**యుగంధర్** తన అప్రమత్తతకి తనని తానే నిందించుకుంటున్నాడు. అవును తను రంజిత్ హోటల్‌లో వున్న విషయం బండార్కర్‌కి తెలియదు. బండార్కర్ అని 616 చెప్పగానే తను నమ్మి తలుపు తెరవడం బుద్ధి పొరపాటు.

"లేవండి యుగంధర్. మీరు ఎదురు తిరిగి, ఏదో పన్నాగం పన్నితేకానీ మా వాళ్ళు మిమ్మల్ని ఏం చెయ్యరు. మమ్మల్ని వొదిలించడం మిమ్మల్ని బందీగా ప్రాణాలతో తీసుకెళ్ళడమే మా ఆశయం" అన్నాడు 616.

యుగంధర్ లేచి నిలుచున్నాడు. 616, అతని యిద్దరు అనుచరులూ తనని యేం చెయ్యలేరు. మిషన్‌గన్‌ని పట్టుకున్న యీ ఇద్దరే. వీళ్ళని? ఆలోచిస్తున్నాడు.

దయచేసి మా చేతుల సంకెళ్ళు తీసివెయ్యండి" అన్నడు 616.

"సారీ అవి సి.బి.ఐ సంకెళ్ళు. వాటిని వెయ్యడం వరకే నా పని వాటిని తీసే తాళం చెవి నా దగ్గిర లేదు. అవి సి.బి.ఐ ఆఫీసులో వుంటాయి" అన్నాడు యుగంధర్ నవ్వుతూ.

"అయితే మీరు ప్రయాసపడకండి. మా వాళ్ళు సైలెన్సర్ రివాల్వర్‌తో యీ సంకెళ్ళు పగలగొడతారు" అన్నాడు 616.

"పొరపాటు. అవి బుల్లెట్ ప్రూఫ్. అంతేకాదు అవి ఆసిటిక్ గాస్‌త్తో కూడా కరిగించలేరు. చాలా పటిష్టమైన ఎల్లాయ్ అది" అన్నాడు యుగంధర్.

"మీకు చదరంగం ఆడడం వచ్చా?" అడిగాడు 616.

"ఏం?"

"ఎప్పుడైనా తీరిక మీకూ నాకూ వుంటే మీతో చదరంగం ఆడాలని వుంది. ఎత్తుకు పై ఎత్తు వేయడంలో మీ ప్రజ్ఞ ఎలా మెచ్చుకోను. ప్లీజ్ అటు బజర్ వైపు కదలవద్దు, బజర్ నొక్కితే రూం బాయ్ రావడం తరువాత హోటల్ మేనేజ్‌మెంట్ రావడం, రభస, మా వాళ్ళూ మిమ్మల్ని, హోటల్ వాళ్ళనీ కాల్చి చంపడం.. ఎందుకు రక్తపాతం? ఇలా వచ్చి యిందాకలా కూర్చోండి. మా వాళ్ళు మిషన్ గన్స్ పట్టుకుని నిల్చుంటారు. అంతే"

యుగంధర్ వెళ్ళి కూర్చున్నాడు.

"దయచేసి మాకు సహకరించండి. అంటే మీ అంతఃకరణకి విరుద్ధంగా ఏమీ చెయ్యమని కోరలేదు. ఈ పాటికే రాజుని, కాత్యాని ఒకచోట చేర్చి వుంటారు. మా చేతులకు సంకెళ్ళు వున్నా కాళ్ళకి ఈ బంధనాలు తీసేసి ఓవర్ కోట్స్ కప్పుకుని ఇక్కడినించి మన ఐదుగురం వెళ్ళిపోవచ్చు. రాజుకి, కాత్యాకీ ఆపదరాకుండా, అంతేకాదు మీకు కావలసిన సదుపాయాలన్నీ యేర్పాటు చేసి, ఒకచోట వుంచుతాము మా పని పూర్తి అయ్యేటంతవరకూ. ఆ తర్వాత మిమ్మల్ని వదిలేస్తాము. అంతే నేను కోరేది" అన్నాడు 616.

"నేను మీ షరతులకి అంగీకరించకపోతే?" అడిగాడు యుగంధర్.

"అయినా మిమ్మల్ని చంపోము. తలమీద స్పృహ పోయేట్టు కొట్టడమో, ఏ కాలినో షూట్ చేసి మీరు తాత్కాలికంగా కదలకుండా చేసి మిమ్మల్ని తీసికెళ్ళిపోతాము. అంతటి పరిస్థితి కలిగించరని ఆశిస్తున్నాను" అన్నాడు 616.

"నా క్షేమం గురించి మీకు ఎందుకింత చింత?"

"చెప్పానుగా. ఇదివరలో ఒకసారి నా ప్రాణం మీరు రక్షించారు. అంతేకాదు. ప్రతిభావంతుల ప్రాణాలు తీయడం నాకిష్టంలేదు."

యుగంధర్ ఆలోచిస్తున్నాడు. ఏదయినా మార్గం వుందా? ఏమిటి? కిటికీలోంచి తను దూకితే చాలా ఎత్తు ప్రయోజనంలేదు.

జేబులో చెయ్యిపెట్టి, పిస్తోలు కూడా తీయలేని దుస్థితి. ఈ దుర్మార్గుల షరతులకి ఒప్పుకుని, పసిపిల్లాడిమల్లే వాళ్ళతో వెళ్ళవలసిందేనా? ఇంత పెద్ద హోటల్లో మెషిన్ గన్స్ చప్పుడు చేస్తే నిజంగా పేల్చే ధైర్యం వీళ్ళకుందా? తెగించినవాళ్ళు అడ్డం వచ్చిన వాళ్ళని కాల్చి చంపుతూ పారిపోతారు. ఆ యిద్దరు, మెషిన్ గన్స్ తనమీదికి గురిపెట్టి వుంచారు. ఒక్క క్షణం. కాదు అరక్షణం వాళ్ళ దృష్టి పక్కకి తొలిగి, మెషిన్ గన్స్ పక్కకి తిరిగితే ఎలా? ఏం చేయాలి. ఏదో చేయాలి? అంతేకానీ వీళ్ళ బందీగా వెళితే తను యీ వూరికి రావడమే వృథా అవుతుంది. ఆ మెషిన్‌గన్స్ పట్టుకున్న వాళ్ళవైపే చూస్తున్నాడు యుగంధర్.

"మీరిద్దరు యుగంధర్ కళ్ళల్లోకి చూడకండి. ఆయనకి హిప్నాటిజం తెలుసు. మిమ్మల్ని మీ చేతుల్లో మెషిన్‌గన్స్‌ని స్వాధీనం చేసుకుంటాడు" అరిచాడు 616.

ఆ యిద్దరు యుగంధర్ కళ్ళల్లోకి చూడడం మానేశారు. 616కి తనని గురించి బాగా తెలుసు. ఈ అవకాశం కూడా పోయింది. ఇప్పుడు యింక ఏం చెయ్యాలి? కనీసం తను బుల్లెట్ ప్రూఫ్ కోట్ వేసుకుని వున్నా సాహసం చేసేవాడు.

ఒక్క మెరుపు. ఒక్క ఆలోచన తట్టింది. ప్రయోగిస్తే. ప్రమాదం ప్రమాదాలకి అలవాటుపడ్డ తనకా భయం. యుగంధర్ నిట్టూర్చాడు.

## 10

రాజు కళ్ళు తెరిచాడు. గది అంత చీకటిగా లేదు, అంత వెలుగూ లేదు. చిన్న ఎలక్ట్రిక్ దీపం వెలుగుతోంది. ఎక్కడా కిటికీలున్నట్టు లేదు. అది పగలో, రాత్రో, తను ఎంతసేపు స్పృహ లేకుండా వున్నాడో తనకే తెలియదు. కాళ్ళూ చేతులూ కదల్చడానికి ప్రయత్నించాడు. కదలలేదు. వేటితోనో గట్టిగా కట్టేశారు. జరిగింది జ్ఞాపకం చేసుకుంటున్నాడు.

"వెరీగుడ్ ఇంత త్వరలో స్పృహ వస్తుందని అనుకోలేదు" అన్నమాటలు వినిపించాయి.

రాజు ప్రక్కకి తిరగడానికి ప్రయత్నించాడు. మెడనొప్పి పుట్టింది. మెడకీ, తలకీ కట్టుకట్టారని వూహించాడు. స్టెతస్కోప్, చేతిలో సిరంజి పట్టుకున్నాడు. మనిషి దగ్గరికి వచ్చాడు. "మిస్టర్ రాజు తప్పించుకోవడానికి ప్రయత్నించకుండా అలజడి చెయ్యకుండా వుంటే మీకే ప్రమాదం లేదు. ఆ బల్లమీద మంచినీళ్ళు, బ్రెడ్ టోస్టు, బటర్, ఫ్లాస్కులో హార్లిక్స్ వున్నాయి. తర్వాత పూర్తిగా స్పృహ వచ్చిన తర్వాత భోజనం చెయ్యండి. కాళ్ళకీ చేతులకి కట్లుకూడా విప్పేస్తాను ఇబ్బంది లేకుండా నిద్రపొండి" అన్నాడతను.

ఇంకో మనిషి కాళ్ళకి వున్న కట్లు విప్పేస్తున్నాడు. సిరంజ్ పట్టికున్న అతను రాజుకి యింజక్షన్ యిచ్చాడు.

"కనీసం యింకో ఆరుగంటలయినా హాయిగా నిద్రపోతారు. తర్వాత కాస్త శక్తి వస్తుంది" అని రాజు చేతులకి వున్న కట్టుకూడా వూడతీసేసి, అతనూ, ఆ ఇంకో మనిషీ గదిలోంచి బయటికి వెళ్ళిపోయారు. రాజుకి మత్తు వచ్చేస్తోంది. కళ్ళు బరువు ఎక్కుతున్నాయి. ఊపిరి సాఫీగా, తాపీగా వుంది. ఒళ్ళు మొద్దుబారుతోంది. అతనెవరో నిద్రకి చాలా ఘాటయిన మందు యింజక్షన్ యిచ్చాడు. తనకి స్పృహ పోకూడదు. అతి కష్టం మీద చెయ్యి పైకి లాక్కున్నాడు. కాలర్ కింద ఒక చిన్న సంచిలో ఒక మాత్ర వుంది. ఆ మాత్ర నెమ్మదిగా లాగి, నోటిలో వేసుకున్నాడు. నీళ్ళు లేనిదే మింగలేడు. అయితేనేం నోట్లో కరిగిపోతుంది. అది ఎంత ఘాటైన నిద్రమాత్రకయినా విరుగుడు రిటాలిన్ అన్నమాత్ర. మాత్ర కరిగి, లోపలికి పోతున్నకొద్దీ రాజుకి మత్తు తగ్గుతోంది. కాళ్ళబరువు తగ్గుతోంది. కళ్ళు మూసుకోవడంలేదు. కనురెప్పలు తన ఆధీనంలో వున్నాయి. అయిదు పది పదిహేను నిముషాలు అలాగే పడుకున్నాడు. తర్వాత కాళ్ళు కదిలించాడు. చేతులు పైకి ఎత్తాడు. పక్కకి దొర్లాడు. గాయాలకి కట్టు కట్టినచోట్ల కాస్త మంట, నొప్పి. అంతే అంతకన్నా బాధ

ఏమీలేదు. పక్కమీదనించి లేచి రెండడుగులు వేశాడు. తూలలేదు. కిందపడలేదు. ముందు శక్తి తెచ్చుకోవాలి. సావధానంగా బ్రెడ్ టోస్ట్ తిని, హార్లిక్స్ తాగాడు. అక్కడే బల్లమీద వున్న సిగరెట్ వెలిగించి, పొగ పీలుస్తూ ఆలోచిస్తున్నాడు. మళ్ళీ ఆ డాక్టర్‌లా వున్నవాడు ఎప్పుడొస్తాడు? అయిదు ఆరుగంటల తరువాతా? లేక తను ఎలా వున్నాడో చూడ్డానికి ఈలోగానే వస్తాడా? ఏమో గబగబా మంచం మీద దిళ్ళని నిలువునా పెట్టి దానిమీద దుప్పటి కప్పి, వీలయినంతవరకూ ఎవరో పడుకున్న భ్రమ కలిగేట్టు చేశాడు. తర్వాత గోడలని పరిక్ష చేశాడు. కిటికీలేదు. ఎక్కణ్ణించో గాలి వస్తోంది. కప్పులోంచే. అవి సన్నని గొట్టాలు. తప్పించుకునేందుకు అవి మార్గం కావు. అవకాశం లేదు. అంతలో గదిబయట చప్పుడయింది. ఏమో ఎవరయినా వస్తున్నారేమో? రాజు జేబులు తడిమి చూసుకున్నాడు. ఖాళీగా వున్నాయి. ఆఖరికి తన పర్సుకూడా లేదు. తలుపు పక్కన గోడకి ఆనుకుని నిల్చున్నాడు. డాక్టరులా వున్న అతను లోపలికి వచ్చి తలుపు గడియపెట్టి మంచం వైపు ఒక్క అడుగు వేశాడు. అంతే రాజు పులిలా అతనిమీదకి ఒరిగాడు. అతను అరవకుండా ఒక చేత్తో అతని నోరుమూసేసి, ఇంకో చేత్తో మెడవెనుక పిడికిలి బిగించి ఒక్క దెబ్బ కొట్టాడు. ఆ ఒక్క దెబ్బకీ అతను రాజు చేతుల్లో స్పృహ పోయి వాలిపోయాడు. అతన్ని మంచం మీదకి లాగి పడుకోబెట్టాడు రాజు. అతని కోట్‌ని తీసుకుని తను వేసుకున్నాడు. అతని కోటు జేబులో పిస్తోలు కానీ, ఇంకే ఆయుధాలు కాని లేవు. అయితేనేం ఇదొక అవకాశం. అతని కాళ్ళూ, చేతులూ మంచానికి కట్టి, మనిషి అరవకుండా దిండుగలేబులు చింపి నోటినిండా గుడ్డపేలికలు కుక్కేశాడు. వీలయినంతవరకూ తన జుట్టు అతని జుట్టులా సర్దుకుని, ధైర్యంగా తలుపు తెరిచాడు. తలుపు బయట మెషిన్ గన్ పట్టుకున్న మనిషి నిలుచున్నాడు. అతనివైపు చూడకుండా అతనికి తన మొహం చూపించకుండా గది బయట గడియ వేసేసి, కుడివైపుకి తిరిగి టకటకా నడవడం ప్రారంభించాడు రాజు. అటు వెళితే ఎక్కడికి వెళతాడో తనకే తెలియదు. అవతల మెట్లే వున్నాయో, లేక హాలే వుందో శత్రువులు ఎంతమంది వున్నారో కూడా తెలియదు. ధైర్యం చేసి ముందుకి నడిచి వెళ్ళిపోయాడు. సంకోచించాడా వెనక మెషిన్ గన్ పట్టుకున్న అతనికి అనుమానం కలుగుతుంది. అనుమానం కలిగితే ... అంతే.

అది యిరుకైన వసారా రెండువైపులా హోటల్లా వున్నాయి గదులు. తిన్నగా నడిచాడు. చివరకు వెళ్ళాడు. ఆ చివర్న మెట్లు లేవు. చిన్న బాల్కనీ వుంది. కాస్త దూరాన్నుంచే చూశాడు.

ఇప్పుడేం చెయ్యాలి? వెనక్కి తిరిగితే ఆ మెషిన్ గన్ వాడు తన మొహం చూస్తాడు. చటుక్కున ఒక గది తలుపు తెరిచి లోపలికి వెళ్ళాడు.

అదృష్టం. ఒక్కొక్కప్పుడు అదృష్టం కలిసివస్తుంది. అలా అదృష్టం కలిసి రాకపోతే, ఎప్పుడో, ఎన్నేళ్ళక్రితమో తన ప్రాణం పోయి వుండేది. అది డాక్టర్ గది. బల్ల, సీసాలు, టెస్ట్‌ట్యూబ్బు, యింకా ఎన్నో పరికరాలు. అతను నిజంగానే డాక్టరన్నమాట. లోపల టెలిఫోన్ కూడా వుంది. హోటల్ రంజిత్‌కి ఫోన్ చేస్తే? డయల్ మీద నెంబర్ లేదు. ఎక్స్‌టెన్షన్ ఆపరేటర్ ఎవరో కిందో ఎక్కడో వుండి వుండాలి. టెలిఫోన్ ముట్టుకోలేదు. గదిలో పరికరాలని చూస్తున్నాడు. చిన్నది స్ప్రే గన్ కనపడింది. ఆ స్ప్రే గన్‌లో క్లోరోఫాంలాంటి మత్తుమందు వున్నదని, తీయని వాసనని బట్టి గ్రహించాడు రాజు. ఆ స్ప్రే గన్‌ని చేతిలో పట్టుకుని తలుపు తెరిచి దూరంగా మెషిన్‌గన్ పట్టుకుని నిలుచున్న అతన్ని, దగ్గరికి రమ్మని చేత్తో సంజ్ఞ చేశాడు. అంత దూరాన్నించి, అతను తనని గుర్తుపట్టలేదు. టకటక బూట్సు చప్పుడు చేసుకుంటూ వస్తున్నాడు. దగ్గరికి వచ్చేవరకూ అక్కడే నిలుచోకూడదు. లోపలికి వెళ్ళాడు రాజు. టకటకా టక్.. గది దగ్గిరగా వినపడుతున్నాయి బూట్సు చప్పుడు. బాగా దగ్గిర అయ్యాయి. గది దగ్గిరికి వచ్చాడు. చటుక్కున రాజు తలుపు పక్కనించీ వచ్చి, అతని మొహం మీద స్ప్రే జల్లాడు. అంతే దిగ్భ్రమతో ఆ శత్రువు నేలమీదికి ఒరిగిపోతున్నాడు. ఎవరన్నా చుస్తారేమోనని రాజు వాణ్ణి ఆ గదిలోకి లాగి, తలుపు మూసేశాడు. అమ్మయ్యా ఇంతవరకూ అంతా సవ్యంగా సాగుతోనే వుంది. చకచకా తన డ్రెస్ తీసేసి ఆ శత్రువు వేసుకున్న

పాంటు, షర్ట్, కోటు వేసుకుని, అతని తలమీద వున్న ఫెల్టు హేటు తను పెట్టుకుని, అతని చేతిలో వున్న మెషిన్‌గన్ తను తీసుకుని గదిలోంచి బయటికి వచ్చాడు.

ధైర్యంగా ఆ యిల్లు తనదే అయినట్టు చకచకా నడవడం ప్రారంభించాడు. వరసగా గదులులు. ఒక గది తలుపు తెరిచి ఎవరు లోపల వున్నారో చూడాలనిపించింది. అటువంటి క్యూరియాసిటీకి యిది సమయంకాదు. అరక్షణం కూడా అమూల్యం. వసారా చివర మెట్లున్నాయి. మెట్లకింద పెద్ద హాలు. హాలు బయట చిన్న వసారా, వసారా అవతల ఒక కారు. ఆ కారు చేరుకుంటే తప్పించుకుని పారిపోవచ్చు కానీ, మెట్లకింద యిద్దరు మెషిన్ గన్స్ పట్టుకుని నిలబడ్డారు. తను మెట్లు దిగడానికి వాళ్ళముందునించి వెళ్ళడానికి ప్రయత్నిస్తే వాళ్ళు తమలో ఒకడు కాడని గ్రహించి, తన వొళ్ళు తూట్లు పడేట్లు కాల్చి చంపేస్తారు. పోనీ తను వాళ్ళకి తెలియకుండా పైనించి వాళ్ళని కాల్చి చంపితే ఆ చప్పుడుకి ఆ యింట్లో యింకా ఎందరున్నారో అందరూ వస్తే తను ఒక్కడూ ఏం చెయ్యగలడు? ఎలా తప్పించుకోవడం.

ఒక్కొక్కప్పుడు ధైర్యం చెయ్యక తప్పదు. తప్పించుకోవాలంటే ప్రాణాన్ని అరచేతిలో పెట్టుకోవడం తప్పదు. మెట్లమీదకు వెళ్ళాడు. చప్పుడు చెయ్యకుండా దిగుతున్నాడు. వాళ్ళు వెనక్కి తిరగకుండా వుంటే వెనకనించి, వాళ్ళిద్దర్నీ చెరో చేత్తో తలమీద కొట్టి యింకా ఆ ఆలోచన పూర్తికాకముందే వాళ్ళిద్దరూ ఏ అలికిడికో పైకి చూసి, "ఎవరు నువ్వు? ఆల్బర్ట్‌వి కావు? మెషిన్ గన్ దింపు"అరిచారు యిద్దరూ ఒకేసారి. తను మెషిన్ గన్ దింపితే తన ప్రాణం ఎగిరిపోయినట్లే.

"మీరిద్దరూ మెషిన్‌గన్స్ దింపండి. పైనున్న నాకు గురి తప్పదు. ఇద్దరూ ప్రాణాలు పోగొట్టుకుంటారా?" దబాయించాడు రాజు.

"రాస్కెల్. మమ్మల్ని చంపే మమ్మల్ని మెషిన్‌గన్‌తో షూట్ చేసే ఘటికుడివా? మా గురి నీకు తెలియదేమో" అంటూ ఒకడు మెషిన్‌గన్ పేల్చాడు. ఢాం, ఢాం, ఢాం, ఢాం.

రాజు మెలికలు తిరుగుతూ గుళ్ళ బారినుంచి తప్పించుకుంటూ, మెట్లమీదనించి, పక్కనున్న చెక్కమీదనించి కిందికి చాలా వేగంగా జారి, ఒకణ్ణి రెండుకాళ్ళతో ఒక తన్ను తన్నాడు. అదే సమయంలో రెండోవాణ్ణి కిందపడినవాడు స్ప్రింగ్‌లా లేచాడు. వాడిచేతిలో మెషిన్‌గన్ లేకపోయినా, రెండుచేతులతో రాజుని వెనకనించి బిగించి పట్టుకున్నాడు. గుండు దెబ్బ తిన్న ఆ రెండోవాడు చావలేదు. వాడికి జబ్బలో గుండు దిగబడింది. అతని చేతిలో మెషిన్‌గన్ దూరానపోయి పడింది. ఆ దెబ్బకి నేలమీద పడ్డాడేకాని అతికష్టం మీద పాకుతూ మెషిన్ గన్ దగ్గిరికి వెళుతున్నాడు. వాడిచేతికి మెషిన్‌గన్ అందిందా అంతే ఒక్క బలమేకాదు, పట్లూ కిటుకులూ తెలిసుందాలి. రాజు ముందుకి వొంగి, ఒక మొగ్గవేశాడు. వెనక తనని పట్టుకున్నవాడు కిందపడ్డాడు. వెంటనే రాజు ఒక్క వురుకున వెళ్ళి మెషిన్ గన్‌వైపు పాకుతున్న అతనికి అది చిక్కకుండా దాన్ని దూరానికి తన్నేశాడు.

మళ్ళీ మీదకి వురికి తనని కిందపడేసి, ఛాతీమీద కాలుపెట్టి, నొక్కిపెట్టి "ఎవడివిరా నువ్వు?" అంటున్నాడు యింకోడు.

వీళ్ళిద్దరూ తప్ప అక్కడ యింకెవరూ లేరని రాజుకి తెలిసిపోయింది. ఉంటే యీ పాటికి వచ్చేసేవాళ్ళే. వాడి కాలి బరువుకి రాజుకి ఊపిరి ఆడడం లేదు. వాడి బరువుకి తను కదలలేకుండా వున్నాడు.

చూస్తున్నాడు. గుండుదెబ్బ తిన్నవాడు దూరాన పడ్డ మెషిన్ గన్ వైపు పాకుతున్నాడు. వాడికి ఆ మెషిన్‌గన్ చిక్కేలోపున రాజు రెండుకాళ్ళు బిగతీశాడు. తీసి, వెనక్కి లాగి, తనమీద కాలుపెట్టుకుని నిలుచున్న అతన్ని వీపుమీద రెండు కాళ్ళతో ఒక్క తన్ను తన్నాడు. ఆ తన్నుకి అతను తనమీద పడ్డాడు. పడుతుండగానే అతన్ని మొహం మీద నిర్విరామంగా రెండు పిడికిళ్ళతో బాదాడు రాజు. ఆ దెబ్బలకి తట్టుకోలేక, వాడు పారిపోవడానికి ప్రయత్నిస్తున్నాడు. వాణ్ణి పారిపోనివ్వకూడదు. వొంట్లోవున్న బలం అంతా కూడతీసుకుని, యింకొక

దెబ్బ.. ఆ దెబ్బకి శత్రువు మొహం పచ్చడయింది. ముక్కులోంచి రక్తం కారుతోంది. పళ్ళు రెండూ వూడిపడ్డాయి. ఏడుస్తున్నాడు. వాణ్ణి ఒక్కతోపు తోసి లేచి ఒక్క పరుగున వెళ్ళి, పాకుతున్న వాణ్ణి బూట్సు కాలితో ఒక్క తన్ను తన్నాడు. ఆ దెబ్బకి వాడికి స్పృహ పోయింది.

పరిగెత్తాడు రాజు బయటికి. తెరవగానే కారు తలుపు తెరుచుకుంది. కానీ కారు తాళం చెవులు లేవు. అయితేనేం తీగలు పీకి, కలిపి స్టార్ట్ చేశాడు. స్టార్ట్ అయింది. కదిలింది. వేగం హెచ్చించాడు. అది ప్రైవేట్ రోడ్ ఏ బంగళాలోకో వేసుకున్న రోడ్ రెండుప్రక్కలా క్రోటన్స్. వెళుతున్నాడు. దూరంగా గేటు, గేటు దగ్గిర యిద్దరున్నారు. వాళ్ళు గేటు కడ్డంగా నిలబడి చేతులు ఎత్తి ఆపమన్నట్టు సంజ్ఞ చేస్తున్నారు. ఆగితే ఆపితే తను ఎవరో తెలిస్తే ఏం చెయ్యాలి?

ఆపకుండా వెళితే అది చెక్కగేటు కాదు. ఇనుపగేటు. కారు స్టీరింగ్ వీల్ తన ఛాతీకి గుచ్చుకుని తను చస్తాడు. ఏం చెయ్యాలి? కారు ఆపి, తను దిగి పారిపోతే? ఎక్కడికని? ఈ పాటికి ఆ యింట్లో అలజడి ప్రారంబం అయివుంటుంది. తనకోసం వేట ప్రారంభించి వుంటారు. వ్యవధి ఎక్కువలేదు. కారు ఆపలేదు. స్పీడుగా గేటుకి వేసి ఢీకొట్టేట్లు కొంచెం కూడా వేగం తగ్గించకుండా వెళ్ళాడు. గేటుకి అడ్డంగా నిలబడ్డ ఆ ఇద్దరూ కారు తిన్నగా తమమీదికి రావటం చూసి, భయపడి జరిగారు పక్కలకి. గేటుకి అర అంగుళం దూరంలో సడన్‌బ్రేక్ వేసి, రాజు కారులోంచి ఒక్కదూకు దూకి, వెంటనే కారు టాప్ మీదకి ఎక్కి, టాపు మీదనించి గేటుపైకి ఎక్కి, ఒక ఉరుకున అవతలికి దూకాడు.

"ఢాం! ఢాం! ఢాం!"

ఎక్కడో దిగబడింది గుండు. రక్తం కారుతోంది. భరించలేని నెప్పి. అయినా ఆశ చావదు. ఆగితే మళ్ళీ శత్రువులకి చిక్కిపోతాడు. అలాగే పరుగెత్తుతున్నాడు రాజు. చీకటి మానవమాత్రుడు లేని ఆ వీధివెంట. వెనక అడుగుల సవ్వడి. దగ్గిర అవుతున్నాయి. దెబ్బ తగిలిన కాలితో వాళ్ళకన్నా త్వరగా తను ఎలా పరుగెత్తుతాడు? చిక్కిపోతాడు. ఎలా? ఏం చెయ్యాలి? ఇప్పుడు యింత సాహసం చేసి బయటపడిన తర్వాత వాళ్ళకి చిక్కడమా?

## 11

"నేను చెప్పే విషయాలన్నీ ఎలా యుగంధర్ నమ్మరో అలాగే యుగంధర్ చెప్పే విషయాలన్నీ నేనూ నమ్మను. మీలో ఒకళ్ళు మెషిన్ గన్ యుగంధర్ మీద గురిపెట్టి, యింకొకరు మనవాళ్ళ కట్లు విప్పి చేతికున్న సంకెళ్ళు పిస్తోలుతో పేల్చి, వూడదీయడానికి ప్రయత్నించండి" అన్నాడు 616. 616 అలా అంటాడనీ యుగంధర్‌కి తెలుసు. ఒకడు మెషిన్‌గన్ తనవైపే గురిపెట్టి తలుపు దగ్గిరే నిలుచున్నాడు. ఒకతను వచ్చి, 616కీ, మిగతా యిద్దరికీ కాళ్ళకి వున్న కట్లు విప్పేశాడు. తర్వాత, జేబులోంచి, చిన్న సైలెన్సర్ వున్న రివాల్వర్ తీసి 616 సంకెళ్ళ మధ్య పేల్చాడు. రెండుగా తెగింది.

616 నవ్వాడు. "నా అనుమానం నిజం అయింది. ఆ యిద్దరి సంకెళ్ళు వూడదియ్యి" అంటూ లేచి నిలుచుని, ఒకసారి కాళ్ళు రుద్దుకుని, తర్వాత చేతులు నలుపుకుని, "మిస్టర్ యుగంధర్ జయాపజయాలు మన వృత్తిలో తప్పవు. ఈసారికి మీరు అపజయం పొందారు. ఇక వెళదామా" అన్నాడు. అతను ఆ మాటలు అంటుండగానే యుగంధర్ చటుక్కున కుర్చీలోంచి లేచి, 616 వెనక్కి వెళ్ళి అతన్ని గట్టిగా పట్టుకుని తనకి కవచంగా అడ్డంగా పెట్టుకున్నాడు. అంటే మెషిన్ గన్ పేలిస్తే ముందు 616 మరణిస్తాడు. కనురెప్ప తెరిచి మూసేటంత తృటికాలంలో జరిగిందది. వెంటనే గదిలో కాపలా వున్నతను, దిగ్భ్రమ చెందాడు. యుగంధర్ 616తో వెనక్కి గోడదగ్గిరికి వెళ్ళాడు. వెనకనించి వచ్చి తనని ఎవరూ కొట్టకుండా.

"నేను వారించవలసిన అవసరంలేదు. మెషిన్‌గన్ కాని, తుపాకీ కాని పేలిందా? 616, ముందు మీ ప్రాణం పోతుంది" అన్నాడు యుగంధర్.

"తెలుసు. అందుకే ఎవరూ పేల్చలేదు. అయితే మాత్రం ఏం చేస్తారు?" అడిగాడు 616.

"మీ వాళ్ళని ఆయుధాలని కిందపడెయ్యమని చెప్పండి"

"చెప్పను. వాళ్ళు ఆయుధాలు పడెయ్యరు. మీరు మాత్రం ఏం చెయ్యగలరు ప్రస్తుతానికి డ్రా అయింది అనుకోవాలి. మీరో మేమో" అంటున్నాడు.

**616 మనిషి** ఒకడు నేలమీద పాకుతూ రావడం యుగంధర్ గమనించాడు. వాణ్ణి దగ్గిరికి రానిచ్చి 616ని అమాంతం పైకెత్తి 616 కాళ్ళతోనే అతన్ని తలమీద కొట్టాడు. అంటే 616ని కవచంగానే కాక, ఆయుధంగా కూడా ఉపయోగించాడు. పాకుతూ వచ్చిన మనిషి మూలిగాడు. కదలలేదు.

"యుగంధర్ ప్రాణానికి ముప్పు తెచ్చుకుంటున్నారు" అన్నాడు 616.

యుగంధర్ 616 బెదిరింపు లక్ష్యపెట్టలేదు. 616ని తను కవచంగా పట్టుకున్నంతసేపూ తనకేమీ ప్రమాదం లేదని తెలుసు. అంతేకాదు, గోడకి ఆనుకుని నిలుచున్నాడు కనుక, వెనకనించీ ఎవరూ రాలేరు. 616 యుగంధర్ అంత బలశాలి కాడు. అంత భారీమనిషీకాడు. అదొక ధైర్యం. కాని తనలా 616కీ కొన్ని కిటుకులు వచ్చి వుంటాయనే విషయం యుగంధర్ మర్చిపోయాడు.

616కీ కొన్ని కిటుకులు వచ్చి వుంటాయనే విషయం యుగంధర్ మర్చిపోయాడు.

616 తన రెండు కాళ్ళు యుగంధర్ కాళ్ళకి మెలివేసి, ఒక్కలాగు లాగి, ముందుకి ఒరిగాడు. అంతే యుగంధర్ బంతిలా వెళ్ళి, అవతల ఆ మెషిన్‌గన్ పట్టుకున్న అతనిమీద పడ్డాడు. అయినప్పటికీ యుగంధర్ తనున్న ప్రమాదం మర్చిపోలేదు. అలా పడుతున్నప్పుడు ఆ మెషిన్‌గన్ పట్టుకున్న అతన్ని ఇంకో మొగ్గలో ఒక తన్ను తన్నాడు. ఆ దెబ్బకి అతను నేలకి ఒరిగిపోయాడు. మెషిన్‌గన్ తీసుకునేందుకు వ్యవధిలేదు యుగంధర్‌కి. మెషిన్‌గన్‌ని బీరువా కిందికి ఒక తోపు తోశాడు. అంతలో 616, యుగంధర్ మీదికి వచ్చిపడ్డాడు. కానీ ఈసారి తయారుగా వున్న యుగంధర్ 616ని ఒక్కతోపు తోశాడు. చేతులు దులిపినట్టు 616 వెనక్కిపడ్డాడు.

మెషిన్‌గన్ కిందపెట్టి పిస్తోలుతో 616 సంకెళ్ళు పగలగొట్టిన శత్రువు, పిస్తోలు తనవైపు గురిపెట్టడం యుగంధర్ కనుకొలుకుల్లోంచి చూసి, చటుక్కున పక్కకి జరిగి, నేలమీద వున్న తివాసీని పట్టిలాగాడు. అంతే. అతనూ వెనక్కి పడ్డాడు. ముందు ఆయుధాల విషయం వీలైతే తన చేతికి ఒక ఆయుధం చిక్కించుకోవాలి. లేదా వాళ్ళకి ఆయుధాలు లేకుండా చేయాలి. అదే యుగంధర్ ఆలోచన. కిందపడిన పిస్తోలుని మళ్ళీ తీసుకుంటున్న అతన్ని, ఒక్క అంగలో సమీపించి, అతని చేతిమీద బూట్సుకాలుపెట్టి నొక్కాడు. కరకరమన్నాయి. అతని చేతులు. అంతేకాదు, యుగంధర్ బలానికి ఆ పిస్తోలు కూడా ఆకారం లేకుండా పోయింది. 616 నేలమీద పాకుతూ వచ్చి మెషిన్‌గన్ తీసుకోబోతున్నాడు.

అదే సమయానికి ఇంకొకడు వెనకనించి తనమీదకి వస్తున్నాడు. యుగంధర్ ఆ రెండో మెషిన్‌గన్‌ని కూడా బీరువా కిందకి తన్నేశాడు. అది పెద్ద బీరువా. దానికిందినించి ఆ మెషిన్‌గన్స్‌ని లాగాలంటే చాలాసేపు పడుతుంది. ఒకడికి స్పృహలేదు. ఇంకొకడు చెయ్యి విరిగి మూలుగుతున్నాడు. ఇక మిగిలింది 616, మరొక యిద్దరు. అంతే.

యుగంధర్ బలంగా వూపిరి తీసుకుని వెనక వస్తున్న అతన్ని దగ్గిరికి రానిచ్చి వెనక్కి కాలు ఎత్తి తన్నాడు. ఆ దెబ్బ శత్రువు గడ్డానికి తగిలి, వెనక్కి గోడకి వెళ్ళిపడ్డాడు. పడుతున్నప్పుడు తల గోడకి తగిలింది. అలాగే కళ్ళు మూసుకున్నాడు.

"యుగంధర్ ఆఖరుసారి హెచ్చరిస్తున్నాను" అన్నాడు 616.

యుగంధర్ నవ్వాడు. 616కాక ఇంకొకడు, వాడికింకా సంకెళ్ళు వూడదీశారో లేదో తెలియదు. రెండుచేతులూ పైకెత్తి యుగంధర్‌ని తలమీద కొట్టలేడు. అంత పొడుగుకాదు. ఏ మెడమీదో కొట్టబోతున్నాడు. యుగంధర్ చటుక్కున ఒక్క అడుగు పక్కకి వేశాడు. రెండుచేతులూ పైకెత్తి బలంగా కొట్టబోయిన అతను, చేతులు గాలిలో ముందుకి కిందకి పోవడంవల్ల బోర్లాపడ్డాడు. యుగంధర్ కాలితో వాడి మెడమీద ఒక తన్ను తన్నాడు. ఆ దెబ్బకి వాడు ఇంకో అరగంటవరకు లేవలేడని యుగంధర్‌కి తెలుసు. ఇక మిగిలింది 616. చీపురుపుల్లతో సమానం అనుకుంటుండగానే 616 లేచి వొంగి, తనే పిస్తోలుగుండులా వేగంగా వచ్చి, తలతో యుగంధర్‌ని పొట్టలో కొట్టాడు. అదేం తలో లేక తనకే బలమూ, ఓర్పు పోతోందా? విపరీతమైన నెప్పితో కళ్ళు తిరిగిపోతున్నాయి. ఆయాసంతో, గుండె దడదడమంటోంది. తనని కొట్టడానికి 616 తన భుజం అంత పొడుగులేడు. తన బరువులో సగంలేడు. రెండు చేతులూ ఎత్తాడు. యుగంధర్ అతని రెండుచేతులనీ పట్టుకుని విరవడానికీ మెలిపెట్టడానికీ ప్రయత్నించాడు. కానీ 616 వెన్నలా కరిగిపోయి, యుగంధర్ పట్టులోంచి తప్పించుకుని, కిందికి జారిపోయాడు నేలమీదికి. 616ని తన్నడానికి యుగంధర్ కాలు ఎత్తాడు. ఆ ఎత్తిన కాలుని పట్టుకుని, మెలిపెట్టి ఒక్కలాగు లాగాడు 616. యుగంధర్ 616 మీదనించి అవతల వెళ్ళిపడ్డాడు. అతనితోపాటు 616 కూడా అటు తిరిగి, నేలమీద పడ్డ యుగంధర్ కాలుమీద తన కాలుపెట్టి రెండో కాలుని పైకెత్తి రెండుకాళ్ళూ భీముడు, జరాసంధుణ్ణి విరిచినట్టు విరవడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఏమిటిది? తన కాలుమీద నిలుచున్న 616ని తను ఎందువల్ల కదపలేకుండా వున్నాడు. ఇది జూడోకాదు. జుట్సూ పట్టుకాదు. ఏవో కొత్త కిటుకులు. కొత్త పద్ధతి. 616 ఆయాసంతో రొప్పడంలేదు. భయపడడం లేదు, "యుగంధర్ మీకు హాని కలుగకూడదని చాలా తాపత్రయపడ్డాను. మీ మొండితనం వల్ల మీరే కోరి తెచ్చుకున్నదిది. మీ రెండుకాళ్ళూ విరిచేస్తున్నాను. కొన్ని నెలలపాటు మీరు కదలకుండా..."

యుగంధర్ పళ్ళు పటపట కొరికాడు. తన చిటికెనవేలితో తోస్తే కిందపడే ఈ అర్భకుడా తనని పక్కకి దొర్లాడు. దొర్లుతూ రెండు కాళ్ళూ, కత్తెరలా 616 నడుం చుట్టూ వేసి బిగించి, 616ని కిందికి తోసేశాడు. యుగంధర్ బలమైన కాళ్ళమధ్య యిరుక్కున్నాడు 616. అడకత్తెరలో పడినట్టు యిరుక్కున్న తరువాత ఎవరూ యింతవరకూ తప్పించుకోలేదు. సావధానంగా యుగంధర్ లేచి కూర్చుని 616 అని అనుకుంటుండగా, 616 తన కాళ్ళ మధ్య మంచుగడ్డ కరిగిపోయినట్టు కరిగిపోయి, తప్పుకుని లేచి నిల్చున్నాడు. యుగంధర్ ఆశ్చర్యానికి అంతులేదు. 616 తనకి సమవుజ్జీ అని అనుకోకూడదు. తనకన్నా కిటుకులు, పట్లు, ఎక్కువ తెలిసిన శత్రువు అనే తను జాగ్రత్తపడాలి. తను నేలమీద వుండి, 616ని నిలుచోనిస్తే తను 616కి బందీ అవుతాడు. ఆ అవకాశం యివ్వకూడదు.

నేలమీద రివ్వున దొర్లాడు యుగంధర్. దొర్లుతూ వెళ్ళి 616ని కాళ్ళుపట్టి లాగాడు. 616 అమాంతం కింద యుగంధర్ పక్కన పడ్డాడు.

అది సౌండ్ ప్రూఫ్ గది. లేకపోతే ఈ గొడవలకీ, యీ శబ్దాలకీ హోటల్లో వాళ్ళంతా వచ్చేసేవారు. యుగంధర్ మెరుపులా కదిలాడు. 616 అంతకన్నా శరవేగంతో కదిలి, ఒక దొర్లు దొర్లి, యుగంధర్ మీదకి వచ్చాడు.

నవ్వుకున్నాడు యుగంధర్. ఒక్క వూపు వూపితే అరమైలు దూరాన పడతాడు 616. కదలబోయాడు కానీ కదలలేకపోయాడు. ఏం చేశాడు 616? యుగంధర్ ఛాతీమీద కూర్చుని, యుగంధర్ మెడకి రెండుపక్కలా రెండు కాళ్ళు పెట్టి నొక్కుతున్నాడు. ఎక్కడ నొక్కుతున్నాడో ఏ నరం బిగదీస్తున్నాడో, ఏ సున్నితమైన చోట బలం ప్రయోగిస్తున్నాడో పక్షవాతం వచ్చిన వాడిమల్లే అయిపోయాడు యుగంధర్. చేతులు కదలడం లేదు. కాళ్ళూ కదలడంలేదు ఊపిరి తీసుకోవడం కష్టంగా వుంది.

"కాళ్ళు విరిచి వెళ్ళిపోదామనుకున్నాను. కానీ యుగంధర్ మీరు నాకు ఆ అవకాశం యివ్వలేదు క్షమించండి. మీ ప్రాణం తియ్యక తప్పదు" అన్నాడు 616.

రెండు బూడ్సు కాళ్ళతో ఇంకా బలంగా నొక్కుతున్నాడు. మెడ వుబ్బిపోతున్నట్లు, నాలిక వెళ్ళుకు వస్తున్నట్టున్నది. యుగంధర్ కళ్ళు తేలిపోతున్నాయి. తనకన్నా బలవంతులతో పోట్లాడి నెగ్గాడు. అంతేకాదు ఒకేసారి పదిమందిని ఎదుర్కొని జయించాడు. తుపాకీల బారినుంచి, గుళ్ళ వర్షంలోంచి బయటపడ్డాడు ఎన్నోసార్లు.

అటువంటి తను ఈ అర్భకుడి చేతుల్లో పసిపిల్లాడిమల్లే, నిస్సహాయంగా కాలూ చెయ్యి కదపలేక తన శరీరం, తన ప్రాణం యీ శత్రువుకి అప్పచెప్పెయ్యాలా?

"బాధ అట్టే వుండదు. ఆఖరిసారి ఊపిరి తీసున్నప్పుడు మాత్రం గుండె కాస్త నొప్పి పుడుతుంది. ఓర్చుకోవాలి తప్పదు. చెప్పానుగా. జయాపజయాలు ఎప్పుడూ ఒకరివే కావు మన వృత్తిలో" నవ్వాడు చిన్నగా 616. అతని మొహంలో క్రౌర్యం లేదు. అతని పెదిమల మీద చిరునవ్వు, అతని కళ్ళల్లో ప్రశాంతత, సామాన్యమైన నిత్యమూ చేసే చిన్నపని ఏదో చేస్తున్నట్లు.

యుగంధర్ పక్కకి తిరగడానికి, లేవడానికి 616ని తోసెయ్యడానికి ప్రయత్నించాడు. అతను ప్రయత్నించిన కొద్దీ అతని శరీరంలో సత్తువు తగ్గిపోతోంది. ఊపిరి ఆడడంలేదు సరికదా ఊపిరి ఆగిపోతోంది. ఈ 616 భల్లూకపు పట్టులోంచి యిక తను తప్పుకోలేనని యుగంధర్‌కి తెలిసిపోయింది. 616 తనను చంపదలచుకున్నాడని నిశ్చయమైంది. తను గింజుకున్నా, గిలగిలలాడినా, ప్రయోజనం లేదనీ గ్రహించాడు.

తనకీ, యీ లోకానికీ ఋణం తీరింది. తెలిసో తెలియకో తప్పులు చేసివుంటే క్షమించమని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ కళ్ళు మూసుకుంటున్నాడు యుగంధర్. కొనవూపిరి ఆఖరి ఊపిరి యిదేనా.

## 12

"కమ్ ఆన్! నీతో పరిహాసాలు ఆడేందుకు మాకు టయింలేదు" అన్నాడు సి.బి.ఐ అతను, విరగబడి నవ్వుతున్న కాత్యాతో."నేనే కాత్యా" అంటూ కాత్యా తన మారువేషం అంటే ఎడ్మండ్ వేషం తీసేసింది."వాట్ ఏ గ్రేట్ రిలీఫ్" అన్నాడు ఎ.సి. అంతలో లోపల్నుంచి ఒక పోలీస్ ఉద్యోగి పరుగెత్తుకుని వచ్చి, "సర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ థామస్ ఫోన్ చేశారు. డిటెక్టివ్ యుగంధర్ బసచేసిన గది తలుపు బద్దలు కొట్టిలోపలికి వెళ్ళారుట. యుగంధర్‌గారు."

"ఆ! యుగంధర్?" అడిగాడు ఎ.సి.

"మరణించారు" చెప్పాడు ఆ ఉద్యోగి.

"ఆర్ యూ షూర్?" అడిగాడు ఎ.సి ఎలక్ట్రిక్ షాక్ తిన్నవాడిలా.

"డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ థామస్‌కి యుగంధర్‌గారు బాగా పరిచయమంట. ఇన్స్పెక్టర్ థామసే గుర్తుపట్టారట."

''కాత్యా అప్పటివరకూ లోలోన ఎక్కడో వున్న ఆత్మబలంతో నరనరాల్లో వున్న శక్తితో నిలబడగలిగింది. ఈ వార్త వినగానే అక్కడే నేలమీదకి స్పృహ పోయి వొరిగిపోయింది.

కాత్యాకి స్పృహవచ్చేసరికి ఏ.సిగదిలో వుంది. పక్కన వుంది నర్సు. అరనిముషం పట్టింది కాత్యాకి జరిగింది జ్ఞాపకం చేసుకోడానికి. వెంటనే లేచి ''వెళ్ళాలి..నేను వెళ్ళాలి'' అన్నది.

''ప్లీజ్ కూర్చోండి చాలా షాక్‌లో వున్నారు. నీరసంగా వున్నారు'' అన్నది నర్సు.

''వీల్లేదు. యుగంధర్ గారిని నేను చూడాలి''

''చూసి ఏం చేస్తారు? వారు పోయారు. ఐయామ్ వెరీ సారీ'' అన్నది నర్సు.

''నో! నో నేను వెళ్ళాలి'' అంటూ గదిలోంచి బయటికి పరుగెత్తింది కాత్యా. బయట వున్న ఒక జీపు ఎక్కి ''త్వరగా, యుగంధర్'' అంటోంది.

''మార్చురీకి త్వరగా'' కాత్యా చాలా అధికారంగా అన్నమాటలకి జీపు డ్రైవర్ కానిస్టేబుల్ జీపు స్టార్ట్ చేశాడు. సరిగ్గా పదిహేను నిముషాల తర్వాత మార్చురీముందు జీపు ఆగింది. మార్చురీ బయట ఎ.సి ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు నిలుచుని వున్నారు. కాత్యా జీపులోంచి ఒక్క దూకు దూకి, ''యుగంధర్‌గారేరి?'' అడిగింది.

''సారీ పోయారు'' అన్నాడు ఏ.సి.

''యుగంధర్‌గారు పోయారా? యుగంధర్ గారని మీకెలా తెలుసు? ఎవరు గుర్తుపట్టింది'' అడిగింది కోపంగా.

''నేనే. నా పేరు థామస్. నాకు యుగంధర్‌గారితో బాగా పరిచయం వుంది'' అన్నాడు ఇన్‌స్పెక్టర్ థామస్.

''అయుండవచ్చు. దయచేసి నన్ను చూడనివ్వండి ప్లీజ్'' అన్నది కాత్యా.

''ఆల్‌రైట్ వెళ్ళండి'' అన్నాడు ఎ.సి కాత్యా లోపలికి పరుగెత్తింది. తెల్లని బల్ల, బల్లమీద శవం. తలనించి కాళ్ళవరకు తెల్లని బట్ట పూర్తిగా కప్పబడివుంది. గదిలో నిశ్శబ్దం. అప్పటివరకు ఆందోళనతో ముందుకు సాగిన కాత్యా తలుపు దగ్గర ఆగి నెమ్మదిగా, చప్పుడు చేస్తే ఏం జరుగుతుందో అన్నట్టు బల్లదగ్గరికి వెళ్ళి నిలబడింది. కళ్ళవెంట నీళ్ళు జలజలా రాలుతున్నాయి. శవం తలమీద వున్న బట్టలాగింది నెమ్మదిగా. అంతే ఒక్క కేక పెట్టింది.

13

నగరంలో అది ఏ ప్రాంతమో, అసలు తను బొంబాయి ప్రాంతాల్లో వున్నాడో లేడో కూడా తెలియదు రాజుకి. కుంటుతూ, కాలుకి రక్తం కారుతున్నా నిప్పుకణం లోపల వున్నట్టు బాధగా వున్నా పరుగెత్తుతున్నాడు. వీధిదీపాలులేవు. అంటే ట్రంక్ రోడ్ అయ్యుండాలి. వెనక అడుగులు దగ్గరవుతున్నకొద్దీ రాజు గుండె దడ ఎక్కువ అవుతుంది. ఇక అట్టే దూరం పరుగెత్తలేడు. చటుక్కున ఆగిపోయి, రోడ్డుపక్కకి వెళ్ళాడు. ఆ చీకట్లో అక్కడ ఏం వున్నదీ చెట్లో, రాళ్ళో, గోతులో, కాలవో తెలియదు. గుబురుగా పొదలు వున్నాయి. ఆ పొదల వెనక వెళ్ళి నిల్చున్నాడు. వెనక వస్తున్నవాళ్ళు ఆగిపోయారు.

''ఎక్కడో దాక్కున్నాడు ''

''వాడి చేతిలో ఆయుధం లేదు, ధైర్యంగా టార్చిలైట్స్ వెలిగించండి.''

''పిస్తోళ్ళు తయారుగా వుంచుకోండి'' వాళ్ళ మాటలు వాటితోపాటు మూడు టార్చిలైట్స్ వెలిగాయి. అది బాగా వెడల్పయిన రోడ్డు. రోడ్డుకి రెండుపక్కలా గుబురుగా చెట్లూ, పొదలూ వున్నాయి. తను యింకా వెనక్కి పొదలలోకి వెళ్ళడమా అక్కడే నిలబడడమా? అదీ రాజు సమస్య. పిస్తోళ్ళు పట్టుకున్న ముగ్గురితో కలియబడడమా? ఎలా? తన దగ్గర చిన్న చాకు కూడా లేదే వాళ్ళు జాగ్రత్తగా దీపాలతో వెతికితే తను కనబడతాడు, చిక్కిపోతాడు.

''ఇవిగో రక్తపు మరకలు. రాజు యిటే వెళ్ళాడు పదండి.''

''గుడ్ గాడ్' తను ఎక్కడున్నదీ, ఎటు వెళుతున్నది తన కాలునించి కారుతున్న రక్తపు మరకలు, గీత గీచి చూపించినట్టు చూపిస్తున్నాయి. చీకట్లోనే కింద నేలమీద తడిమి చూశాడు. ఒక రాయి పెద్దదే దొరికింది. యిదే తనాయుధం. దీనితోనే తను నెగ్గుకురావాలి. తను ఆపొద వెనకనించి పక్కన యింకో పొదవైపుకి వెళ్ళాడు. వెనక నక్కి దాక్కున్నాడు.

''ఇదిగో ఇటు వెళ్ళాడు'' చాలా దగ్గరగా వినపడింది స్వరం. దీపం కూడా వెలిగింది. టార్చితో ఒకడు ముందుకు వచ్చి, తను అంతకుముందు నిల్చున్న పొదవైపు చూస్తున్నాడు. మిగతా యిద్దరు ఎక్కడున్నారు? తను దొరికిపోతాడా అని ఆలోచించలేదు రాజు. ఆ రాయి ఎత్తి పొదలో వొంగి రక్తం మరకలు చూస్తున్న అతని తలమీద కొట్టాడు. మిగతా యిద్దరూ చూడలేదు. వాళ్ళు ఇంకోవైపు చూస్తున్నారు.

''ఏమైంది? ఏ పామో కాటువేసిందా?'' అంటూ ఒకడు పడిపోయిన అతని దగ్గరికి వెళ్ళాడు. కొంచెం దూరంలో వున్న ఇంకో అతను టార్చి వెలుగు అటువేసి వుంచాడు. తను చెయ్యిజాపినప్పుడు, తనవైపు పిస్తోలు పేలుస్తాడు, ఆ గుండు తనకి తగలకుండా వుంటే ఇక మిగిలేది ఒక్కడే పక్కకి జరిగాడు చెయ్యి దూరంగా జాపాడు పొదల సందులోంచి. చెయ్యి నెమ్మదిగా బయటికి పోనిచ్చి పడిపోయిన అతన్ని పరీక్షగా చూస్తున్న శత్రువు తలమీద బలంగా కొట్టాడు. అంతే ఆ దెబ్బకి ఆ శత్రువు నేలకూలడం, అదే క్షణంలో దూరాన్నించి పిస్తోలు పేలడం జరిగింది. గుండు ఎక్కడికో పోయింది.

''నువ్వు ఆ పొదలో దాక్కున్నావని తెలుసు. బయటికిరా లేదా తూట్లు'' అని బెదిరిస్తున్నాడు పిస్తోలు పట్టుకున్న అతను. బాగా దూరాన వున్నాడు. రాయి బలంగా విసరడానికి, చెయ్యి కదిపేందుకు చోటులేదు రాజుకు. కానీ విసరవచ్చు. విసిరితే చేతిలో వున్న ఒక్క ఆయుధమూ పోతుంది. అయినా తప్పదు. అదొక్కటే మార్గం. రాజు చేతిలో వున్న రాయి విసిరాడు. ఆ రాయి తగిలి, శత్రువు కిందపడతాడని ఆశించలేదు. ఆ రాయి తగిలిన శత్రువుకి స్పృహ పోతుందనీ అనుకోలేదు. అతని చేతిలో వున్న టార్చిని గురిచూసి వేశాడు. రాజు గురి తప్పలేదు. శత్రువు చేతిలో టార్చి క్రిందపడింది. అంతేకాదు ఆ అదురుడికి రెండో చేతిలో వున్న పిస్తోలు కూడా కిందపడి వుండాలి సబ్దాన్ని బట్టి. గాఢాంధకార్మ, కీచు కీచుమని ఏవో చప్పుళ్ళు, గాలికి చెట్ల ఆకుల గలగలలు, ఆ చప్పుళ్ళలో ఇంకే చప్పుళ్ళూ వినిపించలేదు.

''రాస్కెల్ ఎక్కడికని తప్పించుకుని పారిపోతావు?'' అన్నాడు శత్రువు. అతను చేతులతో నేలమీద తడిమి పిస్తోలు కోసం వెతుకుతున్నాడని రాజుకు తెలుసు. టార్చి పగిలిపోయింది. ఇక వెలగదు. వెలుగు వచ్చేటంతవరకూ తను వాళ్ళకు కనపడకుండా వుండగలడు. కానీ ఎలా తప్పించుకోవడం? శత్రువు ఎక్కడ వున్నదీ సూచనగా తనకు తెలుసు. చప్పుడు కాకుండా తను అటు వెళ్ళగలడా? అసలే దెబ్బతిన్న త్తను, శత్రువుతో కలియబడి నెగ్గేటంత శక్తి వుందా తనకి? ఆలోచించలేదు రాజు. కదిలాడు. ఏ అలజడీ లేకుండా సాగిపోయాడు.

"రాస్కెల్ ఎలా తప్పించుకుపోతాడు? తెల్లారిన తర్వాతనైనా వెధవ దొరకడూ" అని లోలోన గొణుక్కుంటున్నాడు శత్రువు. రాజు పని ఇంకా సులభమయింది. శత్రువు వెనక వున్న పొదకి చేరుకున్నాడు.

తన రెండు చేతులలో బలం చాలా? శత్రువు ఎంత బలమయినవాడో తనకు కనపడలేదు. రాయికోసం నేలను తడిమితే ఆ చప్పుడికి, శత్రువు పక్కకి జరిగితే తన పథకం విఫలమవుతుంది. వేరే గత్యంతరం లేదు. ఒక చేతిలో వున్న బలం మీద రాజుకు నమ్మకం నశించింది. రెండు చేతులూ కలిపి, వేళ్ళకి వేళ్ళు బిగించి, నెమ్మదిగా ముందుకు వొంగి తన శరీరంలో వున్న బలాన్నంతటినీ కూడదీసుకుని, ఒక్క దెబ్బ కొట్టాడు. ఒక్క మూలుగు. అంతే ఆ శత్రువు స్పృహ తప్పిపడిపోయాడు. ఎంతసేపు వాళ్ళు స్పృహలేకుండా వుంటారు? ఎంతసేపట్లో తేరుకుని తనని వెంటాడుతారో తను ఎంత త్వరగా అక్కడ్నించి వెళ్ళిపోతే అంత మంచిది. ఎక్కడికి వెళ్ళాలి? ఆ కాలి బాధతో ఎంత దూరం నడవగలడు?

**రోడ్డుమీదకి** వెళ్ళి, నడుస్తున్నాడు రాజు. వెనక ఒక కారు వస్తోంది. హెడ్‌లైట్స్ కాంతిని బట్టి బాగా దూరంగా వుందని తెలుస్తోంది. ఆ కారు ఆపితే. ఏమో ఆ కారులో శత్రువులే వుంటే శత్రువులే అయితే తనని వెతుక్కుంటూ వస్తూ వుండివుంటారు. తను ఎలాగో దొరికిపోతాడు. శత్రువుకాక మరెవరో అయితే.

రోడ్డుకి మధ్యగా నిలబడి, ఆగమని చెయ్యి ఎత్తిపెట్టాడు. కారు దగ్గరవుతోంది. శత్రువో కాదో, మళ్ళా తను ఆపదలో చిక్కుకుంటాడో, తప్పించుకుని వెళతాడో ప్రతిక్షణం ఒక యుగంగా గడుస్తోంది. కారు దగ్గిర అవుతున్నకొద్దీ వేగం తగ్గుతోంది. అయినా రాజు కదలలేదు. బ్రేకు పడింది. ఆగింది కారు.

"మిస్టర్ రాజు ఏమిటి ఈ అర్ధరాత్రి..ఈ.."

"మీరా మిస్టర్ బండార్కర్" అంటూ రాజు కుంటుకుంటూ కారు దగ్గరకు వెళ్ళాడు. బండార్కర్ కారులోంచి దిగుతున్నాడు. "వద్దు.. క్విక్ త్వరగా మనం ఇక్కడినించి వెళ్ళిపోవడం మంచిది" అంటూ రాజు కారు ఎక్కాడు. బండార్కర్ కారు తోలుతూ వున్నాడు. రాజు చెప్పాడు జరిగింది. బండార్కర్ కారులో రూఫ్‌లైటు వెలిగించి, "రాజూ ముందు ఓ జేబురుమాలుతోనో లేక షర్టు చింపో కట్టుకో సిటీ చేరుకోగానే ముందు డాక్టరు దగ్గరికి" అంటున్నాడు బండార్కర్.

"నో!నో డాక్టరు అవసరంలేదు. ముందు యుగంధర్‌గారి దగ్గరికి వెళ్ళాలి, ఆయన నా కాలిలోంచి గుండు తీసెయ్యగలరు. అయినా మీరు ఎక్కడనించి వస్తున్నారు?" అడిగాడు రాజు.

తనకి స్పృహపోయిన తర్వాత తన కళ్ళకి కట్లు కట్టి ఎక్కడికో తీసుకెళ్ళి, తనని హింసపెటడం. అంతలో ఆ హింసించడం మానేసి శత్రువులు పారిపోవడం, ఒంటిగా తను ఆ యింట్లోంచి బయటకు వచ్చేటప్పటికి అక్కడ ఒక కారు వుండడం, ఆ కారు ఎక్కి బయలుదేరడం. చెప్పాడు బండార్కర్.

"శత్రువులు ఎవరో. ఏమిటో మీకూ తెలియదన్నమాట?" అడిగాడు రాజు.

"తెలియదు. ప్రధానిని చంపడానికి ప్రయత్నించారని మాత్రం తెలుసు" అన్నాడు బండార్కర్.

ఎందుకు కొద్దిగా పట్టుసడలించి, తనని వూపిరి తీసుకోనిస్తున్నాడు 616. ఎలాగూ తనకి చావు తప్పదు. ఈ 616కి తెలిసిన యీ పట్లు ఏమిటో, ఈ పట్టునించి విడిపించుకుని బయటపడటం ఎలాగో తనకు తెలియదు. అన అపజయం తను అంగీకరించాడు యుగంధర్.

"ఇక ఫాలాక్షుడు వచ్చినా మిమ్మల్ని బతికించలేడు. మీ ప్రాణం తీయడం ఒక్క అరక్షణం. ఈ కాలితో యింకొంచెం. చాలా కొంచెం నొక్కితే చాలు. వూపిరి ఆడదు.

గుండె ఆగిపోతుంది."

"కానియ్యి" అన్నాడు అతికష్టమ్మీద యుగంధర్.

"ప్రధానమంత్రిని చంపడానికి మేము ఎందుకు ప్రయత్నించామని, దానివల్ల ప్రయోజనం ఏమిటని అడిగారు. దానికి జవాబు చెప్పలేదు. మిమ్మల్ని ఎలాగూ చంపేస్తున్నాను కనుకు చెపుతాను వినండి" అన్నాడు 616.

యుగంధర్ నిట్టూర్చాడు. ఇప్పుడు తనకి తెలిసీ ప్రయోజనం ఏమిటి?

"ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్న పార్టీలో ఐకమత్యం లేదు. వివధ రాజకీయ సిద్ధాంతాలు, సమాజిక సంస్కరణలు, ఆర్థిక సూత్రాలు గల మిశ్రమ మంత్రి యిది అనవచ్చు. ఇన్ని వైరుధ్య పరస్పర సంఘర్షనలు గల వ్యక్తులనందరిని ఒక తాటిమీద, ఒక పథకంలో, ఒక జెండాకింద నిలబెట్టి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది ప్రధాని. ప్రధాని మరణిస్తే మర్నాడు యీ ప్రభుత్వం పడిపోతుంది."

"పడిపోతే ఇంకొక ప్రభుత్వం వస్తుంది. మీకేమిటి లాభం?" అడిగాడు యుగంధర్.

"ప్రధానిని హత్యచేసి యీ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి మూడుముఠాలు, అంటే మూడు దేశాల గూఢచారులు విడివిడిగా ప్రయత్నిస్తున్నారు. ఏ ముఠా ఆశయాలు వాళ్ళవి" అన్నాడు 616.

"మీది ఏ ముఠా? మీ ఆశయం ఏమిటి?" అడిగాడు యుగంధర్.

"దయచేసి యిబ్బంది పెట్టే ప్రశ్నలు అడగకండి. నేను ఈ దేశస్తుణ్ణి కాను. ఈ ప్రభుత్వం పడిపోతే మరొక ప్రభుత్వం నెలకొల్పమని, రాష్ట్రపతి ప్రతిపక్షపార్టీ నాయకుణ్ణి కోరినా, ప్రతిపక్ష పార్టీ నాయకుడికి మెజారిటీ వుండదు. కనుక మళ్ళీ ఎన్నికలు పెట్టవలసి వస్తుంది."

"అంగీకరిస్తున్నాను" అంటున్నాడు యుగంధర్.

"ఈసారి ఎన్నికల్లో మీ దేశంలో మా రాజకీయ సిద్దాంతాలని అంగీకరించి, మా దేశంలోలా ఆ పద్ధతిలో పరిపాలన సాగించాలనే పార్టీ ఒకటుంది. ఆ పార్టీ జయించేందుకు కావలసిన డబ్బు, ఇతర హంగులు, అవసరమైతే కొంత హింసాకాండ జరిపించి, మా దేశపు ప్రభుత్వం చెప్పుచేతులలో వుండే ప్రభుత్వం, ఈ దేశంలో ఏర్పాటు చెయ్యడం మా ధ్యేయం. అందుకే ప్రధానిని హత్య చెయ్యడానికి పూనుకున్నాము."

"ఇంకో రెండు ముఠాలు. ఇంకో రెండు దేశాలు కూడా" అడుతున్నాడు యుగంధర్.

"తొందరపడకండి. ఏ ముఠా ఏ దేశానిదో తెలుసుకొనేపాటి అంతర్జాతీయ రాజకీయ విజ్ఞానం మీకుంది. వినండి. మీ దేశంలో గత ముప్పయి సంవత్సరాలుగా భారీ యెత్తున వ్యాపారం సాగిస్తూ, మీ దేశపు ధనాన్ని కొల్లగొట్టుకుంటూ, మీ దేశంలో అధిక జనాభా దరిద్రంలో మునిగివుండేటట్లు తమదేశపు ప్రజలు సిరిసంపదలతో తులతూగుతూ, అప్పుడప్పుడు ఏదో కరుణకొద్దీ మీకు ధనం ఇస్తున్నట్టు విరాళం ఇస్తున్న దేశం ఒకటి వుంది. ఇప్పుడు మీ ప్రధాని, ఆ దేశపు వ్యాపారాన్ని మీ దేశంలో సాగనివ్వకుండా అరికట్టి, వారి

వాణిజ్య సంస్థలని, పెట్టెబేడాతో సహా తిప్పి పంపుతున్నారు. ప్రధానిని హత్యచేస్తే యీ పార్టీ పడిపోతే తమకి సన్నిహితమయిన మనుషులతో కోట్లకి కోట్లు డబ్బు కుమ్మరించి, తమ మాట విని, తమ వాణిజ్యం మీ దేశంలో నిరాఘాటంగా సాగేందుకు ఆ యింకోదేశం ప్రయత్నిస్తోంది. ఆ దేశమేదో మీరు వూహించుకోగలరనుకుంటాను."

యుగంధర్ తలవూపి "మూడోది?" అడిగాడు.

"గతి పదిసంవత్సరాలుగా ఒక అగ్రరాజ్యం మీ దేశపు రాజకియాలలో ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగా జోక్యం కల్పించుకుంటూ మీ ప్రభుత్వాన్ని వెనకనించి, లోబరచుకుని ఆడిస్తున్నట్టు ఆడిస్తోంది. ఇప్పుడు మీ ప్రధాని ప్రపంచశాంతికి సర్వదేశాలతోను సరిసమాన స్నేహబాంధవ్యాలు పెంచుకోవాలని, ఏ అగ్రరాజ్యాల కూటమిలోను చేరకూడదనే సిద్ధాంతాన్ని తూ.చ తప్పకుండా ఆచరిస్తున్నారు. ఇన్ని సంవత్సరాలు పరోక్షంగా మీ దేశాన్ని పాలించిన ఆ అగ్రరాజ్యం సహించలేక, మీ ప్రధానిని చంపితే, ఎన్నికలు వస్తే తమ గూఢచారులకి, తమపట్ల సానుభూతిగల రాజకీయవేత్తలకీ ధనాన్ని వెచ్చించి, తమకి అనువయిన ప్రభుత్వాన్ని నెలకొల్పవచ్చుననే ఉద్దేశ్యం. ఈ అగ్రరాజ్యమేదో కూడా మీరు గ్రహించగలుగుతారు" చెప్పాడు 616.

యుగంధర్ తలవూపాడు.

"కనుక ప్రధానిని చంపడానికి మేము ఒకళ్ళమే కాదు ప్రయత్నిస్తున్నది.

మూడు అగ్రరాజ్యాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ మూడు అగ్రరాజ్యాలూ తమ బలాబలాలు మీ దేశపు నడిగడ్డమీద తేల్చుకుంటాయి. అసలు విషయం యిది" అన్నాడు 616.

యుగంధర్ మౌనంగా వుండిపోయాడు. "యుగంధర్ మీరు అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పాను. యిక ప్రశాంతంగా మీరు" 616 బూట్సుకాలితో యుగంధర్ మెడని నొక్కుతున్నాడు. యుగంధర్‌కు మళ్ళీ వూపిరి బిగదీసుకుపోతోంది. కళ్ళు వెళ్ళుకు వస్తున్నాయి. నాలిక కొరుక్కుంటున్నాడు. ఊపిరి, ఇదేనా ఆఖరి వూపిరి. విడిస్తే దానితో పోతూందా ప్రాణం. "తల్లీ! భారతమాతా! క్షమించు" అనుకున్నాడు మనస్సులో.

## 14

కుంటుతూ రాజు కారు దిగాడు హోటల్ రంజిత్ పోర్టికోలో. బండార్కర్ కారు అవతలికి తీసుకెళ్ళాడు. రాజు లిఫ్ట్ ఎక్కేలోపున బండార్కర్ వచ్చి యెక్కాడు లిఫ్ట్‌లో. కాలికి తగిలిన గాయంలోంచి రక్తం కారకుండా కట్టు కట్టుకున్నా బాధతో రాజు మొహం ముడుచుకుపోతోంది. ఎవర్నీ అడగనవసరం లేకుండా యిద్దరూ యుగంధర్ గది దగ్గరికి వెళ్ళారు. బండార్కర్ బజర్ నొక్కాడు. లోపలనుంచి యెవరూ రాలేదు. పలకలేదు.

"బహుశా యుగంధర్ బయటికి వెళ్ళారేమో" అన్నాడు బండార్కర్.

"చూద్దాం" అంటూ రాజు తాళం చెవి పెట్టే కంతకి ఒక కన్ను ఆనించి చూశాడు. అంతే! రాజు కళ్ళల్లో మంటలు చెలరేగాయి. పళ్ళు పటపట కొరుకుతున్నాడు. మొహం బిగుసుకుపోయింది. "ఏమిటి రాజూ!" అడిగాడు బండార్కర్. అతనినే చూడమన్నట్లు రాజు తలవూపాడు. బండార్కర్ కూడా చూసి, "ఓ మైగాడ్" అన్నాడు సుస్పష్టంగా, అనుమానం లేకుండా కనిపించింది, సినిమాలో క్లోజప్‌లా యుగంధర్ మీద నిలబడి, గొంతుకు మీద కాలుపెట్టి ఎవరో నొక్కుతుండడం, యుగంధర్ కొనవూపిరితో వుండడం, యుగంధర్ కళ్ళు తేలిపోయి, మొహం నీలం అవడం. బండార్కర్ జేబులో కాని, రాజు జేబులోకాని రివాల్వర్ లేదు. ఉంటే వెంటనే తలుపు గడియపేల్చి తలుపు తెరిచేవారు.

"ఏం చేద్దాం? మేనేజర్ని పిలిచి" అంటున్నాడు బండార్కర్.

"వ్యవధి లేదు బండార్కర్" అని రాజు తలుపుకు దూరంగా వెళ్ళాడు.

"అయితే ఏం చేద్దాం?" అడుగుతున్నాడు బండార్కర్. రాజు జవాబు చెప్పలేదు. చాలా వేగంగా తుఫానులా, సముద్రపు కెరటంలా ఒక్క పరుగున వచ్చి ఎగిరి తలుపుని ఒక్క తన్ను తన్నాడు. తన కాళ్ళు బలహీనంగా వున్నాయి.

తనూ బలహీనంగా వున్నాడు. తన బలానికి తలుపు వూడిపడుతుందా అని ఆలోచించలేదు. అదొక్కటే మార్గం.

రాజు తన బలాన్ని తక్కువ అంచనా వేసుకున్నాడు. తలుపు ఫెళఫెళా విరిగి కిందపడింది. తలుపుతోపాటు రాజుకూడా గదిలో పోయిపడ్డాడు.

"వెల్కమ్ రాజు" అన్నాడు 616 ఎక్కణ్ణించి వచ్చిందో పిస్తోలు తీసి రాజుమీద గురిపెట్టి. ఈ గొడవలో యుగంధర్ మీద కాలి బరువు తగ్గింది.

"ఎవరు నువ్వు?" అంటూ బండార్కర్ గదిలోకి హడావిడిగా వచ్చాడు.

"యూ టూ ఆర్ వెల్కమ్. వాట్ ఎ ప్లజర్! ఒకేసారి ముగ్గురూ దొరికారు. ముగ్గుర్నీ హతమార్చవచ్చు" అన్నాడు 616.

"స్టుపిడ్‌లా మాట్లాడకు. తలుపు విరిగిపడింది. పక్కగదుల్లో వాళ్ళు వస్తారు. హోటలువాళ్ళు"

616 నవ్వాడు. "ఎవరూ రారు. ఈ ఫ్లోర్‌మీద అన్ని గదులూ మేము బుక్ చేశాము. వెనక్కి తిరిగి చూడండి" అన్నాడు 616.

రాజు, బండార్కర్ తిరిగి చూశారు. పదిమంది రివాల్వర్స్, మెషిన్‌గన్స్ పట్టుకుని నిల్చున్నారు.

"రెప్పకదిపితే, చిటికనవేలు కదిలితే తూట్లు తూట్లుగా కాలుస్తారు మావాళ్ళు. జాగ్రత్త" అన్నాడు 616.

రాజు రివాల్వర్స్ పట్టుకున్న పదిమందిని పరీక్షగా చూశాడు. వాళ్ళు వేషాలు మార్చుకున్నా, జాగ్రత్తగా మేకప్ చేసుకున్నా విదేశీయులని స్పష్టంగా తెలుస్తోంది. పసుపురంగు గోలీల్లా వున్నాయి వాళ్ళ కళ్ళు. ఆ కళ్ళల్లో ఏ ఆవేశమూ, ఏ ఆలోచనా లేదు. గాజు కళ్ళలా వున్నాయి. షూట్ చెయ్యమని 616 చెపితే షూట్ చేస్తారు. సందేహం లేదు. ఏం చెయ్యాలి?

"మిస్టర్ యుగంధర్ మీ అసిస్టెంటు రాజు, మీ మిత్రుడు బండార్కర్ వచ్చినా మిమ్మల్ని రక్షించకపోగా తలుపు తెరిచి, నా మనుష్యులు నాకు సహాయానికి రావడానికి సహాయం చేశారు" అని రాజు, బండార్కర్‌ల వైపు తిరిగి "థాంక్ యు" అని, మళ్ళీ యుగంధర్‌వైపు తిరిగి "సారీ! మీకు మా గురించి చాలా విషయాలు చెప్పేశాను. మిమ్మల్ని ప్రాణాలతో విడువలేను" అంటూ యుగంధర్ మెడమీద కాలిని నొక్కుతున్నాడు. యుగంధర్ వూపిరి ఆగిపోతోంది.

తను ఏదో ఒకటి చెయ్యాలి, యుగంధర్ని చంపేస్తున్నాడు ఆ కిరాతకుడు. అదే ఆలోచన రాజు మెదడులో రింగురింగుమంటోంది. యుగంధర్ని చంపిన తర్వాత, తనని చంపుతాడని రాజు ఆలోచించటం లేదు. యుగంధర్ని ఎలా కాపాడటం యుగంధర్ని యిలా తన కళ్ళముందు చంపేస్తోంటే వూరుకోవడమేనా?

"నేను స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ బండార్కర్ని. మిమ్మల్ని ఏం చేస్తానో" అని అరిచాడు బండార్కర్.

616 నవ్వి "స్పెషల్ బ్రాంచికి యింకో డైరక్టర్ అవసరం అవుతాడు. బహుశా మీ డిప్యూటీకి ప్రమోషన్ రావచ్చు. సంతోషిస్తాడు" అన్నాడు.

బండార్కర్ 616ని బెదిరిస్తూ ఒక్క రెండు అడుగులు ముందుకి వేశాడు. అప్పుడు రాజుకి ముందుగా వచ్చి నిలుచున్నాడు. అవును, సాహసమే పాచిక పారకపోవచ్చు. అసలు పారదు. అయినా యింతకన్నా గత్యంతరం లేదు. ఎలాగూ 616 మనుష్యులు, తమని

చంపేస్తారు అనుకున్నాడు రాజు లోలోన. ఆ ఆలోచన మనస్సులోకి రాగానే రాజు, క్షణం కూడా ఆలోచించకుండా, వెంటనే ఆచరణలో పెట్టాడు.

తన శక్తినంతా ప్రయోగించి బండార్కర్ని ఒక్క తోపు రెండు చేతులు బండార్కర్ వీపు మీద పెట్టి తోశాడు 616 మీదికి. బంతిలా వెళ్ళి 616మీద పడ్డాడు బండార్కర్. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనకి 616 చకితుడయి, క్షణంపాటు అచేతనుడయి పిస్తోలు పేల్చలేక, బండార్కర్‌తోబాటు వెనక్కి పడ్డాడు. రివాల్వర్సు, తుపాకీలు పట్టుకున్న శత్రువులు తనను కాల్చి చంపుతారని రాజుకి తెలుసు. అందుకే బండార్కర్ని ముందుకి తోస్తూ, అదే సమయానికి రాజు వెనక్కి చెట్టు విరిగిపడినట్టు పడ్డాడు. రివాల్వర్స్ పేలాయి. అవి సైలెన్సర్స్ వున్న రివాల్వర్స్. పెద్ద చప్పుడు కాలేదు. కానీ కనీసం ఆరుగుళ్ళయినా అతని వీపుకి గురిపెట్టి పేల్చి వుండాలని రాజు ఊహించాడు. వెనక్కిపడ్డ రాజు ఒకణ్ణి రెండుకాళ్ళు పట్టుకుని లాగాడు గట్టిగా. ఆ శత్రువు వెనక్కి పడిపోతూంటే, రాజు వెనక్కిపడకుండా, ఒక చెయ్యి అతని మోకాళ్ళ వెనుక పెట్టి తనమీదకు లాక్కున్నాడు. అంటే యిప్పుడు తనని పిస్తోలుతో కాల్చడానికి ప్రయత్నిస్తే ముందు తనమీద పడివున్న ఆ శత్రువుకి గుండు తగులుతుంది అదే రాజు వేసిన ఎత్తు. ఇదంతా తృటికాలంలో జరగడంవల్ల 616 తన అనుచరులకి ఆజ్ఞలు యిచ్చే స్థితిలో లేకపోవడం వల్ల వాళ్ళందరూ దిగ్భ్రమచెంది రాళ్ళలా నిలబడ్డారు.

ఎవడో ఒకడు యుగంధర్ని కాల్చి చంపుతాడు. యుగంధర్‌కి ఏ రక్షణాలేదు. ఏం చెయ్యాలి? యుగంధర్ ఏం చేస్తున్నాడో. ఏదయినా గుండు యుగంధర్‌కి తగిలి అప్పటికే ప్రాణం విడిచాడో కూడా రాజుకి తెలియలేదు. చూద్దామంటే తనమీద పడివున్న శత్రువు తనకి కవచంలా వున్న శత్రువు తనకే అడ్డు.

ఎప్పుడయితే బండార్కర్ వచ్చి మీదపడటంవల్ల 616 తనమీదనించి పడిపోయాడో మరుక్షణం యుగంధర్ నేలమీద మెలికలు తిరుగుతూ దొర్లిపోతున్నాడు శత్రువు నేలమీద పేల్చినా తనకు తగలకుండా. ఏం జరిగింది? ఎలా జరిగింది? ఈ ఆలోచనలతో అరక్షణం వృధా చెయ్యలేదు యుగంధర్. తనకి శక్తి వచ్చింది, తను కదలగలడు. బండార్కర్‌నీ, రాజునీ, తననీ రక్షించుకోవలసిన బాధ్యత తనది. అదే యుగంధర్ ఆలోచన. మెలికలు తిరుగుతూ రాజు పక్కనించే యింకొక శత్రువు దగ్గరికి వెళ్ళి, వాడి కాళ్ళు పట్టుకుని లాగాడు. అయితే రాజులా శత్రువుని తనమీద పడనివ్వలేదు. శత్రువు కాళ్ళు లాగుతూ, తను లేచి నిలబడ్డాడు. శత్రువుని కాళ్ళతో పట్టి గిరగిరా గదని తిప్పినట్టు తిప్పుతూ శత్రువులను బాదడం ప్రారంభించాడు యుగంధర్.

షూట్ చెయ్యాలి. ఈ యుగంధర్ని చంపెయ్యాలి. తప్పదు అని తెలుసు ఆ శత్రువులకు. కానీ చేతుల్లో తుపాకీలు, పిస్తోళ్ళూ ఎగిరిపోతున్నాయి. అంతేకాదు యుగంధర్ బలం అంతా ఉపయోగించి, శత్రువు శరీరమే ఆయుధంగా వుపయోగించి, వాళ్ళని కొడుతుంటే దెబ్బలు తగిలి, ఆయుధాలతో పాటు కిందపడుతున్నవాళ్ళు పిరికితనం ఎక్కువయి పారిపోతున్నవాళ్ళు. అంతా అయిదు నిముషాలలో ఆ గదిలో 616 మనిషి ఎవ్వడూ నిలుచుని లేడు. స్పృహ తప్పి పడిపోయారు. ఒకడు రాజుతో కలియబడి హోరాహోరీ యుద్ధం చేస్తున్నాడు. బండార్కర్, 616 లు యింకా నేలమీద ఒకళ్ళని ఒకళ్ళు బంధించి దొర్లుతున్నారు. యుగంధర్ చేతిలో పట్టుకున్న శత్రువుని నేలమీద పడేశాడు కర్రముక్కని పడేసినట్లు. ఆ శత్రువు మూలుగుతున్నాడు. రాజుతో కలియబడుతున్న శత్రువుని సమీపించి బూట్సు కాలితో అతన్ని కణతమీ ద ఒక్క తన్ను తన్నాడు యుగంధర్. మరుక్షణం ఆ శత్రువుకి స్పృహ పోయింది. రాజు ఆయాసంతో లేస్తున్నాడు. "రాజూ! ఒక మెషిన్ గన్ తీసుకుని, విరిగిన తలుపుకి అవతల నిలుచుని ఎవరు వచ్చినా నిర్దాక్షిణ్యంగా కాల్చిపారెయ్యి సందేహించక. వి కెనాట్ టేక్ ఎనీ రిస్క్" అని రాజుకి చెప్పి యుగంధర్ 616 వైపు ఒక్క అడుగు వేశాడు. అంతలో టెలిఫోన్ మోగింది.

టెలిఫోన్ తీద్దామా ? ముందు 616 ని అని యుగంధర్ ఆలోచిస్తున్నాడు. గణగణ మోగుతోంది టెలిఫోన్. 616నించి బండార్కర్‌కి ఏ ప్రమాదమూలేదని యుగంధర్ నిశ్చయించుకుని, రిసీవర్ తీశాడు.

"హల్లో 616?" అవతలనించి ప్రశ్న.

వీలయినంతవరకూ కంఠస్వరం మార్చి, "పిలుస్తాను సర్..క్షణం" అంటూ రిసీవర్ పక్కనపెట్టి, యుగంధర్ 616ని సమీపించాడు. 616 చేతిలో పిస్తోలు ఎక్కడో పడిపోయింది. నిరాయుధుడు.

"బండార్కర్ అతన్ని వదలండి" అని బండార్కర్ చెవిలో రహస్యంగా చెప్పి 616ని లేపి నిలబెట్టి, "నీకు బతకాలని వుంటే మీ బాస్‌లా వున్నాడు. ఫోన్ చేస్తున్నాడు. యుగంధర్నీ, రాజునీ, బండార్కర్నీ చంపేశానని చెప్పు" అన్నాడు చెవిలో. అదే సమయంలో కిందపడివున్న పిస్తోలు తీసి, 616 ఛాతీమీద గురిపెట్టి నిప్పులు కక్కుతూ చూశాడు. యుగంధర్ని చంపడానికి ప్రయత్నించిన తనమీద ఏ మాత్రం కరుణ చూపించడనీ, చంపేస్తాడనీ 616కి తెలిసిపోయింది. రిసీవర్ తీసుకుని "616 హియర్ సర్. ఆ కొద్దిపాటి గొడవ జరిగింది. రాజు, బండార్కర్ వచ్చారు. అందువల్ల ముగ్గుర్నీ చంపేశాము. యస్ వెంటనే అందరం ఖాళీచేసి బి.సెంటర్‌కి వెళ్ళిపోతాము" అని రిసీవర్ పెట్టేసాడు.

"**616 ముందు** మీరు వెళ్ళి ఆ కుర్చీలో కూర్చోండి" అన్నాడు యుగంధర్.

616 సర్కస్‌లో పులిలా వెళ్ళి కూర్చున్నాడు. "మిస్టర్ బండార్కర్ మీరు హెడ్‌క్వార్టర్స్‌కి ఫోన్ చేసి, మీ ఆఫీసర్లని పదిమందిని రమ్మనండి. ఈ ఫ్లోర్‌లో యింకా ఎవరయినా శత్రువులు వుండివుంటే అరెస్టు చేయించండి. సంకెళ్ళు వేసిన తర్వాత వాళ్ళందర్నీ యీ గదికి తీసుకురమ్మనండి" అన్నాడు యుగంధర్.

బండార్కర్ టెలిఫోన్ చేశాడు. ఆపరేటర్‌కి నెంబర్ చెప్పి, కనెక్షన్ యివ్వమన్నాడు. "హల్లో నేను బండార్కర్‌ని, వెంటనే హోటల్ రంజిత్‌కి పదిమందిని పంపండి. ఫ్లోర్ నెంబరు అయిదు. రూం నెం.321" అని రిసీవర్ పెట్టేశాడు.

"మిస్టర్ 616" అని నవ్వి "మన వృత్తిలో జయాపజయాలు తప్పవు. జయిస్తున్నట్టే వుంటుంది. అరక్షణంలో అపజయం పొందుతాము. ఐయామ్ సారీ మీరు చాలా శ్రమపడ్డారు. మనం యిప్పుడు సావధానంగా మాట్లాడుకోవచ్చు. మీరు నా ప్రశ్నలకి సమాధానాలు చెప్పారు. ఇంకా కొన్ని సందేహాలున్నాయి. దయచేసి వాటిని తీర్చండి" అన్నాడు యుగంధర్.

"అడగండి చెపుతాను. నన్ను మాత్రం చంపకండి. నాకు భార్యా, నలుగురు పిల్లలు వున్నారు" అన్నాడు 616 దీనంగా.

"ఎక్కడున్నారు?"

"మా దేశంలో" అన్నాడు 616. తన దేశం యేదో చెప్పనవసరంలేదన్నట్లు.

"మిమ్మల్ని చంపవలసిన అవసరం లేదు. మిమ్మల్ని చంపడం నాకు యిష్టంలేదు. ఆత్మరక్షణకి.. అదీ తప్పనిసరయితే తప్ప ఎవర్నీ చంపను" చెప్పాడు యుగంధర్.

"థాంక్ యు. అడగండి" అన్నాడూ 616.

"616 నేను చెప్పేది జాగ్రత్తగా విను. నువ్వు మాతో సహకరించావంటే నీకు చాలా తక్కువ శిక్ష వేసే ఏర్పాటు చేస్తాను."

"నీకు యింకెవరో బాస్ వున్నారన్నావు. ఎక్కడున్నాడు? మీ 'బి' సెంటర్ ఎక్కడున్నది? మీ ముఠావాళ్ళు ఎంతమంది? ఎక్కడెక్కడ ఏ ఏ పేర్లతో వున్నారు? ఈ వివరాలు చెప్పు."

"అంతేనా?"

"మరో రెండు అగ్రరాజ్యాలు కూడా మా ప్రధానిని చంపడానికి ప్రయత్నిస్తున్నారన్నావు. ఆ అగ్రరాజ్యాల గూఢచారుల నాయకులు ఎవరు? నీకు తెలిసే వుండాలి. వాళ్ళని గురించిన వివరాలు చెప్పు."

"ఇంకా?" అడిగాడు 616 నవ్వుతూ. అతనిలో నదురూ బెదురూ లేకపోవడం యుగంధర్‌కి ఆశ్చర్యాన్ని కలిగించింది.

"నేను రంజిత్ హోటల్‌లో దిగుతానని నీకు ముందే ఎలా తెలుసు? ఇన్ని ఏర్పాట్లు చెయ్యడానికి, రాజు రాజధాన్ హోటల్లో దిగుతాడనీ ఎలా గ్రహించారు?" అడిగాడు యుగంధర్.

616 పకపకా నవ్వాడు. "మేధావులయిన మీరు ఆ మాత్రం గ్రహించలేకపోయారా? విమానంలో హైజాకర్స్‌గా ప్రవర్తించిన వాళ్ళేగాక, ప్రయాణికుల్లా మా వాళ్ళు యిద్దరున్నారు. వాళ్ళు విమానాశ్రయంలోనే మాకు నిజం చెప్పేశారు. మీరూ, రాజూ, కాత్యా మరణించలేదనీ, మా హైజాకర్స్‌ని కాల్చి చంపేశారనీ, ఎంత బాగా నేర్పుగా వేషం మార్చుకున్నా మీ మారువేషాలు నా కళ్ళని కప్పలేదు. మీలా నేనూ యిదే వృత్తిలో చాలాకాలంనించీ వున్నానని గ్రహించండి. మిమ్మల్ని రంజిత్ హోటల్‌కి తీసుకువచ్చిన టాక్సి డ్రైవర్ మా మనిషి. అలాగే రాజుని థాట్ రీడింగ్, హిప్నాటిజం. హిప్నాటిక్ సజెషన్ గురించి మీకు తెలుసు. ఆ డ్రైవర్లు అందులో ఘటికులు. మీ మనస్సులో రంజిత్ హోటల్, రాజు మనస్సులో హోటల్ రాజధాన్ జ్ఞాపకం వచ్చేటట్టు మీ ఆలోచనలని అంటే మీ మనస్సుని హిప్నటయిజ్ చేశారు ఆ డ్రైవర్లు. చాలా" అడిగాడు 616.

"థాంక్ యు. హిప్నాటిజం, నేను ఒక్కణ్ణే అవసరమైనప్పుడు ఉపయోగిస్తాను అనుకున్నాను. నా అహంకారానికి బాగా బుద్ధి చెప్పారు. అసలు ప్రశ్నలకి జవాబు చెప్పలేదు. 'బి' సెంటర్ ఎక్కడున్నది? మీ బాస్ ఎక్కడున్నాడు?"

616 నవ్వి "మాది స్పెషల్ స్క్వాడ్ సామాన్యమైన ఇంటలిజెంట్ డిపార్ట్‌మెంట్ వాళ్ళం కాము. మా స్క్వాడ్ పేరు సూసైడ్ స్క్వాడ్ అంటారు. పట్టుబడము. మా చేత ఏమీ చెప్పించలేరు. పట్టుబడే స్థితే కలిగితే ఆత్మహత్య చేసుకుంటాము. ఇప్పుడు మీరు కొట్టిన తరువాత కిందపడ్డవాళ్ళని చూడండి. ఒక్కడూ బతికిలేడు. అందరూ చచ్చిపోయారు. అవసరమైతే నేనూ అదే పని చేస్తాను. నా నోట్లో, అంగిట్లో సైనేడ్ మాత్ర అతికించి వుంది. నాలికతో లాగితే వస్తుంది. కరిగిపోతుంది. మరునిముషం చావు" అన్నాడు 616.

యుగంధర్ ఆలోచిస్తున్నాడు. అయిదు నిముషాల క్రితం ఎందుకు అంత దీనంగా మాట్లాడాడు. 616ది వుత్త బెదిరింపుకాదనీ తెలుసు. 616 చనిపోతే చావనివ్వకూడదు. అతనిచేత ఎలా నిజం చెప్పించడం?

బండార్కర్ గదిలో పచార్లు చేస్తున్నాడు అసహనంతో, ఇంకా తన సి.ఐడి మనుష్యులు ఎందుకు రాలేదు. రాజు మెషిన్‌గన్ పట్టుకుని తలుపు దగ్గిరే నిలుచునున్నాడు. 616ని హిప్నటయిజ్ చేస్తే ప్రయోజనం వుంటుందా? ఉండదు. హిప్నటయిజ్ చేస్తారని 616కి తెలుసు. లొంగడు.

''ఆగండి అక్కడే ముందుకు వచ్చారా కాల్చేస్తాను'' అన్న రాజు కేక వినపడింది.

''మనవాళ్ళే రాజూ'' అంటూ బండార్కర్ రాజు దగ్గరికి వెళ్ళాడు.

''మీరు వెళ్ళి మనవాళ్ళు అయినదీ కానిదీ తేల్చి చెప్పండి'' అన్నాడు రాజు.

బండార్కర్ రాజుని దాటి ముందుకి వెళ్ళాడు. అంటే ఆ వచ్చిన పదిమందికీ, రాజుకీ అడ్డంగా. ఇంకా వాళ్ళని సమీపించకముందే బండార్కర్ అరిచాడు. ''అవును రాజూ వీళ్ళు మనవాళ్ళు కారు'' అప్పటికే ఆలస్యం అయిపోయింది. రాజు మెషిన్‌గన్‌కీ, వాళ్ళ మెషిన్‌గన్‌కీ మధ్యన వున్నాడు బండార్కర్. ఎవరు పేల్చినా ముందు బండార్కర్ ప్రాణం పోతుంది.ఆ వచ్చినవాళ్ళలో ఒకడు ఒక అడుగు ముందుకు వేసి ''బండార్కర్ ప్రాణానికీ, 616 ప్రాణానికీ బేరం. 616ని వొదిలెయ్యండి. మాతో పంపించెయ్యండి. బండార్కర్‌ని ఏం చెయ్యం'' అన్నాడు. బండార్కర్ మొహం పాలిపోయింది. తన ఏజంట్లు యేమయ్యారు? ఇప్పుడైనా వస్తే వెనకనించి యీ పదిమందినీ..

''త్వరగా తేల్చండి. 616ని వొదులుతారా, బండార్కర్‌ని షూట్ చెయ్యమా?'' అడిగాడతను.

''బండార్కర్‌ని షూట్ చేస్తే మీరు అందరూ చస్తారు. ఒక్కణ్ణీ ఒదలను'' అరిచాడు రాజు.

వాళ్ళ నాయకుడు నవ్వి ''మేము సిద్ధం. మాది సూసైడ్ స్క్వాడ్'' అన్నాడు.

యుగంధర్‌కి వాళ్ళ మాటలు వినిపించాయి. 616 విన్నాడు. నవ్వి, ''యుగంధర్ బండార్కర్ ఫోన్ కాల్ సి.బి.ఐ. ఆఫీసుకి కనెక్ట్ కాలేదు. ఈ గొడవ ప్రారంభం అయిన తర్వాత, యీ గదిలో టెలిఫోన్ మా వాళ్ళ గదికి కనెక్టు చేసుకున్నారు. మా వాళ్ళు విన్నారు. వచ్చారు. జయాపజయాలు మన వృత్తిలో తప్పవు. నన్ను వెళ్ళనివ్వండి'' అన్నాడు.

యుగంధర్ ఆలోచిస్తున్నాడు. ఏం చెయ్యాలి? 616ని వొదిలెయ్యాలా? బండార్కర్ ప్రాణం ఆపదలో వుంది. ఏ క్షణాన్నయినా వాళ్ళు కాల్చి చంపవచ్చు.

''సరే, 616 వెళ్ళండి'' అన్నాడు యుగంధర్. 616 లేచి నిలుచుని రెండడుగులు ముందుకు వేశాడు. యుగంధర్ పక్కగా వచ్చాడు. యుగంధర్ పిడికిలి బిగించి, 616ని తలమీద ఒక్క దెబ్బ. ఒక్కటే ఒక్క దెబ్బ కొట్టాడు. ఆ దెబ్బకి 616కి స్పృహ పోయి, కిందపడిపోతున్నాడు. పడిపోతున్న 616ని రెండు చేతుల్లో పట్టుకుని భుజం మీద వేసుకున్నాడు యుగంధర్. 616కి చాలాసేపటివరకూ స్పృహ రాదు. అంత పెద్ద దెబ్బ కొట్టాడు. యుగంధర్ తలుపు దగ్గరకు వెళ్ళాడు భుజం మీద స్పృహలేని 616ని వేసుకుని.

''ఓహో! యుగంధరా'' అన్నాడు శత్రువుల జట్టు నాయకుడు.

''అవును. నా భుజం మీద 616.. స్పృహలేదు'' అని జవాబు చెప్పాడు యుగంధర్.

''అలాగా. అయితే యింకొంచెం దూరం వచ్చి, 616ని నేలమీద పడుకోబెట్టండి. మీరూ బండార్కర్ అక్కడే నిలబడండి. 616ని మేము తీసుకుని వెళ్ళిపోతాము''.

యుగంధర్ నవ్వి, ''మేము పసిపాపలం అనుకున్నావా? రాజు పట్టుకున్న మెషిన్‌గన్‌కి బండార్కర్ అడ్డంగా నిలబడి వుంటే, మీరు నన్ను, బండార్కర్‌ని షూట్ చెయ్యరని ఏమిటి నమ్మకం?'' అడిగాడు.

ఆ శత్రువుకి యేం జవాబు చెప్పాలో తెలియలేదు. ఆలోచిస్తున్నాడు.

''నేను చెపుతాను విను'' అన్నాడు యుగంధర్.

"చెప్పండి.

"మీరు పదిమంది వున్నారు. మీ అందరి దగ్గరా మెషిన్ గన్స్ వున్నాయి. అవునా?" అడిగాడు.

"అవును"

"ముందు తొమ్మిదిమంది. ముందు నిలబడ్డ నువ్వు తప్ప మిగతా వాళ్ళందరూ తమ చేతిలో వున్న ఆయుధాలని అటు ఒక మూలకి విసిరి పారెయ్యండి."

"తర్వాత?" అడిగాడు ఆ శత్రువు.

"నీ దగ్గర మా రాజు దగ్గిర మాత్రం మెషిన్‌గన్స్ వుంటాయి. రాజు తన మెషిన్‌గన్ తీసుకుని, ముందుకు నా పక్కకు వచ్చి నిలుచుంటాడు. నీమీద మా వాళ్ళు గురిపెట్టి, నువ్వు నీ మెషిన్‌గన్ మా మీద గురిపెట్టి వుంచు. నేను 616ని కింద పడుకోబెడతాను. మీరు 616ని తీసుకువెళ్ళండి. మీరు మమ్మల్ని షూట్ చెయ్యపోతే రాజు మిమ్మల్ని.."

"అర్థమయింది ఆల్‌రైట్" అన్నాడు శత్రువు.

రాజుకు నచ్చలేదు రాజీ. యుగంధర్‌తో అప్పుడు వాదించేందుకు వ్యవధిలేదు. అది సమయమూ కాదు. దభదభమని తొమ్మిదిమందీ వాళ్ళ చేతుల్లో ఆయుధాలు ఒక పక్కగా పడేశారు. యుగంధర్ లెక్క పెడుతున్నాడు.

"తొమ్మిది, వెరీగుడ్ కానీ ఒక సందేహం?" అన్నాడు యుగంధర్.

"ఏమిటి?" అడిగాడు ఆ శత్రువు.

"యే పిస్తోలో మీలో యెవరూ దాచుకోలేదని యేమిటి నిశ్చయం 616ని బండార్కర్‌కి అప్పచెపుతాను. ఆ తొమ్మిదిమందినీ నేను స్వయంగా తనిఖీ చేస్తాను" అన్నాడు యుగంధర్.

"ఇది మనం ముందు అనుకోలేదు" అరిచాడు శత్రువు.

"అవును. ఇప్పుడు కలిగింది నాకు ఆ అనుమానం. నా దగ్గర ఆయుధం లేదు" అన్నాడు యుగంధర్. ఆ శత్రువు అరనిముషం ఆలోచించి, "సరే, త్వరగా" అన్నాడు. యుగంధర్ స్పృహలేని 616ని బండార్కర్ భుజం మీదకి మార్చాడు. తర్వాత నెమ్మదిగా తను శత్రువులు నిలుచున్న చోటికి వెళ్ళాడు.

"వెనక్కి వెళ్ళి ఒక్కొక్కర్నీ తనిఖీ చేస్తాను" అన్నాడు.

"కానివ్వండి" అన్నాడు శత్రువు. యుగంధర్ శత్రువుల వెనక్కి వెళ్ళాడు. ఒక్కొక్కణ్ణీ జాగ్రత్తగా పరిక్ష చేసి, పరిక్ష చేసినవాణ్ణి పక్కకి నిలుచోమని, అలా తొమ్మిదిమందిని పరిక్ష ముగించి, "ఆ ఎవరి దగ్గరా ఆయుధంలేదు" అంటూ వెనక నిలుచున్న ఒక్కణ్ణి, ముందుకి ఆయుధం పట్టుకున్న శత్రువు మీదకి ఒక తోపు తోశాడు. ఆ తోపుకి వాడు వెళ్ళి మెషిన్‌గన్ పట్టుకున్న అతనిమీద పడ్డాడు ముందుకి. అయినా మెషిన్‌గన్ మీదనించి పట్టువదలకుండా, ముందున్న రాజుమీదకి మెషిన్‌గన్ పేలుస్తున్నాడు. బండార్కర్ మీదకి పేల్చడం లేదు. ఎక్కడ 616కి గుండు తగులుతుందో అని. మెషిన్‌గన్స్ పారేసిన మిగతా ఎనిమిదిమందీ చెల్లాచెదురై కిందపారేసిన మెషిన్‌గన్స్ తీసుకుంటున్నారు. వాళ్ళకన్నా ముందు తను ఒక మెషిన్‌గన్ తీసుకున్నాడు యుగంధర్. శత్రువులు మధ్య, వెనక యుగంధర్ శత్రువులకి ముందు రాజు. రాజుకీ శత్రువులకీ మధ్య బండార్కర్ 616తో. యుగంధర్ శత్రువులమీద పేలుస్తున్నాడు. శత్రువులు అటు రాజుమీదకీ, యిటు యుగంధర్ మీదకీ

మెషిన్‌గన్స్ పేలుస్తున్నారు. మధ్య నిలుచున్న బండార్కర్ మీదకు మాత్రం ఎవరూ గురిపెట్టడంలేదు. బండార్కర్‌కి తగులుతుందని రాజు, యుగంధర్‌ల భయం.

616కి తగులుతుందని శత్రువుల భయం.

వాళ్ళు మొత్తం పదిమంది. కిందపడినవాడు కూడా లేచాడు. తొమ్మిదిమంది చేతుల్లో మెషిన్ గన్స్ వున్నాయి. తాము యిద్దరే. రాజూ తనూ ఎంతసేపు వాళ్ళతో యిలా యుద్ధం చెయ్యగలరు? యుగంధర్‌కి ఆత్మధైర్యం చాలకకాదు. యెటువంటి పరిస్థితిలో వున్నా వివేకం కోల్పోడు.

ఈ యుద్ధంలో రాజూ తనూ నెగ్గుతారా? అంతమందితో పోరాడి గెలవగలుగుతారా? ఆ ఆయుధాలు లేకపోతే ఆ పదిమందినీ పచ్చడి చెయ్యగలరు. కానీ వాళ్ళ చేతుల్లో మెషిన్‌గన్స్ వున్నాయే.

తనూ, రాజూ ప్రాణాలు కోల్పోతే మరుక్షణం బండార్కర్ ప్రాణం పోయినట్లే.

"అబ్బా!" అరిచాడు రాజు. అంటే రాజుకి గుండు దెబ్బ తగిలింది. రాజు కేకకు అరక్షణం పాటు దృష్టి అటు మరల్చాడు. వెంటనే యుగంధర్‌కి జబ్బలో దిగబడింది నిప్పుకణంలా గుండు. రక్తం కారుతోంది. చేతిలో మెషిన్‌గన్ నిలబడడంలేదు. అయిపోయింది. తను తప్పు చేశాడు. 616ని అప్పచెప్పి రాజీకి ఒప్పుకోవలసిందేమో ఇప్పుడు శత్రువులది పై చెయ్యి. ఇక రాజీకి ఒప్పుకోరు.

యుగంధర్ చేతిలో మెషిన్ గన్ కిందపడింది.

రాజు యింకో కేక పెట్టాడు. అదే సమయానికి బండార్కర్ ఒక అరుపు అరిచాడు.

15

కాత్యా భుజం మీద చెయ్యివేసి "ఏడ్వకండి అనుక్షణమూ ఆపదలతో జీవించే యుగంధర్‌గారికి యిలాటి దుర్మరణం ఎప్పుడో ఒకప్పుడు తప్పదని మీకు తెలుసుగా" అన్నాడు ఇన్‌స్పెక్టర్ థామస్.

కాత్యా దుఃఖాన్ని దిగమింగుకుని "రాజూ? బండార్కర్?" అడిగింది.

థామస్ యింకోవైపు చూపించాడు బల్లలమీద తెల్లని బట్టలు కప్పివున్న రెండు శవాలని. కాత్యా ఒక బల్ల దగ్గిరకి వెళ్ళి, తలమీద వున్న బట్టలాగింది.

రాజూ! రాజూ!" అన్నది ఆప్యాయతతో, దుఃఖంతో.

ఇన్‌స్పెక్టర్ థామస్ బట్టని శవం మొహం మీదకి కప్పేశాడు.

"ఒక్కసారి ఆఖరిసారి మిస్టర్ బండార్కర్‌ని" అంటూ రెండో శవం వున్న స్థలానికి వెళ్ళింది కాత్యా. నిశ్చలంగా వున్న ఆ మొహాన్ని చూసి, "దేశం కోసం ప్రాణాలు అర్పించిన మీ ముగ్గురు" అని యిక మాట్లాడలేక ఏడుస్తూ మార్చురీలోంచి బయటికి వెళ్ళిపోయింది.

అటు రాజు కేక వెంటనే బండార్కర్ కేక వినేసరికి యుగంధర్ వొళ్ళంతా అరక్షణం వొణికిపోయింది. తనవల్ల, తన అసమర్ధతవల్ల, తన అహంకారం వల్ల రాజు, బండార్కర్ల ప్రాణాలని బలి యిచ్చాడా? యుగంధర్ సింహంలా ఒక్క ఉరుకు వురికాడు శత్రువుల మీదకి. ఎవర్ని, ఎక్కడ కొడుతున్నదీ ఎందర్ని కొడుతున్నదీ ఏమీ ఆలోచించే స్థితిలో లేడు.

యుగంధర్‌వి రెండు చేతులు కావు. యినపకడ్డీలు. శత్రువుల చేతిలో మెషిన్‌గన్స్ వున్నాయి. ఏ క్షణాన్నయినా తనకీ గుండు తగలవచ్చు. ఇవేవీ యుగంధర్ మనస్సులోకి రాలేదు.

యుగంధర్ అలా విజృంభించి మీదకి ఉరికేటప్పటికి శత్రువులు నిముషంపాటు అచేతనులయ్యారు. ఆ నిమిషంలో యుగంధర్ ఒకడిచేతిలో మెషిన్‌గన్ తీసుకుని శత్రువుల వైపు గురిపెట్టి 'ఢాం! ఢాం' అని పేల్చాడు. ఎలా జరిగిందీ తనకే తెలియదు. శత్రువులలో ధైర్యం ఎందువల్ల పోయిందో కూడా తెలియదు. మరునిముషం ఒక్కడు కూడా ప్రాణాలతో లేడు. అందరూ నేలకూలిపోయారు.

మూలుగులు, ఏడుపులు, చచ్చిపోతున్న శత్రువుల ఆఖరి వూపిరి రొద, వాళ్ళ మధ్యనించి యుద్ధంలో పడిపోయిన శత్రువుల శవాల మధ్యనించి నడిచి వెళ్ళినట్టు యుగంధర్ బండార్కర్‌ని సమీపించాడు. బండార్కర్ కూడా మూలుగుతున్నాడు. 616కి యింకా స్పృహ రాలేదు. బండార్కర్ పక్కన పడివున్నాడు. రాజు దగ్గరికి పరిగెత్తాడు యుగంధర్. అప్పటికే ఎన్నో గాయాలకి గురి అయి, పిస్తోలు గుళ్ళకి రక్తస్రావం అయి నీరసించి వున్న రాజు మొహం అంతా రక్తమయం. యుగంధర్ని చూడనుకూడా చూడలేదు. గొంతులోంచి ఏవో శబ్దాలు వస్తున్నాయి. పరిక్ష చెయ్యాలి, వెంటనే రాజునీ, బండార్కర్నీ ఆసుపత్రికి తీసుకుని వెళ్ళాలి. ఇదే ఆలోచన. యుగంధర్ మోకాళ్ళమీదకి వొంగాడు. తనకు తగిలిన గుండుదెబ్బ విషయం మర్చేపోయాడు. తన వీపులోంచి రక్తం కారుతున్న విషయమే తెలియదు. మోకాళ్ళ మీదకి వొంగి రాజు చెయ్యి తన చేతిలోకి తీసుకుని నాడి పరిక్ష చెయ్యబోతున్న యుగంధర్ అలాగే ముందుకు పడిపోయాడు నీరసంతో స్పృహపోతూ.

**అలా బొంబాయి వీధుల్లో** వొంటరిగా నడుస్తోంది కాత్యా. అది కాత్యాకాదు, కాత్యా నీడ అనుకోవచ్చు. ఆమె కళ్ళల్లో నీళ్ళు కూడా రావడంలేదు. మనస్సులో ఆలోచనలు వస్తున్నాయి కాని, అవి నిలవడంలేదు. మబ్బుల్లా తేలిపోతున్నాయి. యుగంధర్, రాజులు నిజంగా మరణించారా? తను నమ్మలేకుండా వుంది. నమ్మక ఏం చేస్తుంది? తన కళ్ళతో తనే వాళ్ళ శవాలని చూసింది. తను యిక ఏం చెయ్యాలి? ఎక్కడికి వెళ్ళాలి? ఒంటరిగా ఎక్కడికెళ్ళినా ఏం చేసినా, తన బతుక్కి ప్రయోజనం వుండదు. వీధిలో వస్తున్నవాళ్ళని ఎవర్నీ చూడడంలేదు. కలలో నిద్రలో నడుస్తున్నటు నడుస్తోంది. అలా ఎంత దూరం ఎన్ని వీధులు తిరిగిందో తనకే తెలియదు.

"మిస్ కాత్యా!" వులిక్కిపడి పక్కకి చూసింది. ముప్పై ఏళ్ళ యువకుడు మంచి బట్టలు, చురుకైన మొహం.

"మిస్ కాత్యా" అన్నాడు మళ్ళీ. కాత్యా మాట్లాడలేదు. అతనివైపే తను మూగదయినట్టు చూస్తోంది. "ఆగకండి. నడుస్తూ వుండండి. మీ శోకం నాకు తెలుసు. నిజంగా మీరు దుఃఖించవలసిన అవసరంలేదు" అన్నాడు అతను నవ్వుతూ.

కాత్యా ప్రశ్నార్ధకంగా చూసింది.

"యుగంధర్, రాజు బండార్కర్‌లు నిజంగా మరణించలేదు. శత్రువులని మోసం చేసేందుకు అలా వల పన్నారు. శత్రువుల శవాలకే మేకప్ చేసి, మార్చురీకి పంపారు. ఈ విషయం ఎవరికీ తెలియకుండా మీకు చెప్పమని చెప్పారు బండార్కర్. అందుకే ఒంటిగా నేను యిలా బజారులో కలుసుకున్నాను. నేను సి.బి.ఐ ఏజంటుని."

"మీరు నిజం చెపుతున్నారా?" అడిగింది కాత్యా.

"అబద్ధం చెప్పవలసిన అవసరంలేదు. యుగంధర్, రాజు, బండార్కర్‌లు ఒకచోట వున్నారు. ఎవరికీ తెలియని చోట. మిమ్మల్ని తీసుకురమ్మన్నారు" అన్నాడు అతను.

కాత్యా గుండెలో గుడిగంటలు మోగాయి. కళ్ళల్లో దీపాలు వెలిగాయి.

"పదండి, త్వరగా" అన్నది.

"ప్లీజ్ అలా ఆవేశపడకండి. శత్రువులు మనల్ని చూస్తూ వుంటారు. వీళ్ళకి నిజం తెలియకూడదు. నేను ముందుకి వెళ్ళిపోతాను. వెనకే రండి. అక్కడ కారు ఆగివుంది" అన్నాడు అతను. కాత్యా అతని వెనకే వెళ్ళింది. కారు ఎక్కగానే స్టార్ట్ చేశాడు అతను.

"ఎంత దూరం?" అడిగింది కాత్యా.

"కాస్త దూరమే. సిటీ లిమిట్స్ దాటాక. వెనక మనల్ని వెంబడిస్తూ ఏదయినా కారు వస్తుందేమో కాస్త కనిపెట్టి వుండండి."

కాత్యా వెనక్కి చూసింది. చాలా కార్లు వస్తున్నాయి. కొన్ని పక్కలకి తిరుగుతున్నాయి. కొన్ని తమని ఓవర్‌టేక్ చేసుకుని వెళ్ళిపోతున్నాయి. కాని ఒక కారు మాత్రం తమ వెనకే, అదే స్పీడులో వస్తోందని గమనించింది.

"అవును. ఒక నల్ల అంబాసిడరు వెనకే వస్తోంది" అన్నది కాత్యా.

"డోంట్ వర్రీ. శత్రువులు మనల్ని వెంబడిస్తారని నాకు ముందే తెలుసు. ఆ అంబాసిడర్‌కి కనపడకుండా తప్పుకోవడం పెద్ద కష్టంకాదు" అంటూ రెండు ఇరుకు సందుల్లోంచి కారు స్పీడుగా పోనిచ్చి, మళ్ళా హైవే రోడ్ మీదకి వచ్చి, కారు పార్కింగ్ స్పేస్‌లో ఒక చోట ఆపి, చటుక్కున కాత్యాతోపాటు దిగి, మళ్ళీ యింకో కారు ఎక్కి బయలుదేరారు. నవ్వుతూ, "ఇప్పుడు చూడండి. ఇంకా వాళ్ళు మనవెనక వస్తున్నారా?" అడిగాడు.

"లేదు" అంది కాత్యా.

"అక్కడ మనకోసం వెతుకుతూ వుంటారు. ఇక భయంలేదు" అన్నాడు. అరగంట తర్వాత ఒక ఇంటి గేటులోకి కారు పోనిచ్చాడు. పోర్టికోలో ఆపాడు కారు. ఒకతను వచ్చి కారు తలుపు తీసి, లోపలికి వెళ్ళమన్నట్టు తలవూపాడు. కాత్యా అతనితోపాటు లోపలికి వెళ్ళింది.

అది పెద్ద హాలు. హాలులో కుర్చీలు, సోఫాలు, గోడలకి రంగు రంగుల పటాలు.

హాలు మధ్యనించి మేడమీదికి మెట్లు, హాలుకి యిటూ అటూ చాలా గదులు. తలుపులు మూసేసి వున్నాయి.

"యుగంధర్‌గారు ఏరి?" అడిగింది కాత్యా.

"రండి" అన్నాడతను.

మేడమెట్లు ఎక్కారు. చిన్న వసారా, వసారాలో రెండు పక్కలా రెండు గదులు. ఒక గది తలుపు తీసి, "రండి" అన్నాడు అతను. కాత్యా లోపలికి వెళ్ళింది.

"ఎవరూ లేరే..." అంది. అంటూ వెనక్కి తిరిగింది. తలుపు మూసుకుంది. ఒక్క గంతున తలుపు దగ్గిరికి వెళ్ళి లాగింది. రాలేదు తలుపు.

బయట తాళం వేశారో, గడియపెట్టారో. అసలే దుఃఖంతో మనస్సు మొద్దుబారిన కాత్యాకి యేమీ అర్థం కాలేదు.

యుగంధర్ దగ్గిరికి తీసుకెళతానని చెప్పి తనని యీ గదిలో ఎందుకు బంధించారు. చుట్టూ చూసింది. గదికి కిటికీ లేదు. బాగా ఎత్తున వెంటిలేటర్ ఒకటి వుంది. దానికి వుక్కు జల్లెడా, యినుప కడ్డీలు వున్నాయి. పక్కన ఒక తలుపు కనిపించింది. తెరిచింది కాత్యా. అది నీళ్ళగది. గదిలో మంచం పరుపు. ఒక కుర్చీ బల్ల... బల్లమీద నీళ్ళకూజా. అంతే

తలుపు బాదింది. "ఎవరు? తలుపు తియ్యండి" గొంతుచించుకుని అరిచింది కాత్యా. ఎవరూ రాలేదు. ఎవరూ పలకలేదు. యుగంధర్‌కీ, రాజుకీ ఎన్నో సమయాల్లో, ఎన్నో చిక్కుల్లో కుడిభుజంగా వుండి, వాళ్ళ ప్రాణాలనే కాపాడిన కాత్యా యీ స్థితిలో ధైర్యం కోల్పోయి, నీరసించి, వెక్కి వెక్కి ఏడ్వటం ప్రారంభించింది.

616కి యింకా స్పృహరాలేదు.

"మిస్టర్ బండార్కర్ ఈ పన్నాగం పారుతుందని నేను అనుకోను. నేనూ, రాజూ మరణించిఅన్‌ట్లు యిదివరలో రెండుసార్లు నాటకం ఆడాము. ఒకసారి దాదాపు నమ్మారు. ఒకసారి శత్రువులే ఆ నాటకం ఆడారు. నేను, రాజూ మరణించామని ప్రకటించినంత మాత్రాన, శత్రువులు నమ్మరని నా అభిప్రాయం" అన్నాడు యుగంధర్.

అది ఒక చిన్న గది. గదిలో ఆరు కుర్చీలు, ఒక మూలగా డైరెక్టరీలో నెంబర్ లేని టెలిఫోన్, ఒక కూజాలో నీళ్ళు. అవే ఆ గదిలో వున్నవి. సి.బి.ఐ వారి రహస్యమైన చోటు అది. బండార్కర్‌కీ, బండార్కర్ డిప్యూటీకి తప్ప ఆ గది ఎక్కడున్నదీ ఎవరికీ తెలియదు.

స్పృహపోయి కిందపడివున్న యుగంధర్, రాజు, బండార్కర్‌లనీ 616ని సి.బి.ఐ వారు వచ్చి ఆస్పత్రికి తీసుకుని వెళ్ళారు. ఆ గొడవకి హోటల్ అధికారులు పైకివచ్చి, పోలీస్‌కి రిపోర్ట్ యివ్వడంవల్ల. చనిపోయిన శత్రువుల శవాలని మార్చురీకి పంపారు. బండార్కర్ డిప్యూటీ ఆస్పత్రిలో బండార్కర్ పక్కనే కూర్చున్నాడు. మొదట బండార్కర్‌కి స్పృహ వచ్చింది. యుగంధరూ, రాజూ, తనూ మరణించినట్లు నాటకం ఆడమనీ, శత్రువుల శవాలలో మూడు శవాలకి వేషం మార్చి, మార్చురీకి పంపమనీ, తాము ముగ్గురూ మరణించారని శత్రువు అనుకుంటే, రహస్యంగా తమ దర్యాప్తు సాగించవచ్చనీ, బండార్కర్ తన డిప్యూటీకి చెప్పారు. బండార్కర్ ఆదేశం ప్రకారం సి.డి.ఐ. డిప్యూటీ డైరెక్టర్ ఆ యేర్పాటు చేశాడు.

యుగంధర్‌కీ, రాజుకీ స్పృహ వచ్చిన తర్వాత బండార్కర్ తన పథకం యుగంధర్‌కి చెప్పాడు. యుగంధర్ వెంటనే యేమీ చెప్పలేదు. ఎవరికీ తెలియకుండా, రాత్రికి రాత్రి బండార్కర్‌నీ, యుగంధర్నీ, రాజునీ 616నీ, రహస్యమైన ఆ గదికి చేర్చాడు సి.బి.ఐ, డిప్యూటి.

బండార్కర్ చిన్న నవ్వు నవ్వి, "అంతకన్నా నాకు అప్పుడు మంచి ఆలోచన స్ఫురించలేదు. మనం ముగ్గురం అనామకంగా వుంటే, అజ్ఞాతంగా మన దర్యాప్తు సాగించి, ప్రధానిని హత్య చెయ్యడానికి పూనుకున్నవాళ్ళని పట్టుకొనవచ్చని అనుకున్నాను" అన్నాడు బండార్కర్.

"616 ఏమయ్యాడు? అనే సందేహం కలగదా శత్రువులకి" అడిగాడు రాజు.

"చచ్చిపోయి వుంటాడని అనుకుంటారు" చెప్పాడు బండార్కర్. బరువుగా వున్న కనురెప్పలు తెరిచాడు 616. నిముషంపాటు గదంతా కలయచూసి, "ఆఖరికి నెగ్గారన్నమాట" అన్నాడు నవ్వుతూ.

ఒక గ్లాసులో మంచినీళ్ళు పోసి 616కి యిచ్చాడు రాజు. 616 మంచినీళ్ళు తాగి మరొకసారి గదంతా పరీక్షగా చూశాడు.

"ప్రయోజనం లేదు 616. ఈ గదిలోంచి ఎవరూ తప్పించుకొలేరు. ఈ గది తలుపుకి తాళం కూడా లేదు. తలుపు గడియ దగ్గిరికి వెళ్ళి రహస్యంగా సరిగా వుచ్చరిస్తూ నాలుగు మాటలు చెపితే తలుపు తెరుచుకుంటుంది. ఎలక్ట్రానిక్ డివైస్" అన్నాడు యుగంధర్.

నేను పారిపోవడానికి కానీ, మీతో కలియపడడానికి కానీ ప్రయత్నించడం లేదు" అన్నాడు 616.

"దట్ యీజ్ వెరీగుడ్ అంతేకాదు, మీరు మాతో సహకరిస్తే సంతోషిస్తాము" అన్నాడు యుగంధర్.

616 నవ్వాడు. "మిష్టర్ యుగంధర్ ఇదివరలో ఒకసారి చెప్పాను, అలాటి పని నేను చెయ్యను అని. అంతేకాదు, నేను కళ్ళు తెరవకముందు మీ సంభాషణ విన్నాను. మీరు చెప్పింది అక్షరాలా నిజం. మీరు, రాజూ మరణించారంటే ఎవరూ నమ్మరు. ఈ నాటకం మీరు చాలాసార్లు ఆడించారు. మీ శవాలు ఏ రెడ్ ఫోర్ట్ వద్ద అందరూ చూసేందుకు వుంచినా కూడా నమ్మరు" అన్నాడు 616.

"అవును శత్రువులు నమ్ముతారని కాని, నమ్మడం వల్ల మాకు ప్రయోజనం వుంటుందని కానీ నేను అనుకోవడంలేదు. మిష్టర్ 616 మీ ముఠా గురించిన వివరాలు మిమ్మల్ని చెప్పమని నేను కోరటంలేదు. చెప్పవద్దు. ఇంకో రెండు అగ్రరాజ్యాల గూఢచారులు కూడా మా ప్రధానిని హత్య చెయ్యడానికి ప్రయత్నిస్తున్నారనీ చెప్పారు. వాళ్ళ నాయకులు ఎవరు, ఎక్కడున్నారో ఆ వివరాలు మీకు తెలిసివుండాలి. ఆ వివరాలు చెప్పండి చాలు" అన్నాడు యుగంధర్.

616 అయిదు నిముషాలు ఆలోచించాడు. "ఎందుకు చెప్పాలి? మీ ప్రధానిని మేము హత్య చేసినా, వాళ్ళు హత్య చేసినా ఎవరు హత్య చేసినా పరిస్థితి ఒకటే. ఎవరు హత్య చేస్తారని కాదు. ప్రధానిని హత్య చెయ్యాలి. వాళ్ళపేర్లు. వాళ్ళ వునికి మీకు చెపితే, వాళ్ళని పట్టిచ్చినవాణ్ణి అవుతాను. అంతేకాక మాకేమీ ప్రయోజనం వుండదు" అన్నాడు 616.

యుగంధర్ సిగరెట్ పాకెట్ తీసి, 616కి ఒక సిగరెట్ యిచ్చి, బండార్కర్‌కీ, రాజుకీ యిచ్చి తను ఒకటి వెలిగించుకుని, "మిష్టర్ 616 మీరూ, మీ ముఠావాళ్ళు కానీ, ఆ రెండు అగ్రరాజ్యాలవారు కానీ మా ప్రధానిని హత్య చేసేందుకు యిక అవకాశం లేదు. రాదు. తగిన రక్షణ చర్యలు తీసుకున్నాము" అన్నాడు.

616 పకపకా నవ్వాడు. "నిజంగా మీరు అంత అమాయకులా? నమ్మలేకుండా వున్నాను. డబ్బుకి అమ్ముడుపోయే వాళ్ళు. మాతృదేశం మీద కన్న డబ్బుమీద మమకారం వుండేవాళ్ళు, ప్రతి దేశంలో ప్రతి ప్రభుత్వంలో వుంటారని మీకు తెలియదా?" అడిగాడు 616.

యుగంధర్ తన ఆశ్చర్యాన్ని బయటికి కనపరచకుండా "తెలుసు. తెలిసే తగిన జాగ్రత్తలు తీసుకున్నాం. కనుక మీ పథకం పారదు. శత్రువులతో ఎప్పుడూ నేను బేరానికి దిగను. కానీ మీ విషయంలో నా సిద్ధాంతం సడలిస్తున్నాను. మిగతా ఆ అగ్రరాజ్యాల గూఢచారుల గురించి చెప్పండి. వాళ్ళని పట్టుకుని, వాళ్ళని నిర్మూలించేసిన తర్వాత మీరు స్వదేశం వెళ్ళేందుకు తగిన ఏర్పాట్లు చేస్తాను" అన్నాడు యుగంధర్.

"ఈ మాట యింకొకరు చెపితే నమ్మేవాణ్ణి కాను. కాని మీరు, యుగంధర్ చెపితే నమ్ముతాను. ఆడిన మాట తప్పరు మీరు. ఆ విషయం నాకు తెలుసు. కాని" అంటున్నాడు 616.

"కాని?" అడిగాడు యుగంధర్.

"మీరు నన్ను ప్రాణాలతో వదిలిపెట్టినా స్వదేశానికి వెళితే అక్కడ నాకు చావు తప్పదు" అన్నాడు 616 నీరసంగా.

"అయితే యిక్కడే వుండిపోండి. మిమ్మల్ని క్షమించి, మా ప్రభుత్వానికి సహాయం చేసినందుకు పారితోషికంగా భారత పౌరసత్వం యిప్పిస్తాను" అన్నారు బండార్కర్.

616 కళ్ళు చెమ్మగిల్లాయి. "నేను ఒంటిగాణ్ణి అయితే మీ ఆతిథ్యం సంతోషంగా స్వీకరించేవాణ్ణి. కానీ, చెప్పానుగా నాకు భార్యా, పిల్లలూ వున్నారని. వాళ్ళ గతి యేంకాను?" అన్నాడు 616.

యుగంధర్ ఆలోచనలో పడ్డాడు. 66కి యే ఆశ చూపించాలి. ఎలా అతనిచేత చెప్పించడం.

"మిష్టర్ 616.. ఒక ఆలోచన."

"చెప్పండి" అన్నాడు 616.

"మీకు యిక్కడ బాస్ వున్నారని చెప్పారు. ఆ బాస్ ఎక్కడున్నాడో చెప్పండి. పట్టుకుంటాము. మీ భార్యా, పిల్లల్ని సురక్షితంగా, యీ దేశానికి పంపితే ఆ బాస్‌ని వొదిలేస్తామని మీ ప్రభుత్వానికి కబురు పంపుతాము."

616 జాలిగా నవ్వి "నాకు వేరే బాస్ వున్నారని అబద్ధం చెప్పాను. నేనే బాస్‌ని. ప్రయోజనం లేదు యుగంధర్" అన్నాడు.

యుగంధర్‌కి యింకేమీ స్ఫురించలేదు. "ఒక గంటలో తిరిగివస్తాను. రాజు మీకు తోడుగా వుంటాడు. 616 మీరే ఆలోచించండి. మీకే వొదిలిపెడుతున్నాను. రండి బండార్కర్, వెళ్ళాలి" అన్నాడు యుగంధర్.

"మీ డిపార్టుమెంట్ అసమర్థత వల్ల, ప్రధానిగా నా విధులు, నా బాధ్యతలు మానుకోమంటారా? వాట్ నాన్సెన్స్ యీజ్ దిస్" అరిచారు చాలా కోపంగా ప్రధాని. బండార్కర్, యుగంధర్ వైపు చూశాడు.

"యుగంధర్‌గారిని జోక్యం కల్పించుకోమనడం న్యాయంకాదు మిస్టర్ బండార్కర్. మీ ఆధ్వర్యంలో కౌంటర్ యింటలిజెంట్ డిపార్ట్‌మెంట్ ఒకటి వున్నది. విదేశ గూఢచారులు మనదేశంలో స్థావరాలు ఏర్పరచుకుని, యిన్ని ఘోరాలు, యింత కుట్ర పన్నుతుంటే ఆ కౌంటర్ యింటలిజెంట్ ఏజంట్లు యేం చేస్తున్నారు? నిద్రపోతున్నారా?" అరిచాడు మరింత ఆగ్రహంతో.

"మా శాయశక్తులా..." అంటున్నాడూ బండార్కర్.

"నోనో క్షమాపణలు. సమర్ధించుకోవటమూ కాదు నాకు కావలసింది. నాకు కావలసినది సరైన జవాబు. అంత అసమర్ధులయితే దయచేసి రాజీనామా యివ్వండి. ఉద్యోగం పట్ల శ్రద్ధ, తన కర్తవ్యం పట్ల భక్తి వున్న మనిషిని నియమిస్తాను. అంతేకానీ, పంజరంలో చిలకలా నన్ను కూర్చోమంటే కూర్చోను. ఇక వెళ్ళవచ్చు" అన్నారు ప్రధాని.

అప్పటివరకూ మౌనంగా వున్న యుగంధర్ గొంతు సవరించుకుని,

"ప్రధానిగారూ" అన్నాడు.

"నో! నో! మిష్టర్ యుగంధర్, నేను యీ విషయం యిక మాట్లాడదలచుకోలేదు. సబ్జెక్ట్ యీజ్ క్లోజ్డ్. శత్రువుల తుపాకీ గుళ్ళకి నేను ప్రాణం విడువవలసివస్తే విడుస్తాను చిరునవ్వుతో. అంతేకాని మిష్టర్ బండార్కర్ చెప్పినట్లు చెయ్యను" అని బండార్కర్ వైపు తిరిగి "మీరు రాజీనామా ఉత్తరం వెంటనే పంపవచ్చు. ఇది సలహా మాత్రం కాదు" అన్నారు ప్రధాని.

"డిటెక్టివ్ యుగంధర్‌గా కాక, ఒక సామాన్య పౌరుడిగా మీతో మాట్లాడే హక్కునాకున్నది. 'శత్రువుల తుపాకీ గుళ్ళకి చిరునవ్వుతో ప్రాణం విడుస్తాను" అన్నారు. దేశ క్షేమం కోసం, ప్రజా సంక్షేమం కోసం మీరు ఆ త్యాగం చేస్తే మీ పేరు చరిత్రలో సువర్ణాక్షరాలతో రాసిపెడతాను. ఇప్పుడు మీరు అటువంటి అపాయానికి లోనయితే దేశక్షేమానికీ, ప్రజాసంక్షేమానికీ ద్రోహం చేసినవారవుతారు. అసహనం, అహంకారం వున్న మనిషి ప్రధాని కావడం వల్ల, భారతదేశంలో ప్రజాస్వామ్యం నశించిందని ప్రపంచానికంతటికీ అర్ధమవుతుంది. మీ ప్రాణం మీద మీకు తీపి లేకపోవడం గొప్పే కానీ దేశక్షేమానికోసం మీ ప్రాణాన్ని కాపాడుకోవడం అవసరమైనప్పుడు అవసర చర్యలు తీసుకోకుండా, ఎవరి హితువు పాటించకుండా దేశాన్ని ప్రమాదానికి గురి చెయ్యడం ఔన్నత్యమూ కాదు, ఉదాత్తతా కాదు. ఒక వ్యక్తిగా మీ ప్రాణాన్ని కాపాడాలని కాదు మా ఆందోళన. నేను మరణిస్తాను, అని మీరు మొండిపట్టు పడితే ఎవరూ యేం చెయ్యలేరు. కానీ మీరు అధిష్టించిన ఆసనము ప్రధాని పదవి. ఆ ప్రధానిని కాపాడవలసిన బాధ్యత ప్రతి పౌరుడికీ వుంది. మీరు బండార్కర్‌ని రాజీనామా యివ్వమనడం మీ అసహనానికీ, అంతర్జాతీయ కుట్రల, ప్రతి కుట్రల గురించి, మీ అజ్ఞానానికీ తార్కాణం" అన్నాడు యుగంధర్ గుక్క తిప్పుకోకుండా.

"మిష్టర్ యుగంధర్ మితిమీరి మాట్లాడుతున్నారు. నేను ప్రధానినే కాదు, హోం మంత్రిని కూడా మిమ్మల్ని తక్షణం..."

"అవును తక్షణం జైలులో పెట్టించగలరు. ఆ తర్వాత రేపో ఎల్లుండో, ఏ దుర్మార్గుడి తుపాకీ గుండుకో గురి అయి మీరు ప్రాణాలు విడుస్తారు. ఆ తర్వాత దేశం ఏమయితే మీకేం?"

ప్రధాని యుగంధర్ని తీక్షణంగా చూశాడు. "ఎప్పుడూ, ఎటువంటి పరిస్థితులలోనూ ఆవేశం తెచ్చుకోని మీరు యిలా నిగ్రహం కోల్పోయి మాట్లాడుతున్నారంటే..."

"కారణం వుంది కనుక.." అన్నాడు యుగంధర్.

"ఆల్‌రైట్. కూర్చోండి. ఏం చెయ్యమంటారో చెప్పండి" అన్నారు ప్రధానమంత్రి.

"బండార్కర్ రాజీనామా యివ్వనవసరంలేదు అని చెప్పండి" అన్నాడు యుగంధర్.

**"అది ఒక షరతా?"** అడిగాడు ప్రధాని ఇష్టంలేనట్లు స్పష్టంగా సూచిస్తూ.

"షరతు కాదు. ఈ పరిస్థితుల్లో బండార్కర్ కన్నా అనుభవశాలి, దేశభక్తుడు, ప్రజ్ఞావంతుడూ అయిన మనిషి వెంటనే సి.బి.ఐ.కి డైరెక్టర్గా దొరకడు కనుక."

"మీరున్నారుగా ఆ స్థానానికి" ప్రధాని కంఠస్వరంలో కాస్త హేళన ధ్వనించింది.

"అవును. అన్ని బాధ్యతలకీ, అన్ని స్థానాలకీ సమర్ధులయిన మనుష్యులు దేశంలో వున్నారు" ప్రధాని స్థానానికి కూడా అని యుగంధర్ కంఠస్వరంలో సుస్పష్టంగా ధ్వనించింది. "కానీ ఒక్కొక్కప్పుడు ఎంత అసమర్ధుడయినా, ఎంత బుద్ధిహీనుడయినా ఆ స్థానంలో మనిషిని పంపెయ్యడం వివేకం కాదు. ఉదాహరణకు అవసరమైనప్పుడు చాకలి పేరిగాణ్ణి తెచ్చి సింహాసనం మీద కూర్చోపెట్టాడు ప్రతాపరుద్రుని మంత్రి యుగంధర్" అన్నాడు యుగంధర్.

"మిస్టర్ యుగంధర్ మీరు చాలా హద్దుమీరి మాట్లాడుతున్నారు. అంటే అవసరమైతే నా స్థానంలో"

యుగంధర్ నవ్వి "ఏమో నాకే తెలియదు. అవసరమైతే అంతపనీ చేస్తానేమో" అన్నాడు.

యుగంధర్ నవ్వుతో ప్రధానికూడా నవ్వు ఆపుకోలేక "ఇప్పుడు మీకు నేను నా స్థానంలో వుండాలా? లేక పేరిగాడు కావాలా?" అడిగాడు.

"మీరే వుండండి. ఎటొచ్చీ ప్రమాదానికి గురికాకూడదు. మీ ప్రాణరక్షణ ఏర్పాట్లు మేము చూస్తాము. నాకూ బండార్కర్కీ సర్వాధికారాలు యివ్వండి."

"ఇవ్వకపోతే?" అడిగాడు ప్రధాని.

"తీరుబడిగా పర్యవసానాలు ఆలోచించుకునే వ్యవధికూడా వుండదు" అన్నాడు యుగంధర్.

ప్రధాని అయిదు నిముషాలు మౌనంగా, దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండిపోయారు.

"మీతో ఇదివరకు నాకు ఎక్కువ పరిచయం లేకపోయినా, మీ గురించి చాలా విన్నాను. దేశంకోసం మీరు.." అని, "సరే అంగీకరిస్తున్నాను" అన్నారు ప్రధాని.

16

టెలిఫోన్ మోగింది. బండార్కరో, యుగంధరో అయ్యుండాలి అనుకుంటూ రాజు రిసీవర్ తీసి, "హల్లో" అన్నాడు.

"హల్లో గుడ్ యీవినింగ్ మిష్టర్ రాజూ" తియ్యని కంఠస్వరం.

ఆ కంఠస్వరంలో ఒక రకమైన జీర, స్వచ్ఛమైన యింగ్లీషు. ఎవరా స్త్రీ? రాజు ఆశ్చర్యంతో "ఎవరు?" అడిగాడు.

"నా పేరు ప్రస్తుతం అవసరంలేదు. మీకు ఒక విషయం చెప్పాలి. అందుకే ఫోన్ చేశాను" అన్నదామె.

"ఏమిటి?" అడిగాడు రాజు.

"మిస్ కాత్యా మా బందీగా వుంది. అంటే ఆమె ప్రాణాలు మా అరచేతుల్లో వున్నాయి. కాత్యా కంఠస్వరం వింటారా?" అడిగింది.

"అవసరంలేదు. కాత్యా మీ ఆధీనంలో వున్నదని అంగీకరిస్తాను. అయితే ఏం కావాలి? 616ని వొదిలి పెట్టాలా?" అడిగాడు రాజు.

అవతలనించి గలగలా నవ్వు వినిపించింది. "616 ఎవరు? ఆ 616 మనిషి పేరా? లేక ఇంటి నెంబరా? మనిషికి మారుపేరా? ఎవరయితే నాకేం. ఆ 616ని మీరు ఏం చేస్తే నాకేం? ఆ 61ఆ6ని మీరే దాచుకోండి."

"అయితే మీకేం కావాలి?" అడిగాడూ రాజు.

"మీరూ, యుగంధరూ వీలయినంత త్వరలో మద్రాసుకు తిరిగి వెళ్ళాలి. బండార్కర్‌ని ఎక్కువ ఉత్సాహంతో దర్యాప్తు చెయ్యవద్దని చెప్పాలి."

"చెపితే?" అడిగాడు రాజు.

"మా పని పూర్తి అయిన తర్వాత కాత్యాని వొదిలిపెడతాము. ఇరవైనాలుగు గంటలు వ్యవధి యిస్తున్నాను. ఆలోగా మీరు మద్రాసుకి తిరిగి వెళ్ళకపోతే కాత్యా శవాన్ని మీ దగ్గిరకి పంపిస్తాను. బై..బై" క్లిక్‌మన్నది టెలిఫోన్. రాజు ఆశ్చర్యంతో టెలిఫోన్ వైపే చూస్తున్నాడు.

అది అన్‌లిస్టెడ్ నెంబర్. బండార్కర్‌కీ, ఆయన డిప్యూటీకీ, యుగంధర్‌కూ, తనకూ తప్ప ఎవరికీ తెలియదు. ఆఖరకు కాత్యాకు కూడా తెలియదు. ఈ నెంబర్ ఎలా తెలిసింది? ఆ ఫోన్ చేసింది ఎవరు? ఆలోచిస్తున్నాడు. అంతలో తలుపు తెరుచుకుంది. యుగంధరూ, బండార్కరూ వచ్చారు. 616 అక్కడ వుండగా యుగంధర్ కి చెప్పవచ్చా? సందిగ్ధంలో పడ్డాడు రాజు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అడిగాడు యుగంధర్ రాజుని.

రాజు బల్లమీద వేళ్ళతో టట...టక...టట్...టనా...టనా...టక్...టక్ అని కోడ్‌లో కాత్యాని ఎవరో బంధించిన విషయం చెప్పాడు.

"ఫర్వాలేదు. 616 ముందు మనం చర్చించుకున్నా నష్టంలేదు. 6ఆ6 యిక్కడ్నించి బయటికి వెళ్ళలేడు" అన్నాడు యుగంధర్. రాజు టెలిఫోన్‌లో ఎవరో ఒక స్త్రీ తనకు చెప్పిన విషయాలన్నీ చెప్పాడు. బండార్కర్ మొహం పాలిపోయింది. యుగంధర్ ఆశ్చర్యంతో విన్నాడు.

"ఏమిటి మిస్టర్ బండార్కర్ ఈ టెలిఫోన్ నెంబరు ఎలా తెలిసింది? కాత్యాని ఎలా బంధించారు? మీరు పోలీసులకి చెప్పలేదా కాత్యాకి రక్షణ ఇవ్వమని?" అడిగాడు యుగంధర్.

"ఈ టెలిఫోన్ నెంబరు ఎలా తెలిసిందో నేనూ ఊహించలేకుండా వున్నాను" అంటూ రిసీవర్ తీసి, ఒక నెంబరు తీసి, "మిస్ కాత్యా ఏమైంది? ఎక్కడున్నది? అలాగా..అలాగా.. దటీజ్ వెరీ బాడ్" అని రిసీవర్ పెట్టేశాడు.

"సారీ మిస్టర్ యుగంధర్ పోలీస్ డిపార్ట్‌మెంట్ వారు చాలా పొరపాటు చేశారు. మార్చురీనించి కాత్యా దుఃఖంతో ఒంటిగా వీధుల వెంట తిరుగుతోందిట. కాత్యాకి శత్రువులనించి ఎటువంటి ఆపద వుండదని భావించి, సామాన్యమైన ఒక డిటెక్టివ్ కానిస్టేబుల్‌ని కాత్యాని కనిపెట్టమని పంపారుట. ఎవరో ఒకతనితో కాత్యా కారెక్కి వెళ్ళిపోయిందట" అన్నాడు బండార్కర్. "ఆ కారు నెంబరు కూడా చూడలేదా ఆ డిటెక్టివ్ కానిస్టేబుల్?" అడిగాడు యుగంధర్.

"చూశాడుట. కానీ ఆ కారు రోడ్ మీద పార్కు చేసి వుందిట బజారు వీధిలో. కాత్యా, అతను ఇంకో కారు ఎక్కి వెళ్ళిపోయి వుంటారని పోలీసు కమీషనర్ భావిస్తున్నారు."

యుగంధర్ గదిలో పచార్లు ప్రారంభించాడు. "ఇరవై నాలుగు గంటల వ్యవధా! ఇదివరలో యిలాగే యిరవై నాలుగుగంటలు వ్యవధి వున్న కేసు ఒకటి వచ్చింది. కాత్యాని కాపాడాలంటే..?"

616 చిన్నగా దగ్గాడు. యుగంధర్ 616 వైపు చూసి, "మిస్టర్ 616 ఆమె ఎవరో సహాయం చెయ్యండి" అన్నాడు.

"ఆమె ఎవరో ఆమె పేరు ఆమె చిరునామా చెప్పగలను. అంతేకాదు. కాత్యాని ఎక్కడ దాచివుంచారో కూడా చెప్పగలను."

"ప్లీజ్ చెప్పండి"

"చెపుతాను. చెప్పిన తర్వాత నన్ను వొదిలేస్తారా?" అడిగాడు 616.

"అదెలా సాధ్యం. మీరే చెప్పండి. అసలు మీరు నిజం చెపుతున్నారో, అబద్ధం చెపుతున్నారో కాత్యా మాకు దొరుకుతుందో లేదో కూడా తెలియకుండా మిమ్మల్ని వొదిలెయ్యాలా" అన్నాడు యుగంధర్.

"వెంటనే వొదిలెయ్యనవసరంలేదు. కాత్యాని మీరు రక్షించిన తర్వాత వొదిలెయ్యండి. అంతే నేను కోరేది" అన్నాడు 616.

"ఒదిలేస్తామని మీకు మాట యిచ్చి తర్వాత వొదిలెయ్యకపోతే?" అడిగాడు రాజు.

"యుగంధర్ మాట యిస్తే చాలు. ఆయన మాటకి ఆ విలువ వుంది. ఆలోచించండి యుగంధర్. నేను చెప్పానుగా డబ్బుకి అమ్ముడుపోయే వాళ్ళు చాలామంది వుంటారని. ఎవరో యీ నెంబర్ వాళ్ళకి చెప్పివుండాలి. అవునా"

యుగంధర్ తలవూపాడు.

"ప్రధానిని హత్య చెయ్యకుండా యీపాటికి మీరు తగిన కట్టుదిట్టాలు యేర్పాటు చేసి వుంటారు. నన్ను వొదిలేస్తే మీకు నష్టం ఏమిటి?" అడిగాడు 616.

యుగంధర్ ఆలోచనలో పడ్డాడు. ఈ 616ని వొదిలేస్తే మళ్ళీ ప్రధానిని 616 వొక్కడే కాదుగదా. మిగతావాళ్ళు."

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగాడు 616.

"నా మాటమీద మీకు ఎంత నమ్మకం వుందో, మీ మాటమీద నేను అంత నమ్మకం వుంచుతాను. మిమ్మల్ని వొదిలిపెట్టిన తర్వాత మళ్ళీ ప్రధానిని హత్య చెయ్యడానికి ప్రయత్నించక, మీ దేశం వెళ్ళిపోతానని మాట యివ్వగలగాలి" అడిగాడు యుగంధర్.

"వాగ్దానం చేస్తాను" అన్నాడు 616.

"అయితే కాత్యాని రక్షించిన మరుక్షణం మిమ్మల్ని వొదిలేస్తానని నేనూ వాగ్దానం చేస్తున్నాను. చెప్పండి. ఆమె ఎవరు? ఎక్కడుంటుంది? కాత్యాని ఎక్కడ దాచిపెట్టారు? మీకు తెలిసిన వివరాలన్నీ చెప్పండి" అడిగాడు యుగంధర్.

"ఒక సిగిరెట్ యివ్వండి. చెపుతాను వివరంగా" అన్నాడు 616.

17

"ఇంటర్నేషనల్ ట్రావెల్స్.

టూరిస్టు యిన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్."

ఒకసారి ఆ బోర్డు చూసి, రాజు లోపలికి వెళ్ళాడు. రాజు వేషం పూర్తిగా మార్చేసుకున్నాడు. నడక, నిలుచునే తీరు అన్నీ మార్చేశాడు. అతను భారతీయుడని ఎవరూ అతన్ని చూసి అనుకోరు.

''యస్. వాట్ కెన్ ఐ డూ ఫర్ యు సర్?'' అడిగింది రిసెప్షన్‌లో కూర్చున్న యువతి.

''మీ డైరెక్టర్ని కలుసుకోవాలి'' అన్నాడు ముక్తసరిగా.

''ఎందుకు?'' అడిగింది ఆమె.

''ఎందుకో మీకు చెపితే యిక డైరెక్టర్ని కలుసుకోవటం దేనికి?'' అన్నాడు రాజు.

''ఎప్పాయింట్‌మెంట్ వుందా?'' అడిగిందామె.

''ఈ కాయితం యివ్వండి'' అంటూ చిన్న కాయితం మీద రాబర్ట్ లూయిస్, కలకత్తా, ఇండియా, ఏసియా'' అని వ్రాశాడు.

రిసెప్షనిస్ట్ నవ్వి ''కలకత్తా అంటే చాలదూ. కలకత్తా ఇండియాలో వున్నదనీ, యిండియా ఏసియాలో వున్నదనీ వ్రాయలా?'' అడిగింది నవ్వుతూ.

''అది నా అలవాటు అన్నాడు.

''క్షణం ఆగండి. డైరెక్టరు వున్నారో లేదో చూస్తాను'' అని ఒక స్ప్రింగ్ తలుపు తెరుచుకుని లోపలికి వెళ్ళింది. రాజు సిగిరెట్ వెలిగించి అక్కడే నిలుచున్నాడు.

రెండు నిముషాల తర్వాత ఆ రిసెప్షనిస్టు తిరిగివచ్చి,

''రండి డైరెక్టరు తీరుబడిగానే వున్నారు'' అని రాజుని లోపలికి తీసికెళ్ళింది.

''మిస్ రోజిల్లా రూత్'' అని తలుపు అద్దం మీద ఎర్రని అక్షరాలున్న గదిముందు ఆగి ''వెళ్ళండి'' అని చెప్పి, రిసెప్షనిష్టు వెళ్ళిపోయింది.

రాజు తలుపు తోశాడు. వెంటనే తెరుచుకుంది. లోపలికి వెళ్ళగానే అదే మూసుకుంది. తలుపు దగ్గరే నిలుచుని గదంతా ఒకసారి కలయచూశాడు రాజు. సామాన్యమైన టూరిస్టు ఆఫీసు అధికారి గదిలా వుంది. గోడలకి మాపులు, యాత్రికుల కోసం వివిధ స్థలాల పటాలు, మెత్తని కుర్చీలు, ఏర్ కండిషన్డ్ గది, ఒక పెద్దబల్ల, బల్లవెనక రివాల్వింగ్ కుర్చీలో పాతికేళ్ళ యువతి.

''కమాన్ మిస్టర్ రాబర్ట్'' అన్నది ఆమె.

రాజు బల్ల దగ్గిరికి వెళ్ళాక ఆమె లేచి నిలుచుని ''నా పేరు రూత్. గ్లాడ్ టు మీట్ యు'' అని షేక్ హ్యాండ్ యిచ్చి, మళ్ళీ కూర్చుని రాజు పంపిన కాయితం తిప్పి తిప్పి చూస్తూ, ''మీ రాకకు కారణం?'' అడిగింది.

రాజు కళార్పకుండా ఆమెనే చూస్తున్నాడు. లేత గులాబీ రంగు చెక్కిళ్ళు, లిప్‌స్టిక్ వేసుకున్న ఎర్రని పెదిమలు, నీలంగా అందంగా వున్న కళ్ళు, భుజాల వరకూ పడుతున్న సాఫీజుట్టు, నీలం రంగు గౌను, బాగా మెడకిందకి వక్షస్థలం, ఎత్తూ, ఆకారం కనిపించేటట్టు సన్నని పొడుగు చేతివేళ్ళు.

''ఏమిటి అలా చూస్తున్నారు మిస్టర్ రాబర్ట్?'' అడిగింది రూత్.

"మీ అంత అందమైన స్త్రీతో కలిసి పనిచెయ్యవలసి వస్తుందని నాకు చెప్పలేదు. చెప్పివుంటే పదిరోజులముందే వచ్చేవాడ్ని" అన్నాడు రాజు.

"థాంక్ యు. అసలు ఎందుకు వచ్చారో చెప్పారు కారు?" అడిగింది.

"డిటెక్టివ్ యుగంధర్ యీ కేసులో జోక్యం కల్పించుకున్నారని తెలియగానే నన్ను పంపారు. ఇదివరలో యుగంధర్‌తో రెండుసార్లు ఘర్షణ పడ్డాను."

"గుడ్"

"జయించాను. మీకు సహాయంగా నన్ను పంపారు" అన్నాడు రాజు.

రూత్ ఒక నిముషం ఆలోచిస్తూ వుండిపోయింది. "పై అధికారులు మిమ్మల్ని పంపినట్టు నిదర్శనాలు చూపించగలరా?" అడిగింది.

"ఓ! అదా మీ సందేహం?" అంటూ రాజు చేతిలోంచి ఒక చిన్న తోలు సంచి తీసి, ఆమెకి యిచ్చాడు. అది పాస్‌పోర్టు. రూపం మార్చుకున్న రాజు ఫోటో వుంది. అతను అమెరికన్ దేశస్థుడనే వుంది.

"ఇంతేనా?" అడిగింది రూత్.

"ఫోటోకింద గుర్తున్నది. కొద్దిగా వేడిచేసి చూడండి" అన్నాడు రాజు.

రూత్ బల్లసొరుగులోంచి సిగరెట్ పాకెట్ తీసి, రాజుకి ఒకటి యిచ్చి, తను ఒకటి వెలిగించుకుని, ఆ లైటర్‌తోనే ఆ ఫోటో కిందవున్న తెల్లని కాయితాన్ని కాస్త వెచ్చ చేసింది. వెచ్చబడుతున్నకొద్దీ లేత కాఫీ రంగులో పొడి పొడి ఇంగ్లీషు అక్షరాలు O.I.P.L కానవచ్చాయి. రూత్ తలవూపి, పాస్‌పోర్ట్ రాజుకి తిరిగి యిచ్చేసింది. రాజు జేబులోంచి ఒక చిన్న సీసా తీసి, ఆ సీసాకి వునన్ బ్రష్‌తోనే అందులో వున్న ద్రవం O.I.P.L అక్షరాలమీద రుద్దాడు ఆ అక్షరాలు మాయమయ్యాయి.

"ఇక్కడ ఎవరూ లేరు. ఎవరికీ మన మాటలు వినిపించవు. O.I.P.L అంటే ఏమిటి?" అని అడిగింది రూత్.

"చెపుతాను. చెప్పేముందు రూత్ నీ ఆనవాలు కూడా నేను నిర్ధారణ చేసుకోవాలి" అన్నాడు రాజు.

రూత్ చిరునవ్వు నవ్వి, హ్యాండ్ బ్యాగ్‌లోంచి తన ఐడింటిఫికేషన్ కార్డు యిచ్చింది. రాజుకూడా సిగరెట్ లైటర్ వెలిగించాడు. రూత్ ఫోటోకింద O.I.P.L అక్షరాలు కనిపించాయి. రాజు, రూత్‌కి ఐడింటిఫికేషన్ కార్డు తిరిగి యిస్తూ, "ఆపరేషన్ ఇండియన్ ప్రీమియర్ లిక్విడేషన్" అన్నాడు. రూత్ తలవూపింది. రాజు జేబులోంచి యింకో కాయితం తీసి రూత్‌కి యిచ్చాడు. అది తెల్లకాయితం. ఏమీ వ్రాసిలేదు. రూత్ ఆశ్చర్యపడకుండా, బల్లసొరుగులోంచి ఒక చిన్న డూప్లికేటర్ లాటి మిషన్ తీసి, ఆ తెల్లని కాయితం అందులో పెట్టి, ఒక మీట నొక్కి క్షణంలో బయటికి తీసింది.

"రాబర్టు లూయిస్ ఏజంట్ 015తో సహకరించి పనిచెయ్యడానికి పంపుతున్నాం. ఏజంట్ 015 O.I.P.L. కి అధినేత అయినా, రాబర్ట్‌ని తనతో సమానంగా చూసుకుని బాధ్యతలు యిచ్చి, సంప్రదించి త్వరలో యీ ఆపరేషన్ ముగించమని ఆర్డర్."

మళ్ళీ సిగరెట్ లైటర్ వెలిగించి, ఆ కాయితాన్ని మంటపెట్టి ఆష్‌ట్రేలో పడేసి, పూర్తిగా ఆ కాయితం మసి అయ్యేటంతవరకూ మౌనంగా వుండి, తర్వాత నవ్వి "వెల్ కమ్ రాబర్ట్, నిజానికి నేనే హెడ్ క్వార్టర్స్‌నించి సహాయం అడుగుదామనుకుంటున్నాను. యుగంధర్ జోక్యం వల్ల పరిస్థితులు కష్టమయ్యాయి" అన్నది.

"అంటే?" అడిగాడు రాజు.

"మనలాగే ప్రధానిని హత్య చెయ్యడానికి మరో రెండు అగ్రరాజ్యాలు పూనుకున్నాయి. వాటిలో ఒక రాజ్యం గూఢచారి నాయకుడు నెంబర్ 616 అనే పేరుగల అతను యుగంధర్‌కి చిక్కిపోయాడు. ప్రధానిని హత్యచెయ్యకుండా చాలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ప్రధాని ఏ బహిరంగ సభకీ రావటంలేదు. ఇంటినించి ప్రధాని కార్యాలయానికి బులెట్ ప్రూఫ్ కారులో వెళుతున్నారు. పార్లమెంట్‌కి విజిటర్స్‌ని చాలా జాగ్రత్తగా, ఆఖరికి జేబుల్లో చీపురుపుల్ల కూడా లేకుండా తనిఖీ చేసి పంపిస్తున్నారు. ప్రధాని వున్న ప్రాంతలకి చీమనయినా రానివ్వకుండా కాపాడుతున్నారు" అన్నది రూత్.

రాజు కుర్చీలోంచి లేచివెళ్ళి రూత్‌కి ఎదురుగా బల్లమీద కూర్చుని, రూత్ భుజాలమీద చేతులు వేసి "నువ్వేం చేశావు? ఏమిటి నీ పథకం?" అడిగాడు నవ్వుతూ.

"డిటెక్టివ్ యుగంధర్ అసిస్టెంటుల్లో ఒకామె కాత్యా అదృష్టవశాత్తు మనకి చిక్కింది. ఇప్పుడు మన అధీనంలో వుంది" అన్నది రూత్.

"వెరీగుడ్ అయితే యింకా ఎందుకు దిగులు మొహం నీకు" అంటూ రాజు లేతగా వున్న రూత్ పెదిమిలమీద చిన్న ముద్దు పెట్టుకున్నాడు.

"పూర్తిగా పరిచయం కాకముందే యింత చనువు తీసుకోవడం మీకు అలవాటా రాబర్ట్?" అడిగింది రూత్. కోపంగా కాదు.

"మైడియర్ రూత్ నిన్ను చూస్తుంటే నా చేతులు,  వూరుకోవటం లేదు. నేనేం చెయ్యను? నిన్ను అంత అందంగా సృష్టించిన దేవుణ్ణి కోప్పడు అన్నాడు నవ్వుతూ.

"కాత్యా మన బందీ అయింది. యుగంధర్, సి.బి.ఐ డైరెక్టర్ బండార్కర్, రాజు సి.బి.ఐ రహస్య స్థావరంలో వున్నారు. ఆ రహస్య స్థావరం టెలిఫోన్ నెంబర్ సంపాయించాను."

"ఎలా?" అడిగాడు రాజు.

"ఒక టెలిఫోన్ ఆపరేటర్ ద్వారా పదివేలు యిచ్చాను."

"అతను పదివేలకి లొంగుతాడని నీకెలా తెలుసు?"

"మనిషి చాలా డబ్బు యిబ్బందుల్లో వున్నాడు. అంతేకాక, ఆ టెలిఫోన్ నెంబర్ అంత ముఖ్యమైనదని అతనికి తెలియదు."

"వెల్ డన్ కాత్యాని బంధించావు. తర్వాత ఏం చేశావు?" అడిగాడు రాజు.

"ఫోన్ చేశాను. యుగంధర్ లేరు. రాజు వున్నాడు. కంఠస్వరాన్ని బట్టి గుర్తుపట్టాను. రాజు కంఠస్వరం గుర్తుపట్టేందుకు నా వద్ద చాలా రికార్డయిన టేప్స్ వున్నాయి. తక్షణం యిరవై నాలుగు గంటలలో యుగంధర్నీ, రాజునీ మద్రాసుకి తిరిగి వెళ్ళిపొమ్మనీ, బండార్కర్‌ని దర్యాప్తు మానమనీ, లేదా కాత్యా శవాన్ని చూస్తారనీ బెదిరించాను."

"ఏం జవాబు చెప్పాడు రాజు?" అడిగాడు.

"జవాబు చెప్పేలోపల డిస్కనెక్ట్ చేశాను" అన్నది రూత్.

రాజు గదిలో ప్రచారం చెయ్యడం ప్రారంభించాడు. అలా అయిదు నిముషాలు మౌనంగా గడిచిపోయాయి.

**"ఏమిటి ఆలోచిస్తున్నావు** రాబర్ట్?" అడిగింది రూత్.

రాజు రూత్ వెనక్కి వెళ్ళి, ఆమె రెండు చెంపలమీద రెండు అరచేతులు వేసి, మొహం వెనక్కి తనవైపుకి త్రిప్పుకుని, "సారీ రూత్ నువ్వు చాలా పొరపాటు చేశావు" అన్నాడు.

"ఏమిటి?" అడిగింది రూత్.

"ప్రధానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక రక్షణ సడలించకపోతే కాత్యా ప్రాణాన్ని తీస్తామని"

"కాత్యాని బలి యిస్తారే కాని" అంటోంది రూత్.

"నో! నో! నీకు యుగంధర్ విషయం తెలియదు. కాత్యా అంటే ఆల్‌రైట్. తర్వాత ఆలోచిద్దాం. నేనున్నానుగా" అన్నాడు రాజు.

కాకీరంగు పాంటు, నీలం రంగు షర్టు, జుట్టు చిందరవందరగా వొదిలేసి, మీసాలు పెట్టుకుని రూపం మార్చుకున్న యుగంధర్, ఫ్యాక్టరీ వెల్డింగ్ సెక్షన్‌లో ప్రవేశించాడు. ఫోర్‌మన్ యుగంధర్ యిచ్చిన కార్డుని చూసి "అక్కడికి వెళ్ళి అతనితో కలిసి పనిచెయ్యి" అన్నాడు.

చక్రాలని సెట్ చేసి, పక్కన పెడుతున్నాడూ ఒక సర్దార్‌జీ. అంటే గెడ్డమూ, మీసాలూ, తలపాగా వున్న పంజాబీ. యుగంధర్ పక్కకి రాగానే కిందనించి పైవరకూ ఒకసారి పరీక్షగా చూసి, "నువ్వేనా కొత్తగా వచ్చిన అసిస్టెంటువి? యూనియన్ మెంబరువేనా?" అడిగాడు అతను.

"ఆఁ! నా పేరు చక్రవర్తి. మీ పేరు?" అడిగాడు యుగంధర్.

"బీనాసింగ్. ఆ చక్రాలు తీసుకుని రా" అన్నాడు అతను. ఎంత పరీక్షగా చూసినా అతను నిజంగా సర్దార్జీ అనే అనిపిస్తోంది యుగంధర్‌కి. తను పొరబడ్డాడా? 616 తనకి అబద్ధం చెప్పాడా? ఈ బీనాసింగ్ శత్రు గూఢచారుల నాయకుడా? నమ్మలేకపోయాడు. ఎలా బీనాసింగ్‌తో అసలు విషయం ప్రారంభించడం? ఆలోచిస్తున్నాడు యుగంధర్. అంతలో విరామసమయం కూత కూసింది. కార్మికులు పనులు ఆపేసి లేస్తున్నారు.

"కాంటీన్ ఎక్కడ?" అడిగాడు యుగంధర్.

"నువ్వు లంచ్ తెచ్చుకోలేదా? రా, చూపిస్తాను. నేనూ కాంటిన్‌కే వెళుతున్నాను" అన్నాడు బీనాసింగ్. కాంటిన్‌లో యిద్దరూ లంచ్ తెచ్చుకుని, బల్లల దగ్గిర కూర్చున్నారు.

"నీదేవూరు?" అడిగాడు బీనాసింగ్.

యుగంధర్ నవ్వి "అన్ని వూళ్ళూ నావే" అన్నాడు.

"అంటే?"

యుగంధర్ సమాధానం చెప్పలేదు. నవ్వి నీళ్ళ గ్లాసులో వేలుముంచి, బల్లమీద ఆ నీళ్ళతో ప్రధాని బొమ్మగీసి, ఆ బొమ్మ మెడమీద అడ్డంగా ఒక గీత గీశాడు.

"ఏమిటీ దానికి అర్థం?" అడిగాడు బీనాసింగ్.

"ఇటువంటి విషయాలలో వేరే చెప్పాలా? కింగ్, గాడ్, బ్రదర్" అన్నాడు యుగంధర్.

బీనాసింగ్ యుగంధర్ని తీక్షణంగా కళ్ళల్లోకి చూశాడు.

యుగంధర్ నవ్వి, "నేను మూడురోజుల క్రితం వచ్చాను" అన్నాడు.

"దేనికి?"

"పని త్వరగా పూర్తిచేయించమని పంపారు" అన్నాడు యుగంధర్.

"ప్రత్యేకమైన ఆదేశాలూ, సలహాలూ యిచ్చారా? నీ ఆనవాలు?" అడిగాడు బీనాసింగ్.

యుగంధర్ నవ్వి "ఆనవాలు జేబులో పెట్టుకుని తిరిగే మూర్ఖుణ్ణి కాను. నా గదిలో.."

"ఎక్కడ?" అడిగాడు బీనాసింగ్. "సాయంకాలం కలిసి వెళదాం. తీరుబడిగా మాట్లాడుకుందాం" అన్నాడు యుగంధర్. 616 అబద్ధం చెప్పలేదు.

'మొఘల్ గ్లోరీ' నైట్ క్లబ్ అండ్ బార్ ముందు రూత్ కారు ఆపింది. ఆమెతోపాటు రాజా కారు దిగాడు. నైట్‌క్లబ్ మనిషి వచ్చి కారుని తీసుకుని వెళ్ళిపోయాడు. రిజర్వ్ చేసివున్న బల్లదగ్గిరికి దారి తీసింది రూత్. ఆ బల్ల ఒక మూలగా వుంది.

"మనం ఏం మాట్లాడుకున్నా ఏమీ ఎవరికీ వినిపించదు" అన్నది రూత్ సిగిరెట్ వెలిగిస్తూ. బేరర్ చెప్పకుండానే తెచ్చి రెండు గ్లాసులు, ఒక విస్కీ సీసా, ఐస్ క్యూబ్స్ బల్లమీద పెట్టి వెళ్ళిపోయాడు.

"రాబర్ట్ ఆ చైనావాళ్ళు, రష్యావాళ్ళు కూడా జోక్యం కల్పించుకోవడంవల్ల, అంతా గొడవగా తయారయింది. ప్రధాని ప్రాంతాలకి చీమకూడా వెళ్ళకుండా కట్టుదిట్టాలు చేశారు. మీరేమైనా పథకం ఆలోచించుకుని వచ్చారా?" అడిగింది రూత్.

విస్కీ చప్పరిస్తూ తలవూపి "నాకు మాస్టర్ ప్లాన్ యిచ్చారు. పథకం విఫలం కావడానికి వీలులేదు, పి.ఎమ్ రక్షణ సిబ్బందిలో మనవాణ్ణి నియమించాను."

"వాట్! ఓ.ఐ.పి.ఎల్. ఆపరేషన్‌కి చీఫ్ అయిన నాకు తెలియకుండా" చిరుకోపంతో అంటోంది రూత్.

"కోపం తెచ్చుకోకు. పై అధికారులు చేశారు. వాళ్ళకి వున్న సదుపాయాలు, వాళ్ళ మనుష్యులు అందరిపేర్లు మనకి చెప్పరు. ఆ మహా పెద్ద యంత్రంలో మనం చిన్న చిన్న మేకుల్లాంటి వాళ్ళం. కమ్ ఆన్. లెట్ అజ్ డాన్స్" అన్నాడు.

బాండ్ వాయిస్తున్నారు. రూత్, రాజు డాన్స్ చేస్తూ అప్పుడప్పుడూ వచ్చి కాస్త విస్కీ తాగి, మళ్ళీ డాన్స్ చేస్తున్నారు.

అలా రెండుగంటలు దాటిపోయాయి.

"తల తిరుగుతోంది, సారీ రాబర్ట్ నేనింక డాన్స్ చెయ్యలేను" అన్నది.

"ఆల్ రైట్ అయితే వెళదాం" అన్నాడు రాజు.

ఇద్దరూ కారు ఎక్కారు. రాజు డ్రైవ్ చేస్తున్నాడు. "ఎక్కడికి?" అడిగింది.

"ముందు మన కార్యాలయానికి వెళ్ళాలి. ప్రస్తుతం నీ ఆధీనంలో వున్న సిబ్బందిని చేర్చాలి, తర్వాత"

"అసలు ప్లాను" అడిగింది రాజు భుజం మీద తల వాలుస్తూ.

"చెపుతాగా అప్పుడే కాదు" అంటూ రూత్‌ని పెదిమలమీద చిన్నముద్దు పెట్టుకున్నాడు.

"స్టాప్ యిట్?" అన్నది.

"ఏం?" అడిగాడు మళ్ళీ.

"కారు ఆపు పక్కగా" అరిచింది.

రాజు ఆపాడు. వెంటనే రెండు చేతులూ మెడచుట్టూ వేసి, దగ్గిరగా లాక్కుని, తన వొంటికి అతని వొళ్ళు ఆనించి, అతని పెదిమలని ముద్దిడుతూ "రాబర్ట్ ఆ కాత్యా అక్కడ వుంది. పెద్ద బ్యూటీ దాని దగ్గిరికి వెళ్ళావంటే"

రాజు రూత్‌ని గట్టిగా కావలించుకుని, "నువ్వుండగా నాకు యింకెవ్వరూ వద్దు" అన్నాడు. మళ్ళీ కారు స్టార్ట్ చేశాడు. కాత్యాని బంధించిన చోటికి తీసుకెళుతోంది. తనేం చెయ్యాలి?

18

"సారీ 616 సంకెళ్ళు తీసెయ్యలేను" అన్నాడు బండార్కర్.

616 నవ్వి "అంత యిబ్బందిగా లేదు. అప్పుడప్పుడూ సిగరెట్ యివ్వండి చాలు" అన్నాడు. రాత్రికి రాత్రి 616ని, ఎవరికీ తెలియకుండా అంతకుముందు బంధించి వుంచిన గదిలోంచి తీసుకుని తన ఆఫీసుకి తీసుకుని వెళ్ళాడు బండార్కర్.

ఆఫీసు గదికి పక్కన వున్న యింటరాగేషన్ గదిలో 616కి కావలసిన సదుపాయాలు అన్నీ ఏర్పాటు చేశాడు బండార్కర్. అంతేకాదు. అక్కడే రెండు వైర్‌లెస్ రిసీవింగ్ సెట్స్ వున్నాయి. వాటి పక్కన టేప్ రికార్డర్స్ వున్నాయి. డిటెక్టివ్ యుగంధర్ మినిమేచర్ ట్రాన్స్‌మిటింగ్ సెట్ చేతిగడియారానికి వున్నది. యుగంధర్ ఎక్కడున్నదీ, ఎవరితో మాట్లాడుతున్నదీ ఎప్పటికప్పుడు బండార్కర్ వింటున్నాడు. అది రికార్డు అవుతోంది. అలాగే రాజూ, రూత్ తో మాట్లాడూతున్న మాటలన్నీ అతను షర్టుచేతికి పెట్టుకున్న కఫ్‌లింక్స్‌కి అమర్చి వున్న ట్రాన్స్‌మిటర్ ద్వారా వినబడుతోంది. వాళ్ళిద్దరికీ, ఎప్పుడు ఏ ఆపద వచ్చినా ఆదుకునేందుకు బండార్కర్ మనుష్యులని సిద్ధంగా వుంచారు. వారి మాటలు వింటున్నాడు.

"డిటెక్టివ్ యుగంధర్, రాజులు శత్రువ్యూహంలో జొరబడ్డారన్నమాట" అన్నాడు 616.

బండార్కర్ తలవూపి, "ఆ శత్రు గూఢచారులనందర్నీ పట్టుకుంటారని నాకు నమ్మకం వుంది. ఎటొచ్చీ మీరే సహకరించడంలేదు. ఈ దేశంలో వున్న మీ గూఢచారుల పేర్లు"

"సారీ బండార్కర్ నన్ను మళ్ళీ అడగకండి. మనం ఒక ఒప్పందానికి వచ్చాం జ్ఞాపకముంచుకోండి" అన్నాడు 616.

చాందినీ చౌక్ ప్రాంతంలో, ఒక యిరుకు సందులో ఒక యింటిమేడమీద చిన్నగదిలోకి తీసుకెళ్ళాడు యుగంధర్ బీనాసింగ్‌ని.

"కూర్చో! ఆ ఆనవాలు చెప్పాలన్నావు. ముందు ఒక కప్పు టీ"

"టీ తర్వాత, ముందు నువ్వు కె.జి.బి మనిషివో కావో"

"స్టుపిడ్‌లా మాట్లాడక. మర్యాద చూపించు. నేను యిప్పుడు యీ ఆపరేషన్‌కి ముఖ్యుణ్ణి. నువ్వు నా అసిస్టెంట్‌వి. విను" అని, ఒక స్విచ్ నొక్కాడు యుగంధర్.

"కె.జి.బి 1503 కార్షినోవ్ కార్కోక్. నీకు ఒప్పచెప్పిన పని, నువ్వు త్వరగా చెయ్యకుండా, యితర దేశాల గూఢచారులకి పై చెయ్యి యిచ్చావు. అందువల్ల కామ్రేడ్ గోర్కిమోని, కె.జి.బి. 1808ని పంపుతున్నాము. అతని ఆదేశాలు తు.చ తప్పకుండా పాటించు. కామ్రేడ్ గోర్కిమోని గుర్తుపట్టే చిహ్నం అతని మెడమీద వెనక నల్లని మచ్చ వుంటుంది. అది నిజమైనదా కాదా అని నిశ్చయించుకుని, తర్వాత అతనికి అధికారం ఒప్పచెప్పు."

ఈ మాటలన్నీ రష్యన్ భాషలోనే వినపడ్డాయి.

"టేపా?" అడిగాడు బీనాసింగ్ వేషంలో వున్న శత్రువు.

"ఏదయితేనేం నీ పేరు, నీ కోడ్ నెంబర్ చెప్పానుగా. ఇప్పుడు నా ఆనవాలు చూసుకో" అన్నాడు యుగంధర్ స్వచ్ఛమైన రష్యన్ భాషలో.

బీనాసింగ్ యుగంధర్ వెనక్కి వెళ్ళి మెడవెనక వున్న మచ్చని చూశాడు. అరచేత్తో రుద్ది చూశాడు. పోలేదు. వెంటనే సెల్యూట్ చేసి, "యస్ సర్" అన్నాడు.

"ఫూల్ చేత్తో రుద్దితే పోని మచ్చ పెట్టుకుని, ఎవడో నాలా వచ్చి వుండకూడదా అదిగో అక్కడ కెమికల్స్ వున్నాయి. మచ్చ నిజమైనదీ కానిదీ సరిగా పరీక్ష చెయ్యి. నువ్వు చాలా అసమర్ధుడివి."

"నో సర్ నో సర్" అని భయపడుతూ, అక్కడ బల్లమీద కెమికల్స్ సీసాలని చూసి, ఒక సీసా తీసి అందులోని ద్రవాన్ని యుగంధర్ మెడమీద పోసి, రుద్ది "సర్ మచ్చ పోలేదు. యు ఆర్ కామ్రేడ్ గోర్కియో" అన్నాడు బీనాసింగ్.

"కామ్రేడ్ కార్కోవ్ మనకు వ్యవధి అట్టేలేదు. ప్రధానమంత్రి ప్రత్యేక రక్షణ సిబ్బందిలో మన మనిషిని ఒకణ్ణి చేర్చాము" అన్నాడు యుగంధర్.

"ఎలా?" అడిగాడు కార్కోవ్.

"దృఢసంకల్పమూ, వుత్సాహమూ, దేశభక్తి వుంటే చెయ్యలేని పని అంటూ వుండదు అతని విషయం కనుక్కునే ముందు మనం ప్రధానిని ముగించాలి."

"యస్ కామ్రేడ్"

"మనం అంటే మనదేశం ఈ పని చేసినట్టు బయటపడకూడదు. తెలిస్తే తర్వాత అంతర్జాతీయ పర్యవసానాలు చలా వుంటేయి. జాగ్రత్తగా పథకం వెయ్యాలి."

"వెరీ వెల్‌సెడ్ కామ్రేడ్"

"ఇక్కడ ఢిల్లీలోనే కాక మొత్తం దేశంలో మన మనుష్యులు ఎక్కడెక్కడ ఎంతమంది వున్నారు, వాళ్ళు ఏ ఏ పేర్లతో వున్నారు, అంతేకాదు మనతో చేతులు కలిపి, మన డబ్బుకి ఆశపడి, మన గూఢచారులుగా వున్న భారతీయుల జాబితా, వాళ్ళ వివరాలు కావాలి."

"కామ్రేడ్ గోర్కిమో! ఈ వివరాలన్నీ నేను కె.జి.బికి తెలియజేశానే."

"అవును, చూశాను. కానీ ఆ జాబితా ఎలా తీసుకురాను? పట్టుబడితే మన వ్యూహం మొత్తం నాశనం అవుతుంది."

"జాబితా తయారుచెయ్యడానికి కొంత వ్యవధి కావాలి."

"నాన్సెన్స్ ఎందుకు వ్యవధి? నీ అసమర్ధతకి యిదొక తార్కాణం."

"క్రామేడ్ గోర్కిమో నా గదిలో రహస్యంగా వ్రాసి వుంచాను. ఒకరిద్దరి పేర్లు చెప్పగలను. మొత్తం నూట అరవై నాలుగుమంది."

"సరే. యీ వోడ్కా తాగి తర్వాత నీ గదికి వెళదాము" అన్నాడు యుగంధర్. వోడ్కాసీసా తెరిచి వోడ్కా తాగుతున్నాడు. లోలోన తృప్తికీ, సంతోషానికీ అంతులేదు. '616 అంతా నిజం చెప్పాడు. ఆఖరికి వాళ్ళపేర్లు వాళ్ళ కోడ్ నెంబర్లు. ఇంకాసేపట్లో మొత్తం, యీ దేశపు గూఢచారుల ముఠా బండార్కర్‌కి చిక్కిపోతారు' అనుకున్నాడు యుగంధర్.

ఇది లజ్‌పతి రాయ్ రోడ్ కదూ?" అడిగాడు రాజు.

"గుడ్! లవర్ బాయ్ డ్రైవ్ ఆన్" అన్నది రూత్. రెండు పెద్ద గేట్లు తెరిచే వున్నాయి.

"ఊఁ, తిన్నగా లోపలికి వెళ్ళు, అన్నది రూత్.

"గేటు ముయ్యడం .. కాపలావాళ్ళు?"

"నో నో నేను అలా పనిచెయ్యను. నాది సింపుల్ మెథడ్" అని నవ్వి, రాజుని బుగ్గమీద చిన్నగా ముద్దుపెట్టుకున్నది రూత్.

"నెం 114, లక్కీ నెంబర్" అన్నాడు రాజు. కారు తిన్నగా లోపలికి తీసుకెళ్ళి పోర్టికోలో ఆపి ఇద్దరూ దిగారు. ఎవరో ఒకతను వచ్చి కారు తీసుకుని వెళ్ళిపోయాడు.

హాల్లో యాభయి ఏళ్ళ అతను, నలభయి ఏళ్ళ స్త్రీ కూర్చునున్నారు.

మిస్టర్ అండ్ మిసెస్ చోరాపాస్, ఈ యిల్లు వీళ్ళ పేర్న వుంది. మిస్టర్ చోరాపాస్ మోటారు కారు వర్తకుడు" అని ఆ యిద్దర్నీ చూసి "మీరు యిక మీ గదిలోకి వెళ్ళండి" అన్నది రూత్.

వాళ్ళిద్దరూ మాట్లాడకుండా అక్కణ్ణించి వెళ్ళిపోయారు.

"ఎలా పట్టావు వీళ్ళని?" అడిగాడు రాజు.

"ఎగైన్ సింపుల్ మై డియర్ రాబర్ట్. డాలర్స్, అమెరికన్ పౌరసత్వం రెండూ యిస్తానన్నారు. మాతృదేశం కన్నా డాలర్స్ మీద భక్తి ఎక్కువ వున్న ఆసామి యీ చోరా పాస్. ఇద్దరు కొడుకులున్నారు. ఇద్దరూ మనదేశంలో ఉద్యోగాలు చేస్తున్నారు."

"వండర్‌ఫుల్ నీ అంతటి సమర్ధురాలుండగా హెడ్‌క్వార్టర్స్ నన్ను ఎందుకు పంపారో అర్ధం కాకుండా వుంది. కమాన్ ఆ కాత్యాని చూద్దాం, ఏమైనా విశేషాలు తెలుస్తాయేమో?" అన్నాడు రాజు.

"యస్! యస్! కమ్ ఆన్. మరీ దగ్గిరకి వెళ్ళకేం" అన్నది నవ్వుతూ.

గది తలుపులు తెరుచుకోగానే కాత్యా కుర్చీలోంచి లేచింది. లోపలికి వచ్చిన యిద్దరు విదేశీయులని పరిక్షగా చూసి "ఎవరు మీరు? నన్ను యిక్కడ యెందుకు బంధించారు?" అడిగింది.

"అబ్బబ్బ ఎంత అమాయకంగా మాట్లాడుతున్నావు మిస్ కాత్యా? నువ్వు ఎవరో నాకు తెలియదనుకున్నావా? నిన్ను ఎరగా పెట్టి రాజునీ, యుగంధర్నీ" అంటూ ఫెడీమని కాత్యాని చెంపమీద కొట్టింది రూత్.

"నో! నో! అవసరమైతే తప్ప హింస పనికిరాదు రూత్. ఈ కాత్యాని బంధించి వుంచడమేనా? అంతకన్నా యీ కాత్యాద్వార మనకి వేరే ప్రయోజనం వుంటుందా?" అడిగాడు రాజు.

"బండార్కర్ రహస్యమైన ఆఫీసు నెంబరు అతి కష్టపడి కనుక్కున్నాను. ఇప్పుడు ఆ నెంబరుకి ఫోన్ చేస్తే డిస్కనెక్టెడ్ అని చెపుతున్నారు. అంటే యింకెక్కడికో మారివుండాలి. ఆ రహస్యమైన ఆ యింకో చోటు ఫోన్ నెంబర్ మనకి తెలియాలి. యుగంధర్‌తోనో, రాజుతోనో మాట్లాడాలి" అన్నది రూత్.

"ఎందుకు?"

"ప్రధానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక రక్షణ సడలించమనీ, లేకపోతే... చెప్పానుగా..."

"అదా! కాత్యా చెప్పనవసరంలేదు. ఆ నంబరు నాకు తెలుసు" అన్నాడు రాజు.

"లవర్ బాయ్ నీకెలా తెలుసు?" అడిగింది రూత్.

"అది నా వృత్తి ప్రధానిని హత్య చేసేముందు మనం మన గూఢచారులమన్న విషయం జాగ్రత్తపడాలి. మనదేశానికీ, ఆ హత్యాకాండకీ సంబంధం వున్నదని తెలిస్తే చాలా ప్రమాదం. ఆ రోజుకి దేశంలో వున్న మన గూఢచారులనందర్నీ ఒక ప్రాంతానికి చేర్చాలి. వాళ్ళకి ప్రత్యేకమైన ఆదేశాలు యివ్వాలి" అన్నాడు రాజు.

"ఏమిటవి?" అడిగింది రూత్.

"సారీ డియర్ వాళ్ళకి చెపుతున్నప్పుడు నీకూ చెపుతాను. సెక్యూరిటీ రిస్క్ ఎవరికీ ముందు చెప్పవద్దని నిశ్చయమైన ఆజ్ఞ నాకు పూర్తిజాబితా వాళ్ళ పేర్లు, చిరునామాలు, ఎవరు ఏ వృత్తిలో వున్నదీ అన్నీ కావాలి" అన్నాడు రాజు.

రూత్ రాజుని అనుమానంగా చూసి, "ఆ జాబితా ఎవరికీ యివ్వవద్దని నాకు ఆజ్ఞ ఎలా దిక్కరించటం? ఫోన్ చేసి అడుగుతాను" అన్నది.

ఎవరికి? విదేశ కార్యాలయానికా? డోంట్ బి ఫూలిష్. టెలిఫోన్‌లు టాప్ చేసి ఎవరు ఎవరితో ఏం మాట్లాడుతున్నదీ వింటున్నారు అధికారులు. ఇది యుగంధర్ చేసిన ఏర్పాటు. నామీద నమ్మకం లేకపోతే నమ్మకం కుదిరే చిహ్నం ఒకటి చూపిస్తారు. సరీ చెపుతాను. రా" అన్నాడు రాజు.

"ఆల్‌రైట్" అంది రూత్. ఇద్దరూ కాత్యా గదిలోంచి బయటికి వెళ్ళారు.

"నీ గదికి" అన్నాడు రాజు.

"కమ్ ఆన్ లవర్ బాయ్" అన్నది రూత్ రాజు చేతిలో చెయ్యివేసి.

చాలా శుభ్రంగా అన్ని సౌకర్యాలూ అమర్చబడ్డ ఏర్ కండిషన్డ్ పడకగది అది. గది మధ్యన పెద్ద మంచం మీద కూర్చుని రెండు కాళ్ళు ముడుచుకుని "చెప్పు" అన్నది.

"నీకు అనుమానం కలగవచ్చనీ, అడిగితే చెప్పమనీ నీ బయోడేటా, ఉన్నతాధికారికి తప్ప ఎవరికీ తెలియనివి నాకు చెప్పారు."

"ఏమిటి అది? అడిగింది రూత్ లేచి వెళ్ళి ఫ్రిజ్‌లోంచి సోడాసీసాలు, విస్కీసీసా తీసి, రెండు గ్లాసుల్లో పోస్తూ.

"నువ్వు ఆ950 సంవత్సరం నవంబర్ ఆ9 తేదీ న్యూయార్క్‌లో పుట్టావు. మీ నాన్నపేరు ఎడ్వర్డ్ రాబిన్సన్ మీ అమ్మపేరు మెడినా జాయిస్. నీకు ఒక అన్న, ఇద్దరు చెల్లెళ్ళు వున్నారు. అన్న పేరు..."

"స్టాప్ ది నాన్సెన్స్ ఈ వివరాలు ఎవరన్నా తెలుసుకోవచ్చు" అని విస్కీగ్లాస్ యిచ్చి "కమ్ ఆన్ హావ్ ఎ పెగ్ ఇంకేమైనా చెప్పు" అంది.

"నీకు తొందర ఎక్కువ చెపుతాను. నాలుగేళ్ళ క్రితం నువ్వు డిపార్టుమెంట్‌లో చేరావు. నిన్ను టైపిస్టుగా ముందు మాస్కో ఎంబసీలో వేశారు. అక్కడ నువ్వు చూపిన ప్రజ్ఞకి సంతోషపడి, ఆరునెలల్లోనే రష్యన్ ప్రభుత్వం పట్టుపట్టడంవల్ల వెనక్కి పిలిపించి రావల్పిండిలో అంబాసిడర్‌కి ప్రైవేటు సెక్రటరీగా నియమించారు" 616 చెప్పిన వివరాలు నిజమైనవేనా లేకపోతే...."

"గో ఆన్.." అన్నది రూత్ సిగరెట్ వెలిగించి, పొగ రాజుమీదకి వదులుతూ.

"ఇప్పుడు చాలా ఆంతరంగిక, రహస్యమైన, రొమాంటిక్ వివరాలు"

"వెల్ వెల్ చెప్పు" అన్నది రూత్.

"ఒక రష్యన్ సైనికాధికార్నించి రహస్యాలు కనుక్కునేందుకు నువ్వు ప్రయత్నిస్తున్నప్పుడు ఆ అధికారి నీ అందాన్ని చూడాలనీ, చూసి వూరుకోలేక అదేం ప్రేమో, వాంఛో, నీ కుడివైపు వక్షం మీద గోళ్ళతో రక్తం వచ్చేటట్టు రక్కాడు. ఆ పుళ్ళు మానినా, తెల్లటి రెండుగాట్లు వున్నాయి. ఇప్పుడు"

రూత్ నవ్వి "చూస్తావా?" అన్నది.

"అప్పుడేకాదు. రావల్పిండిలో నీకూ, ఒక చైనీస్ గూఢచారుడికీ స్నేహం ఏర్పడి, నువ్వు ఎవరివో తెలుసుకున్న తర్వాత ఆ చైనీస్ గూఢచారి నిన్ను చంపడానికి నీమీద పిస్తోలు పేల్చాడు. అదృష్టవశాత్తూ గురి తప్పి గుండు నీ..."

"ఆఁ చెప్పు."

"నీ తొడపైన, నీ రహస్య స్థలానికి కాస్త కింద దిగబడింది. ఆపరేషన్ చేసి గుండు తీసి కుట్లు వేశారు. ఆ గుర్తులు అక్కడ వున్నాయి."

"వెరీగుడ్.వెల్డన్. అంతేనా?" అడిగింది రూత్.

"ఇంకొక వివరం వుంది. అది యిలా చెప్పడం కన్నా మనం యిద్దరం" అంటూ రూత్‌ని దగ్గిరకి తీసుకుని కావలించుకుని చెవిలో చెప్పాడు. రూత్ నవ్వుతూ "నాటీబాయ్ ఈ విషయాలన్నీ తెలుసుకు వచ్చావన్నమాట" అన్నది.

"ఇప్పుడయినా నువ్వు నమ్ముతావా?"

గ్లాసు గ్లాసుకి తగిలించి, "యస్ మై లవర్. నువ్వు నా బాస్‌వి యీ క్షణాన్నించీ" అని కన్నుగీటి "నీకింద వుంటాను" అన్నది.

"థాంక్ యు. ఇప్పుడిక ఆ జాబితా తీసుకురా. మొత్తం జాబితా, ఎక్కడెక్కడ మన గూఢచారులు."

"చాలా థాంక్స్ 616. మాకు ఎవరికీ తెలియని రహస్యాలు, ఆ గూఢచారుల గురించి తెలుసుకుని, మాకు చెప్పినందుకు" అన్నాడు బండార్కర్.

"నాకు థాంక్స్ అవసరంలేదు. నన్ను ఎంత త్వరగా వొదిలితే అంత సంతోషిస్తాను" అన్నాడు 616.

''ఇంకేముంది. అటు యుగంధర్, యిటు రాజు రెండు శత్రుకూటాల గూఢచారుల జాబితా సంపాదిస్తున్నారుగా.''

''అవును'' అంటూ బండార్కర్ రిసీవింగ్ సెట్ వాల్యూమ్ పెంచాడు. యుగంధర్ కంఠస్వరం వినిపించింది.

''నా గదికి నీ గది యింత దగ్గిరలో వుందని తెలియదే'' అన్నాడు.

''ఎవరికీ తెలియదు. రండి కామ్రేడ్'' అని యిరుకుగా వున్న మేడమెట్లు ఎక్కి, ఒక చిన్న గదిలోకి తీసికెళ్ళాడు. ఆ గదికి కిటికీలు కూడా లేవు. పైన కప్పులో చిన్న గాజుముక్క మాత్రం వుంది వెలుగు రావడానికి.

''కూర్చోండి కామ్రేడ్ ఆ బల్ల సొరుగులో వుంది జాబితా. మీకు కాయితాలు యిస్తాను వ్రాసుకోండి'' అన్నాడూ కోర్‌కోవ్.

బండార్కర్ సంతోషంతో చప్పట్లు కొట్టి, ''శెభాష్ యుగంధర్'' అన్నాడు ఆ మాటలు విని.

వ్రాసుకోడం దేనికి. అసలు జాబితా యిచ్చెయ్యి కామ్రేడ్'' అన్నాడు యుగంధర్?

''సరే మీ ఆజ్ఞ పాటించాలి కదా'' అంటూ బల్లసొరుగు తెరిచాడు.

సొరుగు తెరుస్తున్న చప్పుడు బండార్కర్ కి వినిపించింది. బండార్కర్ కొంచెం ముందుకి వొంగాడు, ఏ ఒక్కమాట వినకుండా పోతానేమోనని.

''కామ్రేడ్ యుగంధర్ చేతులు పైకి ఎత్తిపెట్టు'' అన్న కోర్‌కోవ్ మాటలు వినిపించగానే బండార్కర్ మొహం పాలిపోయింది.

యుగంధర్ రెండు చేతులూ పైకెత్తి పెట్టాడు. తను ఎక్కడ పొరపాటు చేశాడు? తను యుగంధర్ అని యితనికి ఎలా తెలిసింది? తెలిసీ యింతసేపు నాటకం ఆడాడా? ముందు తెలిసుంటే బీనాసింగ్‌గా అతన్ని పలకరించినప్పుడే తనకేమీ తెలియదని చెప్పివుండవచ్చే తన వునికి తెలిసేటంతవరకూ ఎందుకు, యింతదూరం రానిచ్చాడు. నిజంగా ఆ బల్ల సొరుగులో జాబితా వుందా? యింత ప్రయాసపడ్డ తర్వాత యిప్పుడు అపజయం. యిప్పుడు కోర్‌కోవ్ తననేం చేస్తాడు? కాల్చి చంపేస్తాడా పిస్తోలు చప్పుడు అవుతుందని భయపడడు. సైలెన్సర్ వుంటుంది. లేకపోయినా యీ ప్రాంతాల అటువంటి చప్పుళ్ళు ఎవరూ పట్టించుకోరు. యుగంధర్ ఛాతీమీదికి గురిపెట్టి వుంది పిస్తోలు.

''యుగంధర్ నీకు ప్రాణాలతో యిక్కడ్నించి బయటపడాలని వుందా? చావలని వుందా?''

''చావాలని ఎవరికి వుంటుంది?'' అడిగాడు యుగంధర్.

''అయితే చెప్పు, నేను బీనాసింగ్‌ని కానని కోర్‌కోవ్‌నని నీకు ఎవరు చెప్పారు? ఎలా తెలుసుకున్నావు?'' అడిగాడు కోర్‌కోవ్.

''చెపుతాను. ముందు నువ్వు నాకు ఒక విషయం చెప్పు. నేను యుగంధర్‌నని తెలిసీ, ఎందుకు యింతసేపు నాటకం ఆడావు?'' అడిగాడు యుగంధర్.

''నువ్వు నిజంగా గోర్కిమో అనే నమ్మాను. నిజంగానే నీకు ఆ జాబితా యిద్దామని బల్లసొరుగు తెరిచాను. కాని..''

''కాని..?'' అడిగాడు యుగంధర్.

"గోర్కిమో అనే పేరుతో యుగంధర్ నీకు బాస్‌గా వస్తున్నాడు జాగ్రత్త" అని యీ బల్లసొరుగులో కాయితం వుంది. బహుశా నా అసిస్టెంట్ వ్రాసిపెట్టి వుండాలి."

యుగంధర్ ఆశ్చర్యానికి అంతులేదు. తను గోర్కిమో అనే మారుపేరుతో, కోర్‌కోవ్‌ను కలుసుకోబోతున్నట్టు తనకీ, బండార్కర్‌కీ, రాజుకీ తప్ప యింకెవరికీ తెలియదే ఈ కోర్‌కోవ్ అసిస్టెంట్‌కి ఎలా తెలిసి వుంటుంది? ఇప్పుడేం చెయ్యాలి?

"నీకు బతకాలని వుంటే నిజం చెప్పు. లెక్కపెడుతున్నాను. పది ఆ లోపున చెప్పు. ఒకటి...రెండు.. మూడు.."

బండార్కర్ నిలువునా వొణికిపోతున్నాడు. యుగంధర్ నిజం చెప్పినా కోర్కోవ్ యుగంధర్ని కాల్చి చంపేస్తాడు. తను, తన సిబ్బందీ కోర్కోవ్ వున్న చోటు తెలుసుకుని వెళ్ళేందుకు వ్యవధి లేదు.

"నాలుగు.. అయిదు..ఆరు..."

616 ఏడుస్తున్నాడు. "ఒక మేధావి" అంటున్నాడు.

"తొమ్మిది..పది..ఢాం" అని పిస్తోలు పేలింది.

❦❦❦

'బీప్! బీప్! బీప్' అని వినిపించగానే, "వెధవ గొడవ. సరదాగా వుండనివ్వరు" అంటూ రూత్ గోడకి వున్న ఒక చిన్న పఠం పక్కకి తోసి, దానివెనక వున్న ఒక మీట నొక్కింది. తెరుచుకుంది పెద్ద తలుపు. లోపల ఒక పెద్ద ట్రాన్స్మిటింగ్ సెట్ రిసీవర్.

"నువ్వు మాట్లాడతావా, నేను మాట్లాడనా. హెడ్ క్వార్టర్స్" అన్నది రూత్.

రాజుకి అదృష్టం కలిసివచ్చినట్టయింది. "మై డియర్! నువ్వు విశ్రాంతి తీసుకో. నేను మాట్లాడతాను" అన్నాడు.

రిసీవింగ్ సెట్టు వద్దకు వెళ్ళి, స్పీకర్ ఆన్ చెయ్యకుండా, హెడ్ ఫోన్స్ పెట్టుకుని "హల్లో" అన్నాడు.

"ఎవరు నువ్వు? రూత్‌ని పిలు"

"రూత్ పడుకున్నది. యిన్‌స్ట్రక్షన్స్" అంటున్నాడు. వెనకనించి వచ్చి రూత్ స్పీకర్ ఆన్‌చేసి, "యస్.. రూత్ హియర్" అన్నది.

"ఇప్పుడు మాట్లాడింది ఎవరు?" అవతలనించి.

"రాబర్ట్ లూయిస్. నాకు నాయకుడుగా మీరు పంపిన మనిషి"

"నాన్సెన్స్. మేము ఎవర్నీ పంపలేదు. వాడెవడో మోసగాడు. వెంటనే వాణ్ణి పట్టుకో" ఆ మాటలు స్పీకర్లోంచి వినిపిస్తుండగానే రాజు పిస్తోలు జేబులోంచి బయటికి తీశాడు.

"ఆర్ యూ షూర్?" అడిగింది రూత్.

"నువ్వు టయిం వృధా చేస్తున్నావు. త్వరగా పనిముగించుకుని తిరిగిరా. నీకు జాంబియాలో వేరేపని వుంది. ఓవర్" స్పీకర్ ఆఫ్ చేసి, అలమారుమూసి, మళ్ళీ పఠం గోడమీదకి లాగి రూత్ వెనక్కి తిరిగింది. రాజు పిస్తోలు తిన్నగా ఆమె ఛాతీమీదకి గురిపెట్టి వుంచడం చూసీచూడనట్టు నవ్వి, "తెలుసు. నీ చేతిలో పిస్తోలుంటుందని తెలుసు. అంతేకాదు. నిన్ను ఛీఫ్ పంపలేదని అనుమానమూ వుంది. రోజూ సరిగా యీ సమయానికి, హెడ్ క్వార్టర్స్‌నించి మెసేజ్ వస్తుంది. ఆ

విషయం నువ్వు చెప్పకపోవడం అనుమానానికి కారణం. అందుకే నిన్ను మాట్లాడమన్నాను. నువ్వు స్పీకర్ ఆన్ చెయ్యకుండా హెడ్‌ఫోన్ పెట్టుకోగానే.."

"ఇప్పుడదంతా అనవసర ప్రసంగం రూత్. నాకు ఆ జాబితా యివ్వు" అన్నాడు రాజు.

"తొందరెందుకు. నీ చేతిలో పిస్తోలున్నది. నేను ఎక్కడికి పారిపోతాను? ఇంతకీ నువ్వు ఎవరివి?" అడిగింది.

"నేను ఎవరయితేనేం. నీ వలలో పడి, నీ అందానికి దాసుణ్ణయి చిక్కిపోవడానికి, నువ్వు పారిపోవడానికీ"

"ఛీఛ ఒక ఆడదాన్ని అలా అవమానించకూడదు. నా అందానికేం అయినా అడుగుతాను. నిరాయుధురాల్ని, ఆడదాన్ని, నన్ను నువ్వు నిజంగా కాల్చి చంపగలవా?"

"ఆ! సందేహించను. నీ ప్రాణం కన్నా నా దేశరక్షణ నాకు ముఖ్యం."

"అవును. నీలా దేశభక్తి నీ దేశంలో అందరికీ వుంటే మా పన్నాగాలు పారేవేకావు. గాంధీజీ, నెహ్రూలతోనే పోయాయి ఆ ఆదర్శాలు."

"నీ ఉపన్యాసాలు వింటూ కూర్చునేందుకు నాకు వ్యవధిలేదు. త్వరగా" అన్నాడు రాజు.

"ఏమిటి? మా గూఢచారుల జాబితా బల్లమీద వున్న ఎర్రని డైరీలో అందరి పేర్లు వ్రాసి వున్నాయి. అయితే కోడ్‌లో వ్రాశాను."

"ఏమిటా కోడ్"

"చాలా సింపుల్ కోడ్ కమల అనేపేరు వుందనుకో వరసగా ఊర్లపేర్లు వ్రాశాను. ఆ ఊర్లపేర్లలో మొదటి అక్షరం తీసుకుంటే చాలు. అంటే కటక్, మధుర, లక్నో, కమల అవుతుంది."

"థాంక్ యు రూత్. నువ్వు వెళ్ళి ఆ గోడకి ఆనుకుని నిలుచో. నేను ఆ డైరీ తీసుకుంటాను. తర్వాత"

"తర్వాత?" అడిగింది.

"సి.బి.ఐ ఆఫీసుకి వెళదాం. లేదా వాళ్ళే యిక్కడికి వస్తారు" అన్నాడు రాజు.

యుగంధర్ ఏమయ్యాడో అనే చింత ఒక పక్క వేధిస్తున్నా, రిసీవింగ్ సెట్ స్పీకర్లోంచి రాజుకీ, రూత్‌కీ జరిగిన ఈ సంభాషణ విన్న తర్వాత బండార్కర్ మనస్సులో రాజుని మెచ్చుకున్నాడు. క్లిష్టపరిస్థితి ఏర్పడినా రాజు, ఎత్తుకు పై ఎత్తు వేశాడు. ఇక తన మనుష్యులని లజ్‌పతిరాయ్ రోడ్, నెం 114కి పంపడం రూత్‌నీ, అక్కడి మనుష్యులని పట్టుకోవడం, కాత్యాని విడిపించడం. బండార్కర్ టెలిఫోన్ రిసీవర్ తీస్తున్నాడు.

"ఈ ఎర్రని డైరీ కదూ" అడిగాడు రాజు.

"అవును. అదే" రాజు డైరీ తీసి చేతిలో పట్టుకున్నాడు. ఒక చేతిలో వున్న పిస్తోలు రూత్ మీద గురిపెట్టి వుంచి, డైరీ అట్ట తెరిచాడు. అంతే. డైరీలోంచి ఏదో పొడి ఒక్కసారిగా రాజు మొహం మీదకి జల్లులా వచ్చిపడింది. ఆ అరక్షణం కళ్ళు ఆ అరక్షణం కళ్ళు మూసుకోవడం, ఊపిరి ఆడక దగ్గడం, మరుక్షణం తల తిరిగి కిందపడిపోవడం జరిగింది.

"భయమేమీ లేదు. నీకు స్పృహ పోలేదు. ఇంకో అయిదు నిముషాల్లో కళ్ళు తెరుస్తావు. ఎటొచ్చీ నీ చేతిలో పిస్తోలుండదు. అంతే. అప్పుడు నువ్వు ఎవరివో నింపాదిగా చెప్పవచ్చు" అన్నది రూత్.

రూత్ అన్న యీ మాటలు వినగానే బండార్కర్ చకచకా తన సిబ్బందికి ఆజ్ఞలు యిచ్చాడు. తక్షణం వెళ్ళి లజపతిరాయ్ రోడ్ నెం 114 చుట్టుముట్టి, అందర్నీ బందీలుగా చెయ్యమని.

పిస్తోలు పేలుస్తున్నాడని యుగంధర్ తెలుసుకోగానే, అతను సరిగా మీటనొక్కిన క్షణానికి చటుక్కున పక్కకి తప్పుకుని, అదే సమయంలో అక్కడే వున్న కుర్చీని ఒక తన్ను తన్నాడు యుగంధర్. కుర్చీ ఆ తన్నుకి వెళ్ళి కోర్కోవ్‌మీద పడింది. కుర్చీతోపాటు యుగంధరూ ఒక్క గంతులో కోర్కోవ్ మీదకి వురికాడు. ముందు పిస్తోలు పట్టుకున్న అతని చేతిని పట్టుకుని, మెలిపెట్టాడు. "వొదిలెయ్యి.. చెయ్యి విరిగిపోతుంది" అన్నాడు యుగంధర్. కోర్కోవ్ బలహీనుడు కాడు, పిరికివాడు కాడు. పట్టు వదలలేదు సరికదా, రెండు కాళ్ళు ఎత్తి, యుగంధర్ మెడకి అడకత్తెరలా వేసి లాగుతున్నాడు. ఇది చావు బతుకుల సమస్య. యిది దేశక్షేమానికీ, దేశవినాశనానికీ సంబంధించిన సమస్య. తన మెడమీద బిగుసుకుంటున్న కాళ్ళ విషయం పట్టించుకోలేదు. కోర్కోవ్ చేతిని వెనక్కి మెలిపెట్టి, చివరికి కోర్కోవ్ చేతి మడమ క్రమని విరిగిన తర్వాత, అతని చేతిలో పిస్తోలు కిందపడిన తర్వాత, యుగంధర్ వూపిరి తీసుకున్నాడు.

"నా చెయ్యి విరిచావు. నా యీ కాళ్ళమధ్యనించి ఎవరూ యింతవరకూ తప్పించుకోలేదు. నీకు చావు తప్పదు" కోర్కోవ్. అది బెదిరింపో, నిజమో కూడా యుగంధర్ ఆలోచించలేదు. అతని కాళ్ళు తన చేతులతో విడదీయడానికి ప్రయత్నించలేదు. అతని కాళ్ళకి సత్తువ పోవాలంటే ఒకటే మార్గం. కనికరానికి తావులేదు. యుగంధర్ అతికష్టం మీద బూడ్సుకాలు పైకి లాగి, కోర్కోవ్ రెండు తొడలమధ్య పెట్టి, బలంగా నొక్కాడు. కోర్కోవ్ కనుగుడ్లు వెళ్ళుకువచ్చాయి. నాలిక బయటికి వేళ్ళాడింది. యుగంధర్ మెడమీదనించి కాళ్ళు పక్కకి పడిపోయాయి. కోర్కో మరణించాడని యుగంధర్‌కి తెలుసు. కోర్కోవ్ అనుచరులు వచ్చేముందు కోర్కోవ్ మరణించాడని అతని అనుచరులకి తెలిసేముందు ఆ జాబితా తీసుకుని అక్కణ్ణించి వెళ్ళిపోవాలి. కోర్కోవ్ శవాన్ని దాచెయ్యాలి. బల్ల సొరుగులో వున్న ఒక నల్లని పుస్తకం తీసి మడచి జేబులో పెట్టుకున్నాడు యుగంధర్. ఇప్పుడు కోర్కోవ్‌ని యేం చెయ్యాలి? ఇక్కడే శవాన్ని వొదిలివెళ్ళడం మంచిదికాదు. కోర్కోవ్ మరణించాడని ఎవరికీ తెలియకూడదు అనుకున్నాడు లోలోన యుగంధర్.

ఆ మాటలు వినగానే బండార్కర్ సంతోషంతో లేచి నిలబడ్డాడు. ఇక రాజుకూడా ఆపదలోంచి తప్పుకుంటే తప్పించగలిగితే ఆలోచిస్తున్నాడు. తనే వెళితే ఊహూ 616ని ఒంటిగా వొదిలి వెళ్ళవద్దని యుగంధర్ స్పష్టంగా చెప్పారు. యుగంధర్ రాకకోసం కాచుకోవలసిందే

"యుగంధర్ నెగ్గుతారని తెలుసు. థాంక్ గాడ్" అన్నాడు 616.

అంతలోనే స్పీకర్లోంచి మాటలు వినపడ్డాయి.

"వెల్! వెల్ మీరు కూడా సునిశితమైన ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్ వుపయోగిస్తున్నారా! నాకు తెలియదే కఫ్‌లింక్స్ ట్రాన్స్మిటర్ ఇది జపనీస్ వారు తయారు చేసింది అయ్యుండాలి. రోడ్ పేరు, యింటి నెంబరూ అందుకేనా బిగ్గరగా చెప్పావు? అంటే మీ వాళ్ళు యీ పాటికి బయలుదేరి వుండాలి. వాళ్ళు వచ్చేలోగా రాజు కమ్ ఆన్ లే" కరకరమని చప్పుడయింది. అంటే రాజు కప్ లింక్స్‌లో ట్రాన్ సిస్టర్‌ని పచ్చడి చేసింది రూత్ అని గ్రహించాడు బండార్కర్. తన మనుష్యులు వెళ్ళారా. రాజుని రక్షిస్తారా రూత్ ఆలోగా ఎక్కడికయినా బండార్కర్ ఆలోచిస్తూ "మిస్టర్ 616 రూత్‌కి ఇంకో కార్యాలయం ఎక్కడ వుందో మీకు తెలుసా?" అడిగాడు.

"సారీ! తెలియదు" అన్నాడు 616.

యుగంధర్ గది అంతా కలయచూశాడు. ఒక మూల ఒక పెద్ద బీరువావుంది. అందులో ఏముంది? తాళం వేసిలేదు. ఎందుకయినా మంచిదని, ఒక పక్కగా నిలబడి తలుపు తెరిచాడు. రకరకాల బట్టలు, విగ్గులు, మేకప్ సామాను. అంతే అవన్నీ ఒక పక్కగా తోసేసి కోర్కోవ్ శవాన్ని లాక్కెళ్ళి ఆ బీరువాలోకి తోసేశాడు. తర్వాత తలుపు మూసి, తెరుచుకోకుండా ఒక కాయితం రెండు తలుపులకీ మధ్యన పెట్టాడు. ఇరవై నాలుగు గంటల వ్యవధివుంది. ఆలోగా శవం కుళ్ళి దుర్వాసన రాదు. ఒకవేళ కోర్కోవ్ అనుచరులు అక్కడికి వస్తే, ఎవరికీ తెలియకుండా వాళ్ళని పట్టుకునేందుకు నలుగురు యింటలిజెంట్ ఆఫీసర్స్‌ని పంపించాలి. ప్రస్తుతానికి తనపని పూర్తి అయింది యిక్కడ. యుగంధర్ బయలుదేరాడు.

"హల్లో! హల్లో డిప్యూటీ చటర్జీ రిపోర్టింగ్" అన్న మాటలు వినిపించాయి స్పీకర్లోంచి.

"బండార్కర్ హియర్. ప్రొసీడ్" అన్నాడు బండార్కర్.

"లజపతిరాయ్ రోడ్ నెం 114నించి. ఇల్లు ఖాళీగా వుంది. ఎవరూ లేరు"

"వాట్ డూ యూ మీన్? యింత త్వరగా ఎలా వెళ్ళివుంటారు?"

"నాకు తెలియదు సర్. ఇల్లంతా వెతికాము, ఎవరూ లేరు."

"ఎక్కడికి వెళ్ళినదీ, సూచనలు వున్నాయేమో చూడండి."

"యస్ సర్. మళ్ళీ రిపోర్ట్ చేస్తాను. ఓవర్" అన్నాడు బండార్కర్‌తో డిప్యూటీ చటర్జీ.

కళ్ళమంటలు తగ్గి రెప్పలు తెరుస్తున్నాడు రాజు.

"వెరీగుడ్" అంటూ బాగ్‌లోంచి సిరంజి తీసి, ఒక యింజక్షన్ యిచ్చింది. ఆ ముందుకి రాజుకి స్పృహ పోలేదు. కళ్ళు మూసుకోలేదు. అయితే అతని మనస్సు, అతని శరీరం అతని ఆధీనంలో లేవు.

"పద వెళదాం" అన్నది రాజు చెయ్యిపట్టుకుని. రాజు పసిపిల్లాడిమల్లే రూత్ చెయ్యిపట్టుకుని నడుస్తున్నాడు.

"ఇక్కడే నిలబడు" అని కాత్యా గదిముందు రాజుని నిలబెట్టి రూత్ కాత్యాగదిలోకి వెళ్ళింది.

"ఎవరు నువ్వు? నీకేం కావాలి?" అడిగింది కాత్యా.

**"నేను బండార్కర్ మనిషిని.** నిన్ను విడిపించడానికి వచ్చాను" అంటూ రూత్ కాత్యా దగ్గిరగా వెళ్ళి, చటుక్కున ఆమె జబ్బలో సిరంజి గుచ్చింది. అంతే కాత్యాకూడా రాజులా అయిపోయింది. రాజునీ, కాత్యానీ చెరో చెయ్యిపట్టుకుని నడిపిస్తూ, తనలో తాను నవ్వుకుంటూ, 'థాంక్స్ టు అవర్ కెమికల్ వెల్ఫేర్ రిసెర్చ్ డిపార్ట్‌మెంట్. మనుష్యులని యిలా బొమ్మల్లా తయారుచేసే మందు యింకెవరికీ తెలియదు' అనుకున్నది లోలోన రూత్.

డిటెక్టివ్ యుగంధర్ గదిలోకి రాగానే బండార్కర్ లేచి నిలుచుని, "కొన్ని నిమిషాలపాటు నా గుండె ఆగినంత పనయింది. కంగ్రాట్స్" అన్నాడు.

"అభినందనలు, ధన్యవాదాలు నెం.616కి చెప్పాలి మిస్టర్ బండార్కర్ ఇదిగో ఈ పుస్తకంలో ఆ దేశపు గూఢచారుల పేర్లు, చిరునామాలతో సహా వివరంగా వ్రాసివుంది. కోడ్‌లో లేదు. రష్యన్ భాషలో వుంది. మీ డిపార్టుమెంట్‌కి పంపి తక్షణం దేశంలో ఏ మారుమూల ఎక్కడ ఎవరు వున్నా అరెస్టు చేయించండి. కోర్కోవ్ గదికి నలుగురు సమర్థులయిన ఆఫీసర్స్‌ని పంపి ఎవరన్నా వస్తే రహస్యంగా బందీలు చెయ్యమనండి."

"యస్, వెంటనే పంపుతాను" అంటూ రిసీవర్ తీసి, "హల్లో బండార్కర్ హియర్" అని ఆజ్ఞలు ఇచ్చాడు బండార్కర్. అంతలో స్పీకర్లోంచి "చటర్జీ రిపోర్టింగ్" అన్నమాటలు వినిపించాయి.

"బండార్కర్ హియర్. ప్రొసీడ్"

"అంతా గాలించి చూశాము. ఎక్కడా ఏ సూచనా లేదు. కారు వచ్చినట్టు వెళ్ళినట్టు గుర్తులున్నాయి. అంతే."

"ఆ కారు మీకు ఎదురు రాలేదా?"

"నో సర్."

"వాకబ్ చెయ్యండి. ఆ ప్రాంతంలో ఆ కారు ఎటు ఎక్కడికి వెళ్ళినదీ తెలుసుకోండి. క్విక్" అన్నాడు బండార్కర్.

"ఏమిటి ఈ కొత్త గొడవ?" అడిగాడు యుగంధర్.

బండార్కర్ వివరంగా చెప్పారు రాజు విషయం.

ఒకటి రెండు నిమిషాల తేడాలో రాజు, కాత్యా తేరుకున్నారు.

"వెరీగుడ్ నీ ట్రాన్స్‌మిటర్ నాశనం చేశాను. నువ్వు యిప్పుడు ఎక్కడ వున్నావో ఫాలాక్షుడికి కూడా తెలియదు. కనుక్కోలేడు. నీ ప్రాణం మీద తీపి వుంటే నువ్వు ఎవరో చెప్పు?" అన్నది రూత్, సిగరెట్ పొగ తాపీగా వదులుతూ.

అది చిన్నగది. గదిలో యిద్దరు తుపాకీలు పుచ్చుకుని నిలుచుని వున్నారు. రూత్ రాకింగ్ కుర్చీలో కూర్చుని వూగుతోంది. రాజు, కాత్యా నేలమీద పడుకుని వున్నారు.

రాజు మాట్లాడలేదు. కాత్యా మౌనంగా వుండిపోయింది.

"నువ్వు చెప్పకపోయినా నువ్వు ఎవరివో తెలుసుకోవడం కష్టంకాదు. హింసించి కాదు. అటువంటివి అవసరంలేదు. మా డిపార్టుమెంటు చాలా మందులు కనిపెట్టింది. ట్రూత్ యింజక్షన్ అంటే యింజక్షన్ యిచ్చిన తర్వాత అంతా నిజమే చెపుతావు. అది యివ్వనా?" అడిగింది రూత్.

రాజుకి తెలుసు అటువంటి యింజక్షన్ వున్నదని. ఆ యింజక్షన్ తీసుకోవడం యిష్టంలేదు.

"నా పేరు రాజు. నేను డిటెక్టివ్ యుగంధర్ అసిస్టెంట్ని" అన్నాడు.

ఓ! వాట్ ఏ సర్‌ప్రయిజ్ అండ్ వాట్ ఏ జాక్ పాట్. వండర్‌ఫుల్ ప్రఖ్యాత యుగంధర్ అసిస్టెంట్‌లు రాజు, కాత్యాలు నా బందీలు. వెరీగుడ్" అన్నది రూత్.

616కి బండార్కర్‌ని కాపలా వుండమని చెప్పి, యుగంధర్ లజపతిరాయ్ రోడ్‌కి తనే బయలుదేరాడు. యుగంధర్ రాకకోసం, బండార్కర్ డిప్యూటీ అక్కడే కాచుకున్నారు. "సారీ మిస్టర్ యుగంధర్ పదిమందిని పంపాను ఆ కారు విషయం తెలుసుకోవడానికి. చాలా కార్లు వెళ్ళాయట యిటు. ఎవరూ ఏమీ చెప్పలేకుండా వున్నారు. ఈ యింట్లో ఏ సూచనా లేదు" అన్నాడు చటర్జీ.

యుగంధర్ తలవూపి, ఆ ఇంట్లో ప్రవేశించాడు.

ప్రతి గదీ పరీక్షించసాగాడు. కాత్యాని బంధించిన గదిలోకి వెళ్ళాడు. కాత్యా హేండ్ బాగ్ చూశాడు. తెరిస్తే అందులోనూ ఏమీ సూచనలు కనిపించలేదు కాత్యా వస్తువులు తప్ప. చివరికి రూత్ పడకగదిలోకి వెళ్ళాడు. ఆ గదిలోకి వెళ్ళగానే, వాతావరణాన్ని బట్టి రాజుకీ, రూత్‌కి అక్కడే ఘర్షణ జరిగి వుండాలని గ్రహించాడు యుగంధర్. రాజు ఏదయినా సూచన ఏ గీతో, ఏ గుర్తో పెట్టాడా? నేలనీ, గోడలనీ, పరీక్ష చేస్తున్నాడు. కాస్త వంకరగా వున్న పఠం కనిపించింది. పక్కకి తోశాడు యుగంధర్. కనిపించింది. ఆ మీట నొక్కాడు. తెరుచుకుంది. లోపల ట్రాన్స్మిటర్, స్పీకర్ కనిపించాయి. స్విచ్ నొక్కాడు అవతలనించి ఏమైనా మాటలు వినిపిస్తాయేమోనని. నిశ్శబ్దం. మళ్ళా ఎప్పుడో యీ ట్రాన్స్‌మీటర్లోంచి మాటలు వినపడేది. వెనక్కి తిరగబోతున్నాడు. అంతలో బీప్ బీప్ సిగ్నల్ వినిపించింది.

స్పీకర్ వాల్యూమ్ పెంచాడు యుగంధర్.

"హల్లో మిస్టర్ యుగంధరా?" స్పీకర్లోంచి మాటలు వినిపించాయి.

యుగంధర్ ఆశ్చర్యానికి అంతులేదు. "అవును."

"మీరు అక్కడికి వచ్చారని మాకెలా తెలుసా సింపు" నవ్వు, ఆడదాని కంఠస్వరం. "టెలివిజన్, మీరు రెండు చేతులూ జేబులో పెట్టుకుని నిలుచున్నారు. అవునా మీకు రాజునీ, కాత్యాని చూడాలని వుందా? చూడవచ్చు. టిక్కెట్టు లేదు. ఫ్రీ ఎంటర్‌టయిన్‌మెంట్" మళ్ళీ పకపక నవ్వు. యుగంధర్ కోపాన్ని దిగమింకుకుని మౌనంగా వుండిపోయాడు.

నాలుగడుగులు కుడివైపుకి వెళ్ళండి. గోడమీద ఒక నల్లమరక కనిపిస్తుంది. ఆ మరకమీద వేలితో రుద్దండి. భయపడకండి యుగంధర్. ఎల్క్ట్రిక్ షాకివ్వదు" అయినా యుగంధర్ జేబులోంచి రబ్బర్ గ్లౌస్ తీసుకుని తొడుక్కుని మరకమీద రుద్దాడు. గోడ కదిలినట్లయింది. గోడకాదు కదిలింది. గోడలో ఒక భాగం. ఒక బీరువా గోడ వెనుక. ఆ బీరువాలో ఒక టెలివిజన్ సెట్.

"స్విచ్ ఆన్ చెయ్యండి. నయాపైసా ఖర్చులేకుండా వినోద కార్యక్రమం" విరగబడి నవ్వు.

యుగంధర్ స్విచ్ ఆన్ చేశాడు. అరనిముషం తర్వాత టెలివిజన్ స్క్రీన్‌మీద బొమ్మలు కనిపించాయి. రాజుకీ, కాత్యాకీ వొంటిమీద నూలుపోగు లేదు. ఇద్దరూ సబ్బు నురుగులో ఆడుకుంటున్నారు. పసిపిల్లల మల్లే నురుగు ఒకళ్ళమీద

ఒకళ్ళు పోసుకుని కిలకిలా నవ్వుతూ తిరుగుతున్నారు. వాళ్ళల్లో ఏ కోశానా సిగ్గులేదు. అంతేకాదు, వాళ్ళ కంఠస్వరాలు కూడా మారిపోయాయి. కీచుగా వున్నాయి వాళ్ళ మాటలు.

"హైపోథైరాయిడ్ కాన్‌సెన్‌ట్రేట్. తాత్కాలికంగా వీళ్ళని క్రెటిన్స్ అనవచ్చు. ఇలాగే కొంతకాలం వుంటే, తలలు చిన్నవై మనుష్యులు పొట్టయిపోతారు. అయినా యివన్నీ మీకు చెప్పటం దేనికి? మీకు తెలిసే వుంటుంది."

యుగంధర్ అప్పటికీ మాట్లాడలేదు.

"మిస్టర్ యుగంధర్ నాకు అంత ఓపిక లేదు. ఈ స్థితిలో వీళ్ళని చంపెయ్యటం కష్టంకాదు. పిస్తోలు కూడా అవసరంలేదు. చిన్న బ్లేడుతో ధమనిని కోసేస్తే చాలు. రక్తస్రావంతో చస్తారు. సోపు నురుగు ఎర్రబడుతుంది అంతే."

"అయితే ఎందుకు కాచుకున్నావు?" అడిగాడు యుగంధర్.

"మేము చెయ్యాలనుకున్న పని మీ చేత చేయించాలని."

"ఏమిటది?"

"మీ ప్రధానిని చంపటం, ఆ ఏర్పాటు మీరే చేయించండి. రేపు సాయంకాలం ఆరుగంటల లోపున. లేదా రాజు, కాత్యాలను. మళ్ళీ మీరు వచ్చి టి.విలో చూసుకోవచ్చు. మరొక విషయం, ఈ టి.వి క్లోజ్‌డ్ సర్క్యూట్ కాదు. ఈ టి.వి ట్రాన్స్‌మిటింగ్ ద్వారా మేము ఎక్కడున్నదీ తెలుసుకోలేరు. శ్రమపడకండి. కాలం వృధా చెయ్యకండి. బై. బై"

టి.విలో బొమ్మ కనిపించడంలేదు. యుగంధర్ టి.వి స్విచ్ ఆఫ్ చేశాడు.

"అందర్నీ పట్టుకున్నాము. కోర్కోవ్ జాబితాలో వున్నవాళ్ళందరూ యిప్పుడు మన బందీలు" అన్నాడు బండార్కర్.

"గుడ్ ఒక అధ్యాయం పూర్తయింది" అని రాజు, కాత్యాల విషయం చెప్పాడు యుగంధర్ బండార్కర్‌కి.

"ఆ ట్రావెల్ ఏజెన్సీ కూడా మూసేశారు. ఆ రూత్‌తో మాట్లాడాలంటే కూడా అవకాశం లేదు. రేపు సాయంకాలమే మళ్ళీ ఆలోగా" అన్నాడు యుగంధర్.

బండార్కర్‌కి ఏమీ తోచలేదు. యుగంధర్ దీర్ఘంగా ఆలోచిస్తూ పచార్లు చేస్తున్నాడు. బండార్కర్ అసిస్టెంట్ మౌనంగా నిలుచుని వున్నాడు. పదినిముషాల తర్వాత "చెప్పండి ఏదైనా పథకం ఆలోచించారా?" అడిగాడు బండార్కర్. యుగంధర్ చెప్పాడు.

"గుడ్ గాడ్ దౌత్య సంబంధాలకీ, నిబంధనలకీ విరుద్ధం. తెలిస్తే.."

"మీ డిపార్ట్‌మెంట్‌కి ఎటువంటి సంబంధమూ లేదు. మీకు తెలియదు కూడా బాధ్యత అంతా మాది. విదేశాంగ మంత్రినించి కబురు పంపే ఏర్పాటు చేస్తే చాలు" అన్నాడు యుగంధర్.

"నాకు యిష్టంలేదు" అన్నాడు బండార్కర్.

ఇష్టాయిష్టాలకీ, దౌత్య ఆచారాలకీ యిది సమయం కాదు. మీరు చేయిస్తారా, చేయించరా చెప్పండి?" చాలా కోపంగా అన్నాడు యుగంధర్. బండార్కర్ యుగంధర్ కళ్ళల్లోకి చూశాడు. బండార్కర్‌కే వొళ్ళు ఝల్లుమన్నది.

"సరే, అంతవరకే. ఆ తర్వాత మా డిపార్టుమెంటుకి సంబంధంలేదు."

"అంతేచాలు" అన్నాడు యుగంధర్.

టెలిఫోన్ మోగగానే రాయబారి ప్రీస్ట్‌లీ ఎఫర్‌సన్ విసుగ్గా రిసీవర్ తీశాడు. రెండు నిముషాలు అవతల మాటలు విని

"ఈ రాత్రివేళా? ఏమిటి అంత అవసరం? రేపు.. సరే.. వస్తున్నాను" అన్నాడు రిసీవర్ పెట్టేసి.

"ఎక్కడికి?" అడిగింది ఆయన భార్య ఎమిలీ.

"ఏదో కొంప మునిగేపనిట. వెంటనే రమ్మని విదేశాంగమంత్రి పిలుపు. వెళ్ళాలి తప్పదు" అని విసుక్కుంటూ, డ్రెస్ చేసుకుని కారు తయారుగా వుంచమని కిందిగదిలో వున్న సెక్రటరీకి ఫోన్ చేశాడు.

"నేనూ రానా?" అడిగాడు సెక్రటరీ.

"ఎందుకు? చాలా రహస్యమైన సమావేశంట. నిన్ను ఎలాగూ లోపలికి రానివ్వరు" అంటూ కారు ఎక్కాడు ఎఫర్‌సన్. దాదాపు యాభయి ఏళ్ళ మనిషి, ఠీవీ, దర్పమూ, సిరిసంపదలతో, హోదాతో కలిగే అహంకారమూ ఆయనలో అణువు అణువునా బయటపడుతూ వుంటాయి.

అది పెద్ద షెవర్లీ కారు. రాత్రి వీధుల్లో జనసంచారం లేదు. కారు స్పీడుగానే తోలుతున్నాడు డ్రైవర్. ఒకచోట రోడ్‌కి రెండుపక్కలా వీధులున్నాయి. ఎఫర్‌సన్ కారు అక్కడికి వచ్చే సమయానికి, రెండు పెద్దకార్లు అడ్డంగా వచ్చాయి. డ్రైవర్ బ్రేకు వేశాడు. మరుక్షణం ఆ రెండు కార్లలోంచి పదిమంది దిగారు. ఎఫర్‌సన్ కారుని చుట్టేశారు. వాళ్ళచేతుల్లో పిస్తోళ్ళు వున్నాయి. "కిక్కురుమనకుండా దిగండి" అన్నాడు ఒకడు.

"వాట్ యీజ్ దిస్" అడిగాడు ఎఫర్‌సన్. అతని మాటలు పూర్తికాక మునుపే తలుపు ఒకడు తెరవడం, ఎఫర్‌సన్‌ని కారులోంచి లాగడం, యింకో కారులోకి ఎక్కించడం జరిగింది. ఎఫర్‌సన్ కారు డ్రైవర్ని ఒకడు తలమీద కొట్టి, ఆ కారుని తోలుకుని పోయాడు.

రాయబారి ఎఫర్‌సన్‌కి స్పృహ వచ్చేసరికి అతనికి వొంటిమీద బట్టలు లేవు. ఒక చిన్నగదిలో మంచం మీద పడుకునున్నాడు. చటుక్కున లేచి కూర్చున్నాడు. చీకటిగా వుంది. ఒక నిముషం పట్టింది జరిగింది జ్ఞాపకం చేసుకోవడానికి. ఎవరో విదేశాంగ కార్యాలయం నించి ఫోన్ చేసినట్టు చేసి తనని ఎత్తుకు వచ్చారు.

ఎందుకు? తనేం చేశాడు? డబ్బుకోసమా? అంతలో దీపం వెలిగింది. దీపంతోపాటు అతనిమీద ఒక దుప్పటి వచ్చి పడింది.

"కప్పుకుని కూర్చోండి మిస్టర్ ఎఫర్‌సన్" అన్నాడు యుగంధర్.

"ఎవరు నువ్వు? నన్ను ఎందుకు..."

"ప్లీజ్. మీకు రక్తపోటు వుంది. ఆవేశపడకండి. చెపుతాను ముందు ఈ ఫోటోలు చూడండి" అన్నాడు యుగంధర్ ఒక పది ఫోటోలు ఎఫర్‌సన్‌కి యిస్తూ.

ఆ ఫోటోలు ఒక్కొక్కటీ చూస్తుంటే, ఎఫర్‌సన్ ముఖంలో నెత్తురు చుక్కలేదు. తర్వాత కోపంతో మొహం ఎర్రనయింది.

"ఎవరు యీ స్త్రీ? యీ ఫోటోలు ఏమిటి?" అరిచాడు.

"దీన్ని ఎత్తుకు పై యెత్తు అంటారు. హైపోథైరాయిడ్ కాన్‌సెన్‌ట్రేటెడ్ ఫాంలో మీకు యిచ్చాను. తర్వాత మీరు ఏం చేస్తున్నదీ మీకే తెలియదు. ఈ ఫోటోలు తీశాను."

"ఎందుకు? నీకేం కావాలి?" అడిగాడూ ఎఫర్‌సన్.

"చాలా స్వల్ప విషయం. అది చెపితే చాలు. మిస్ జాయిస్ రూత్ అసలు రహస్య కార్యాలయం ఎక్కడున్నది?"

"జాయిస్ రూత్ ఎవరు? ఆమె నాకు తెలియదు."

"మిష్టర్ ఎఫర్‌సన్. మీ దేశపు గూఢచారులు అందరూ ఏం చేస్తున్నారో వివరాలు మీకు తెలిసివుండకపోవచ్చు. నేను అంగీకరిస్తాను. కాని, జాయిస్ రూత్ విషయం తెలియదంటే నేను నమ్మను."

"నిజంగా నాకు తెలియదు."

"అయితే మీ దురదృష్టం. ఈ ఫోటోలు మీ భార్యకీ, మీ పిల్లలకీ, అన్ని దేశాలలో అన్ని పత్రికలకీ పంపుతాను" అన్నాడు యుగంధర్. ఎఫర్‌సన్ డబ్బు యిచ్చి యుగంధర్ నియమించిన యింకో స్త్రీ, నగ్నంగా ఆత్మీయంగా వున్న అశ్లీలమైన, అసభ్యకరమైన ఫోటోలు అవి. ఎఫర్‌సన్ నిముషం పాటు మౌనంగా వుండిపోయాడు.

"నా పేరు యుగంధర్. బహుశా నా పేరు మీరు వినే వుంటారు. ఆ రూత్ జాయిస్, నా అసిస్టెంట్స్‌ని బందీలుగా చేసి రేపు సాయంకాలం లోపున చంపేస్తానన్నది. వాళ్ళని రక్షించటమే నాకు కావలసింది. మీరు రూత్ జాయిస్ ఎక్కడ వున్నదో చెప్పండి చాలు. తర్వాత యీ ఫోటోలు, నెగటివ్‌లు మీకు యిచ్చేస్తాను. మీరు కాల్చిపారెయ్యవచ్చు."

"రూత్ విషయం నేను చెబితే.."

"మీరు చెప్పారని నేను ఎవరికీ చెప్పను. ఎవరికీ తెలియదు. తక్షణం నిశ్చయించండి. చెపుతారా? వెంటనే పత్రికలకి పంపనా? పొద్దునకల్లా అన్ని పత్రికల్లో యీ ఫోటోలు ప్రకటిస్తారు."

"రూత్ ఎక్కడున్నదీ చెపితే నిజంగా యీ ఫోటోలు.."

"నేను మోసం చెయ్యను. నిజంగా రూత్ ఎక్కడున్నదీ చెప్పారంటే.."

ఎఫర్‌సన్ చెప్పేశాడు. "అంతే నాకు తెలిసింది. అక్కడ ఎవరు ఎంతమంది వున్నారో, ఏం చేస్తున్నారో నాకు తెలియదు" అన్నాడు.

"మీకు తెలిసుండదని నాకూ తెలుసు. ఇదిగో ఫోన్. మీ భార్య ఖంగారుపడకుండా పనిమీద వుండిపోయాననీ, పొద్దున్న కానీ రాలేననీ చెప్పండి. పొద్దునకల్లా మీరు యింటికి వెళ్ళిపోవచ్చు" అన్నాడు యుగంధర్.

మబ్బుల్లో తేలిపోతున్న మనిషి నేలమీదికి దిగుతున్నట్లనిపించింది రాజుకి. క్షణక్షణాల మీద తన మనస్సు, తన శరీరం తన అధీనంలోకి వచ్చాయి. తను ఎక్కడున్నదీ అప్పుడు గ్రహించాడు. సబ్బు నురుగులో అలా తేలిపోతున్నాడు. దిగిపోతున్నాడు. కాస్తంత దూరంలో నగ్నంగా సబ్బునురుగులో ఆడుకుంటున్న కాత్యాని చూశాడు. దూరంగా రాకింగ్ కుర్చీలో కూర్చుని సిగరెట్ తాగుతూ. ఏదో చదువుకుంటూన్న రూత్‌ని గమనించాడు. తను తేరుకున్నాడని గ్రహిస్తే మళ్ళీ వీళ్ళు తనకి అదేదో మందు యిస్తారు. అందువల్ల నురుగులో ఆడుకుంటూ, నవ్వుతూ అలా అలా అడుగులు వేసుకుంటూ కాత్యాని సమీపించాడు రాజు. కాత్యా నురుగును తీసి తలమీద పోసుకుంటున్నది. కాత్యాని గట్టిగా కావలించుకుని, చెవిలో

"కాత్యా" అన్నాడు రాజు. "రాజు! నువ్వా" అన్నది కాత్యా. అంటే కాత్యాకూడా నటిస్తోందన్నమాట. ఇద్దరూ సబ్బునురుగులో పొర్లుతూ ఆడుకుంటూ ఎవరికి కలిగిన అనుభవాలు వాళ్ళు యింకొకళ్ళకి చెప్పుకున్నారు.

"మనం ఎక్కడున్నదీ మనకి తెలియదు. రూత్ వెనక పిస్తోళ్ళు పట్టుకుని ఇద్దరు నిలుచునున్నారు. రూత్ బ్యాగ్‌లోనే వుండి వుండాలి ఎర్రని డైరీ. ఆ ఎర్రని డైరీ తీసుకుని మనం యిక్కడ్నించి బయటపడాలి" అన్నాడు రాజు.

"ఎలా?" అడిగింది కాత్యా.

"ఆలోచిస్తాను. ఆలోచించి చెపుతాను. నువ్వు తయారుగా వుండు."

ఆ యింటికి ఎన్నిరకాల ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ రక్షణలు వున్నాయో, ఆ యింట్లో ఎంతమంది కాపలా వున్నారో, అంటే ఎన్నెన్ని రక్షణ ఏర్పాట్లున్నాయో యుగంధర్‌కి తెలియదు. అన్నిటినీ అధిగమించి, అందర్నీ నెగ్గి, రాజునీ, కాత్యానీ రక్షించి తను ప్రాణాలతో బయటపడగలడా? తను తెచ్చుకున్న పరికరాలు చాలా. ఆలోచిస్తూ ఆ యింటికి యాభయి గజాల దూరంలో నిలుచున్నాడు యుగంధర్. తెగించాలి. తప్పదు. దృఢనిశ్చయంతో యుగంధర్ ముందుకి కదిలాడు. ప్రహరీగోడ మరీ ఎత్తుగా లేదు. యుగంధర్ జేబులోంచి ఒక తీగ తీశాడు. ఒక చివర్న రబ్బరు తొడిగి వుంది ఆ తీగకి, దాన్ని గోడమీద విసిరేశాడు. తళుకు తళుకుమని మెరుపు మెరిసింది. అంటే ఎలక్ట్రిక్ కరెంటు వున్న తీగని గోడమీద పెట్టారు. ఎవరయినా గోడ ఎక్కితే కరెంటుకి చస్తాడు. రెండు రబ్బరు మోటారు ట్యూబ్‌లు గోడమీదకి వేశాడు యుగంధర్. తర్వాత నెమ్మదిగా ఆ ట్యూబ్‌ల మీద కాలుపెట్టి, అవతలకి దూకాడు. అవసరమైతే పారిపోవడానికి. ఆ ట్యూబ్‌లు అక్కడే వుంచి చుట్టూ చూశాడు. పెద్దతోట, దూరంగా యిల్లు. ఇంటి పోర్టికోలో ఒక జవాను కూర్చుని వున్నాడు. వాడి చేతిలో ఒక తుపాకీ వున్నది. అడుగులో అడుగు వేసుకుంటూ యుగంధర్ ఆ పోర్టికో ప్రాంతాలకి వెళ్ళి, గుబురుగా వున్న ఒక పొద వెనక నిలబడి, జేబులోంచి ఒక పిస్తోలులాంటిది తీశాడు. ఆ పిస్తోలు ఆ జవాను మీద గురిపెట్టి నొక్కాడు మీట. చప్పుడు కాలేదు. అందులో గుండులేదు. సన్నని సూది. మరుక్షణం కిక్కురుమనకుండా పక్కకి వాలిపోయాడు. పోర్టికోలో దీపం వెలుగుతోంది. ధైర్యంగా యుగంధర్ పోర్టికోలోకి వెళ్ళలేదు. పక్కపక్కగా వెళ్ళి చనిపోయిన ఆ జవానుని చెట్టు వెనక్కి లాగేశాడు. అరక్షణంలో అతని వేషం తను వేసుకుని, తన సామానులన్నీ తన జేబులో పెట్టుకుని, అతని తుపాకీ తీసుకుని పోర్టికోలోకి వెళ్ళాడు యుగంధర్. పోర్టికోలో పచార్లు చేస్తున్నట్లు నటిస్తూ తలుపు పరీక్షగా చూశాడు. ఏమీ కనిపించలేదు కాని తలుపు పక్కన బజర్ కనిపించింది. నొక్కితే. ధైర్యం చెయ్యాలి. నొక్కాడు. మరుక్షణం తలుపు తెరుచుకుంది. యిద్దరు బయటికి వచ్చి "ఏమిటి ఎడ్మండ్?" అడుగుతున్నారు. తుపాకీ వెనక్కి తిప్పి ఒక దెబ్బతో యిద్దర్నీ తలమీద కొట్టాడు యుగంధర్.

చిన్న మూలుగు మూలిగి ఇద్దరూ కిందపడ్డారు. పడిపోయిన యిద్దర్నీ ఒక పక్కకి తోసేసి యుగంధర్ లోపలికి వెళ్ళాడు. ఎందుకయినా మంచిదని తలుపు తెరిచి వుంచాడు. అది పెద్ద హాలు. ఒక్క వస్తువుకూడా లేదు. ఎటు వెళ్ళాలి. ఎటూ తలుపులు లేవు. ఇంకెవరూ మనుష్యులు లేరు. రహస్యమైన మార్గం. ఆ మార్గానికి కీలకం వుందా? ఎలా తెలుసుకోవడం? ఆలోచిస్తూ రెండడుగులు ముందుకి వేశాడు యుగంధర్.

అంతే నేల విరిగిపడినట్టయింది. తను నిలుచున్నచోటు తన బరువుకి వంగిపోయినట్లయింది. జ్రుమని పైనించి కిందికి వేగంగా పడుతున్న బంతిలా కింద పడుతున్నాడు. మోసపోయాడు. అదే యుగంధర్ ఆలోచన పడిపోతూ.

"**నువ్వు ఎంతసేపు** ఊపిరి బిగపట్టగలవు?" అడిగాడు రాజు.

"ఎంతసేపు ఊపిరి బిగపట్టాలి?" అడిగింది కాత్యా.

"చాలాసేపు. మనం కనిపించకపోతే ఒకరో, ఇద్దరో, ఆ తుపాకీల వాళ్ళు యీ నురుగులోకి వస్తారు. అప్పుడు."

"అర్థమైంది" అన్నది కాత్యా. రాజూ, కాత్యా యిద్దరూ కనిపించకుండా సబ్బునురుగులో దాక్కున్నారు. పుస్తకం చదువుతున్న రూత్, అప్పుడప్పుడూ వాళ్ళవైపు చూస్తూనే వుంది. రెండు నిముషాలయినా రాజు, కాత్యాలు కనిపించక పోయేసరికి "గుడ్ గాడ్ ఊపిరి ఆడక చచ్చారా? మీరిద్దరూ వెళ్ళి వాళ్ళని బయటకి తీసుకురండి" అని చెప్పింది తుపాకీలు పట్టుకున్న యిద్దరికీ. వాళ్ళు తుపాకీలు కిందపెట్టి నురుగులోకి వెళ్ళారు. సబ్బు నురుగులో అంతసేపట్నించీ వున్న రాజు, కాత్యాలకి అలవాటయిపోయింది. ఆ కొత్తవాళ్ళకి అలవాటు లేక నెమ్మదిగా యిటూ, అటూ తడుముతున్నారు. రాజు ఒకణ్ణీ, కాత్యా ఒకణ్ణీ కాళ్ళు పట్టుకుని నురుగులోకి లాగేశారు. వాళ్ళు కింద నురుగులోకి పడడం ఏమిటి, మరుక్షణం వాళ్ళు మళ్ళీ లేవకుండా వాళ్ళని కణతలమీద కరాటే దెబ్బలు కొట్టడమేమిటి క్షణంలో జరిగిపోయింది. ఆ యిద్దరూ యింక లేవరు. వాళ్ళ బతుకులు అంతమయ్యాయి.

"వాళ్ళని మనం ఏమో చేసినట్టు రూత్‌కి అనుమానం కలుగకూడదు. మళ్ళీ యథాప్రకారం నురుగులో ఆడుకుందాం" అన్నాడు రాజు.

"ఆర్థర్, జేమ్స్ ఏమయ్యారు? డామిట్ ఇద్దరూ నురుగులో పడి చచ్చారా?" అనుకుంటూ రూత్ లేచి నిలబడింది.

"వెళ్ళి రూత్‌ని" అడిగింది కాత్యా.

"ప్రమాదం. రూత్ చేతిలో పిస్తోలున్నది. కాస్త ఓపికపట్టు" అన్నాడు రాజు.

విరగబడి నవ్వాడు మనిషిలా లేడు, రాక్షసుడిలా వున్నాడు. నల్లగా దట్టమైన వుంగరాల దుబ్బుజుట్టు, యుగంధర్ కన్నా పొడుగు, లావు. చేతులకి యినుపగోళ్ళలాంటివి.

"పైన ఏం జరుగుతుందో చూడడమే నా పని. యీ కంతలోంచి నిన్నేం చెయ్యాలో బాస్ చెపుతారు రా" అన్నాడు అతను.

అతనితో కలయబడటమా లేక బాస్ దగ్గరికి వెళ్ళడమా? ఇతనితో వెళితే ఆ బాస్ అంటే రూత్‌దే పై చేయి అవుతుంది.

"పద" అన్నాడు యుగంధర్. అతను యుగంధర్ చెయ్యి పట్టుకోడానికి దగ్గరికి వచ్చాడు. రాగానే యుగంధర్ ఎగిరి, కాలితో అతని గెడ్డం మీద ఒక తన్ను తన్నాడు. ఆ తన్నుకి మరెవరయినా అయితే అరఫర్లాంగు దూరం వెళ్ళిపడేవాడు. కానీ వాడు చెట్టుబోదెలా నిలబడి, "రాస్కెల్ అంత పొగరా?" అంటూ రెండు చేతులూ పైకెత్తాడు. ఆ చేతులు తనమీద పడితే

తన మాడు చీలిపోతుంది అని యుగంధర్‌కి తెలుసు. వాణ్ణి మోకాళ్ళమీద మళ్ళీ తన్నాడు. ఈసారి ఒక్క అడుగు వెనక్కి వెళ్ళాడు వాడు.

"నన్నా.. నువ్వు" అని మృగంలా గర్జుస్తూ మీదకి వచ్చాడు వాడూ. బాగా దగ్గరికి రానిచ్చి, యుగంధర్ పక్కకి జరిగి, రెండు చేతులూ బిగించి వాణ్ణి మెడమీద కొట్టాడు. ఆ దెబ్బకి తట్టుకుని లేచినవాడు ఎవడూ లేడు. కానీ వీడు క్షణంలో వెనక్కి తిరిగి, యుగంధర్ని కాళ్ళు పట్టి లాగి కిందపడేసి, ఛాతీమీద కూర్చుని, "నన్ను కొట్టి బతుకుదామనే. నీ ప్రతి నరం వూడదీసి, ప్రతి ఎముక విడివిడిగా విరగకొట్టి..."

యుగంధర్ ఆ బరువుకి కదలలేకుండా వున్నాడు. వాడు యుగంధర్ తలమీద బాదడానికి రెండుచేతులూ పైకెత్తాడు.

"ఆర్థర్! జేమ్స్ డామిట్ ఏమయ్యారు మీరు? రాజూ కాత్యా మీరిద్దరూ బయటికి రండి" అన్నది రూత్ రాజు, కాత్యాలు యింకా తన మందు మత్తులో వున్నారనే భ్రమలో.

రాజు, కాత్యాలు నెమ్మదిగా సబ్బు నురుగులోంచి బయటికి వస్తున్నారు. రూత్ చేతిలో పిస్తోలు ఎగరగొట్టాలి. ఆ తర్వాత రాజు ఆలోచిస్తూ రూత్ దగ్గరికి వెళుతున్నాడు. రాజు కళ్ళని చూసింది. అంతే. తెలుసుకుంది రూత్ రాజు మత్తులో లేడని.

"ఆగు కాలుస్తాను" అన్నది పిస్తోలు రాజు ఛాతీమీద గురిపెట్టి. రాజు ఆగిపోయాడు.

"చేతులు పైకెత్తిపెట్టి వుంచు. అలా వెనక్కి వెళ్ళండి. ఊ!"

రాజు, కాత్యాలు వెనక్కి వెళుతున్నారు. ఇంకొక అడుగు వేస్తే మళ్ళీ నురుగులో పడతారు. పడితే తప్పించుకునే అవకాశం పోతుంది. ఏం చెయ్యాలి?

డిటెక్టివ్ యుగంధర్‌ది సామాన్యుడి బలం కాదు. అతని శరీరంలో ప్రతి కండరం, ప్రతి అణువు శిక్షణ పొందిన సైనికుల్లాంటి యంత్రాలు. ఆ రాక్షసుడి రెండు చేతులూ తనమీదకి వస్తుండగా రెండుకాళ్ళు ముడిచి వాణ్ణి వీపులో ఒక తన్ను తన్నాడు. ఈసారి ఆ తన్నులో తన బలం అంతా కూడదీసి తన్నాడు. వాడు అవతల గోడకి వెళ్ళిపడ్డాడు. పడుతూ, తల గోడకి కొట్టుకుని, మూలుగుతున్నాడు ఆయాసంతో రొప్పుతూ.

యుగంధర్ లేచి వాడిదగ్గిరకి వెళ్ళి, జుట్టు పట్టుకుని మరి రెండుసార్లు గోడకి తల బాది, "మీ బాస్ దగ్గరికి వెళ్ళేదారి ఏది? చెప్పు లేదా చస్తావు" అన్నాడు.

అంత బలశాలీ ఏడుస్తున్నాడు. నైతికబలం లేని శారీరక బలం నిష్ప్రయోజనం. అపజయంతోపాటు ఆత్మబలం పోతుంది.

"చెపుతాను. చంపవద్దు"

"చెప్పు."

"ఆ గోడ దగ్గరికి వెళ్ళి కింద వున్న చిన్న మీట నొక్కితే తలుపు తెరుచుకుంటుంది. మెట్లున్నాయి. మెట్లు దిగితే కింద మా బాస్."

"అక్కడ ఎందరున్నారు.?"

"నాకు తెలియదు.."

ఆ రాక్షసుడికి మళ్ళీ అప్పుడప్పుడే స్పృహ రాకుండా, యుగంధర్ వాడికి స్పృహ పోయేందుకు యింజెక్షన్ యిచ్చి, ఆ మీట నొక్కి చప్పుడు చెయ్యకుండా మెట్లు దిగుతున్నాడు.

"ఊఁ! ఏమిటి ఆలస్యం రాజూ నా విషయం నీకు తెలియదు. నవ్వుతూ మాట్లాడినంత మాత్రాన జాలి చూపిస్తాననుకోకు. వెనక్కి యింకొక అడుగు" అరిచింది రూత్ పిస్తోలు రాజుమీద గురిపెట్టి.

రాజు పక్కనే నిలుచున్న కాత్యా తనకీ, రూత్‌కీ మధ్య వున్న దూరం లెక్క వేసుకుంది. రాజుని పక్కకి ఒక్క తోపు తోసి, తను ఒక్క వురుకున వెళ్ళి రూత్ మీద పడింది. రూత్ పిస్తోలు పేల్చింది. కానీ, రాజు గుండుబారినించి తప్పించుకోవటం వల్ల అతనికి తగలలేదు. రూత్ కిందపడింది. మళ్ళీ పిస్తోలు కాత్యామీద గురిపెట్టి కాలవబోతోంది.

అంతలో ఆమె చేతిలో పిస్తోలు ఎగిరిపోయింది ఒక్క తన్నుతో.

"మిస్ జాయిస్ రూత్. లే లేచి నిలబడు నీ ఆటకట్టింది" అన్నాడు యుగంధర్.

"మిష్టర్ ఎఫర్‌సన్ ఇవిగో ఫోటోలు. ఇవిగో నెగిటివ్‌లు. మీరే కాల్చి వెయ్యండి" అన్నాడు యుగంధర్.

"థాంక్‌యు. థాంక్ యు వెరీమచ్" అన్నాడు ఎఫర్‌సన్.

"మీ బట్టలు తెచ్చిస్తాను వేసుకోండి. మీ కారు మీ డ్రైవర్‌తో సహా బయట వుంది. ఇంటికి వెళ్ళండి. దయచేసి ఎవరికయినా చెప్పడంకానీ, దౌత్యరీత్యా గొడవ చెయ్యడం కానీ చెయ్యవద్దు. మీ డ్రైవర్‌కి కూడా చెప్పండి. ఈ ఫోటోలు ఒక సెట్టు నా వద్ద వుంచుకుంటున్నాను. వారం రోజుల తర్వాత మీరు గొడవ చెయ్యలేదని తెలిసిన తర్వాత మీకు నేనే స్వయంగా తెచ్చి యిస్తాను."

"థాంక్‌యు.. నేను ఎవరికీ ఏమీ చెప్పను."

"అంతేకాదు. ఇకనించీ మీ గూఢచారులని మా దేశంలో అడుగు పెట్టవద్దని కనీసం మీరు రాయబారిగా వున్నంతకాలం నిష్కర్షగా మీ ప్రభుత్వానికి చెప్పండి."

"యస్.. యస్, సీరియస్‌గా చెపుతాను."

"గుడ్‌బై" అన్నాడు యుగంధర్.

యుగంధర్, రాజూ, కాత్యా రూత్‌తోపాటు బండార్కర్ గదిలోకి వెళ్ళారు.

"మిస్టర్ బండార్కర్ ఈమె మిస్ జాయిస్ రూత్. ఇదిగో డైరీలో వాళ్ళ గూఢచారుల పేర్లు, పూర్తి వివరాలు వున్నాయి. ఆ తర్వాత పని మీది" అన్నాడు యుగంధర్.

"మిస్టర్ యుగంధర్ అసాధ్యమైనది సాధించారు. మిమ్మల్ని.." అంటున్నాడు బండార్కర్.

"ఇంకా పూర్తికాలేదు మిస్టర్ బండార్కర్. ఒక ముఠా గూఢచారులు మిగిలి వున్నారు"

"616కి మాట యిచ్చారుగా. మాట తప్పుతారా?"

"తప్పను. 616ని సురక్షితంగా అతని దేశానికి పంపిస్తాను. అంతేకాదు, మిస్ జాయిస్ రూత్ సహాయం చేస్తే ఆమెనీ సురక్షితంగా ఆమె దేశానికి పంపిస్తాను" అన్నాడు యుగంధర్.

"అదేమిటి యుగంధర్. మన చేతికి చిక్కిన గూఢచారుల అధినేతలనందర్నీ వొదిలేస్తే.."

"ప్రమాదం ఏమీ లేదు. రూత్‌ని మనం జైలులో పెట్టినా, చంపినా, రూత్ స్థానంలో యింకొకరు వస్తారు. మిస్ జాయిస్ రూత్. నాకు సహాయ పడతావా చెప్పు. సహాయం చేస్తే నీకు ఏ ఆపదా రాకుండా నిన్ను మీ దేశానికి పంపిస్తాను. నా మాటమీద నీకు నమ్మకం వుందా?"

"అడగండి నాకు చేతనయితే చేస్తాను" అన్నది రూత్.

"చాలా బిజీగా వున్నాను. ఈ రోజే బడ్జెట్ పార్లమెంట్‌లో ప్రవేశపెడుతున్నది. క్లుప్తంగా చెప్పి త్వరగా వెళ్ళండి" అన్నారు ప్రధాని.

"మీ ప్రత్యేక అంగరక్షకులలో యిద్దరు శత్రు గూఢచారులున్నారని మీకు ఎవరయినా చెప్పారా?" అడిగాడు యుగంధర్.

"యస్ వాళ్ళిద్దరి పేర్లు మీరు చెప్పారనీ, వాళ్ళని బంధించామని, నా సెక్యూరిటీ చీఫ్ పదినిముషాల క్రితమే చెప్పాడు" అన్నారు ప్రధాని ఫైల్స్ తిరగవేస్తూ.

"నా పేరు మీకు తెలుసా?" అడిగాడు యుగంధర్.

"ఏమిటా పిచ్చి ప్రశ్న. తెలియకపోతే లోపలికి రానిచ్చేవాణ్ణా నేను? అన్నట్‌ళు మీకు ధన్యవాదాలు చెప్పాలి కదూ. రెండు దేశాల గూఢచారులనందర్నీ పట్టి యిచ్చారుట."

"నాకు ఒక్కడికే కాదు. రాజు, కాత్యా, బండార్కర్, ఛటర్జీ మొత్తం మీ సి.బి.ఐ. ఇంటలిజెంట్‌కి ధన్యవాదాలు చెప్పండి."

"మీ వినయానికి చాలా సంతోషం. దేశంలో మీలాటివాళ్ళు యింకా ఎందరో వుంటే..."

"అవును. నాలాటి వాళ్ళకి వినయం వున్నా లేకపోయినా దేశానికి యిబ్బంది లేదు. అధికారంలో వున్నవాళ్ళకి ముఖ్యంగా వినయం అవసరం" అన్నాడు యుగంధర్.

ప్రధాని యుగంధర్ వైపు చూసి, "మీరు వచ్చిన పని?" అడిగాడు.

"నాకు పేరిగాడు కావాలి."

"అంటే.."

"రేపు సాయంకాలం రామలీలా గ్రౌండ్స్‌లో ప్రధాని ఉపన్యసించాలి."

"ఏ విషయం గురించి? సందర్భం?"

"అవన్నీ నేను చూసుకుంటాను. రేపు మధ్యాహ్నం తర్వాత మళ్ళీ నానించి కబురు అందేవరకూ మీరు ఎవరికీ కనిపించకుండా..."

"ఏమిటీ? నేను ఎక్కడో వుంటే రామలీలా గ్రౌండ్స్‌లో మాట్లాడడం ఎలా?"

"మీరు కారు. పేరిగాడు" అన్నాడు యుగంధర్.

"నన్ను నవ్వులపాలు చేద్దామనా?"

"కాదు. మిమ్మల్ని, దేశాన్ని రక్షిద్దామని."

"నేను అంగీకరించలేను."

"అంగీకరించి తీరాలి. తప్పదు. మీకు తీరికలేదన్నారు. వ్యవధి వుంటే చెప్పేవాడ్ని.

"చెప్పండి అవసరమనిపిస్తే."

యుగంధర్ చెప్పాడు.

అద్దం ముందునించి కదిలి, రెండడుగులు వెనక్కి వేసి ఒకసారి అద్దంలో చూసుకుని నవ్వుకుని నమస్కారం పెట్టి, "మేరే భాయియో, బెహెనో!" అన్నాడు. అని వెనక్కి తిరిగి, "ఎలా వుంది?" అడిగాడు.

యుగంధర్, బండార్కర్, కాత్యా కుర్చీలలో కూర్చుని రాజుని చూసి, రాజు ఆ మాటలు అనగానే చప్పట్లు కొట్టి, "వెరీగుడ్" అన్నారు.

యుగంధర్ లేచివెళ్ళి, రాజు భుజం మీద చెయ్యివేసి "ఆకారంలో ఒడ్డూపొడుగులో ప్రధాని వేషం నేను వెయ్యడానికి వీలుకాలేదు రాజూ. ఐ యామ్ సారీ" అన్నాడు.

"దేనికి? నాకు ఏం ఆపద ఇన్ని.." అన్నాడు నవ్వుతూ.

"అవును. బులెట్ ప్రూఫ్ కోటు, అన్నీ వేసుకున్నావు. కానీ మొహం?" అడిగాడు యుగంధర్.

"మీరు కంగారుపడవద్దు. టపాకాయలు పేలే సమయానికి నేను నా మొహం కాపాడుకుంటాను. లేకపోతే రూత్‌లాటి వాళ్ళు..." అని నవ్వేశాడు.

దాదాపు ఢిల్లీ నగరం అంతా ఖాళీ అయి, వున్న జనాభాలో అంతా రామలీలా గ్రౌండ్స్‌కి వచ్చిందా అనిపించేటట్టు యిసుక రాలనంత జనసందోహం. వేదికకి ముందు వివిధ దేశాల రాయబారులకి ఆసనాలు. మైలు దూరం వరకూ లౌడ్ స్పీకర్స్. రంగు రంగు కాగితాల తోరణాలు. ప్రధాని అతి ముఖ్యమైన ఉపన్యాసం యిస్తారని ప్రకటన చేశారు. అందువల్లే అంత జనసమ్మర్దం. సరిగా అయిదు గంటల ముప్పయి నిముషాలకి ప్రధాని కారు వేదిక దగ్గరగా వచ్చి ఆగింది. అందరికీ నమస్కారాలు పెడుతూ ప్రధాని మెట్లు ఎక్కి వేదికమీదకి వెళ్ళారు. ఎవరో పూలమాల వేశారు. ప్రధాని మైకు ఫోన్ దగ్గిరికి వెళ్ళి, "నమస్కారాలు. ఈ ఓజు దేశ ప్రజల్ని వుద్దేశించి ప్రత్యేకంగా నేను ప్రసంగించడానికి ముఖ్యకారణం ఏమంటే దేశంలో అరాచకం ఎక్కువ అవుతోంది. ప్రజా శ్రేయస్సు కోసం, ప్రజాస్వామ్యం కోసం ప్రజలు తమ తమ అభిప్రాయాలని, కష్టసుఖాలని బాహాటంగా వెల్లడి చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన సదుపాయాలన్నీ దుర్వినియోగం చేసుకుంటున్నారు.

అకారణంగా, అత్యవసర ఉత్పత్తి కర్మాగారాలలో సమ్మెలు, విద్యార్థులలో చదువుమీద శ్రద్ధ తగ్గి, ఏదో నెపంతో దౌర్జన్యంతో విద్యాసంస్థల మూసివేతలు, వెనుకబడ్డ జాతులమీద అకారణ ద్వేషాలు యిలా దేశంలో ఒక క్రమమూ, ఒక పద్ధతీ శిక్షణా లేకుండా పోయాయి. కడుపునిండా తిండీ, వొంటినిండా కప్పే బట్టా, ఎండకీ వానకీ ఎరకాకుండా తలమీద కప్పులేని పేదరికపు జనం ఘోష పట్టించుకోకుండా ఎవరికి వారు, వారి స్వార్థ...."

ఢాం! ఢాం!ఢాం!ఢాం.. వేదిక వైపు గుళ్ళ వర్షం కురుస్తున్నాయి. మొదటి తుపాకీ పేలగానే ప్రధాని వేషంలో వున్న రాజు నిటారుగా నేలమీద పడి వెనక్కి దొర్లిపోయాడు.

లక్షలాది జనం ఒక్కసారిగా ఘొల్లుమన్నారు ప్రధాని పోయారని. కానీ జనంలో ఎక్కడికక్కడ తయారుగా వున్న ఆర్మీ, పోలీస్ సిబ్బంది, దుండగులను అక్కడికక్కడ పట్టుకుంది.

"ప్రధాని...ప్రధాని.." అరుస్తున్నారు జనం.

"ప్రజలు ప్రధానికోసం గొడవ పడిపోతారని చెప్పానుగా యుగంధర్. యిప్పుడేం చేద్దాం" అడిగాడూ బండార్కర్.

"రాజునే లేచి నిలబడి..." అన్నాడు నవ్వుతూ యుగంధర్.

"ప్రయోజనం లేదు. కిందపడీ దొర్లడంలో రాజు మేకప్ పూర్తిగా పోయింది. అతని జుట్టు స్పష్టంగా కనిపిస్తోంది" అన్నాడు బండార్కర్.

"అయితే ప్రజలకి నిజం చెప్పెయ్యాలి. ప్రధాని మరణించలేదని. మారువేషంలో.."

"అదేనేను చెప్పింది. ప్రజల దృష్టిలో నా మాన మర్యాదలు ఏమవుతాయి?"

అన్న మాటలు వినిపించగానే యుగంధర్, బండార్కర్ వెనక్కి తిరిగి చూశారు.

వాళ్ళ వెనక్కి ఎప్పుడు, ఎలా వచ్చారో ప్రధాని వచ్చి నిలబడ్డారు. ఎవరూ తనని గుర్తుపట్టకుండాణ పూర్తిగా శాలువా కప్పుకున్నారు.

"ఇప్పుడిక ప్రమాదం ఏమీ లేదుగా. నేను" అంటూ ప్రధాని మైక్ దగ్గరికి వెళ్ళి "సభాసదులారా నాకేమీ కాలేదు. నాకేమీ ఆపద సంభవించలేదు. దయుచేసి, అందరూ శాంతించండి" అన్నారు ప్రధాని.

ప్రజలు చప్పట్లు కొడుతున్నారు.

యుగంధర్ బండార్కర్ వైపు చూసి, "ఈ పర్యవసానం నేను ఆలోచించనేలేదు. ప్రధాని."

"లేకపోతే ప్రధాని ఎలా అవుతారు" అన్నాడు బండార్కర్.

"నన్ను హత్యచేసి ప్రభుత్వం పడగొట్టి, దేశంలో అల్లకల్లోలం కలగచేసి, మనదేశాన్ని పరోక్షంగా తమ ఆధీనం చేసుకుందామని కొన్ని అగ్రరాజ్యాలు చేసిన కుట్రని తెలుసుకుని, కుట్రదారులని పట్టుకున్న డిటెక్టివ్ యుగంధర్‌గారికి నేనేకాదు, మీరందరూ ధన్యవాదాలు చెప్పుకోవాలి. అంతేకాదు, మనమంతా ఆయనకి రుణపడి వున్నాం. ఆ రుణం తీర్చుకోలేము కానీ, కనీసం" అని పక్కకు వెళ్ళి, యుగంధర్ని వేదికమీదకి తీసుకువచ్చి చెయ్యి జాపారు ప్రధాని. ఎవరో పెద్ద పూలమాల యిచ్చారు. యుగంధర్‌కి ప్రధాని పూలమాల వేసి "ప్రతిభా, ప్రజ్ఞ, మేధస్సు, విజ్ఞానమూ, బలమూ, ధైర్యమూ, దేశభక్తి కల యుగంధర్‌కి శుభాకాంక్షలు చెవులు చిల్లులు పడేటట్లు చప్పట్లు కొడుతున్నారు జనం.

జాయిస్ రూత్‌ని విమానాశ్రయానికి తీసుకుని వెళ్ళి విమానం ఎక్కించి, 616 దగ్గరికి వెళ్ళారు యుగంధర్, రాజు, కాత్యా, బండార్కర్. యుగంధర్ని చూడగానే 616 మండిపోతూ "యుగంధర్ మీరు యిలా మోసం చేస్తారని అనుకోలేదు. మీ మాట నమ్మాను" అన్నాడు.

"616 నేను మోసం చెయ్యలేదు. మీరు మీ దేశం వెళ్ళేందుకు అన్ని ఏర్పాట్లు చేశాను. వెంటనే బయలుదేరి వెళ్ళవచ్చు" అన్నాడు యుగంధర్.

"అవును వెళ్ళవచ్చు. వెళ్ళిన తర్వాత నా అనుచరులనందర్నీ అప్పగించినందుకు నన్ను చంపేస్తారు" ఏడుస్తున్నాడు 616.

యుగంధర్ 616 దగ్గరకు వెళ్ళి భుజం మీద చెయ్యివేసి, "మైడియర్ 616 మీ గూఢచారుల గురించి మీరు నాకేమీ చెప్పలేదుగా. నిజం చెప్పండి. చెప్పారా?" అడిగాడు యుగంధర్.

616 నీళ్ళు నిండిన కళ్ళతో తలపైకి ఎత్తి, "అవును నేను చెప్పలేదు. మరి ఎలా తెలిసింది?" అడిగాడు.

"జాయిస్ గురించి, గోర్కిమో గురించి మీకు ఎలా తెలుసో, జాయిస్ రూత్‌కి కూడా మీ గురించి, మీ ముఠాగురించి వివరాలు తెలుసు. రూత్ చెప్పింది. వెంటనే మీ అనుచరులనందర్నీ ఢిల్లీకి రమ్మనీ, ప్రాణం తెగించి అయినా సరే ప్రధానిని హత్య చెయ్యాలనీ కబురు పంపాము. ఎక్కడికక్కడ వాళ్ళని పట్టుకుందామనీ, యింత నాటకం అవసరంలేదనీ బండార్కర్ చెప్పారు. కానీ కొంతమంది చిక్కకుండా పారిపోతారేమోనని ఈ నాటకం ఆడించాను."

"బాగా ఆడించారు నాటకం. నాతోనూ నాటకం ఆడారు మిస్టర్ యుగంధర్. మీ చేతులతోనే నన్ను చంపెయ్యండి. మీ కసి తీరుతుంది. నా సమస్య తీరుతుంది" అన్నాడు.

"అవసరంలేదు 616. ఇదిగో టేపు. జాయిస్ రూత్ చెప్పిన వివరాలన్నీ టేప్ చేశాను. ఈ టేపును అధికారులకి వినిపించండి. తప్పు మీదికాదని వాళ్ళకి తెలుస్తుంది" అన్నాడు.

616 పెదవులమీద చిరునవ్వు వెలిగింది. "నిజంగా?" అడిగాడు.

"కావలిస్తే వినండి. ఇంకో గంటలో మీ విమానం బయలుదేరుతుంది. దయచేసి త్వరగా బయలుదేరండి. మరొక విషయం. ఇక మళ్ళీ యీ దేశానికి రావద్దు. ఈసారి వస్తే మీ ప్రాణమో, నా ప్రాణమో అంతే. ఒకళ్ళమే మిగులుతాము" అన్నాడు యుగంధర్.